PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 338 | విజయవాడ, గురువారం 10 జులై 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 10 July 2025 | Rs



శభాష్ శ్రామికా!

దిగ్విజయంగా సార్వత్రిక సమ్మె

దేశవ్యాప్తంగా కదంతొక్కిన కష్టజీవులు

ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై రాష్ట్రంలోనూ రణనినాదం

విజయవాడలో రథం సెంటర్ వద్ద నిర్వహించిన శ్రామిక మహా ప్రదర్శనలో ఒక భాగం

తూర్పు - పడమర, ఉత్తరం - దక్షిణం దేశవ్యాప్తంగా కష్టజీవులు కదంతొక్కారు. దేశంలోని సహజ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ అనుయాయులకు కట్టబెడుతూ శ్రమదోపిడికీ వత్తాసు పలుకుతూ.. గ్రామీణ జీవనోపాధుల ఉసురు తీస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, వివిధ రాష్ట్రాల్లోని దాని భాగస్వామ్య ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై శ్రామికలోకం సమరభేరీ మోగించింది. సార్వత్రిక సమరనాదమై దిగ్విజయంగా సమ్మె చేపట్టారు. హిమగిరుల చెంతన యాపిల్ తోటలు మొదలుకొని సింగరేణి బొగ్గు గనుల వరకు, పోర్టులు మొదలు ప్రత్యేక ఆర్థిక మండళ్ల వరకు శ్రామిక వాడలన్నింటా సమ్మె సైరన్ మోగింది. అదానీ, అంబానీల సేవలో తరిస్తూ కార్మిక కోడ్లతో, వ్యవసాయ చీకటి చట్టాలతో వేధింపులకు గురి చేస్తున్న మోడీ సర్కార్‌పై కార్మికులు, అసంఘటిత రంగ శ్రామికులు, స్కీమ్ వర్కర్లు, రైతులు, వ్యవసాయ కార్మికులతో సహా 25 కోట్ల మందికి పైగా ప్రజానీకం పోరునాదమై ఉద్యమించారు. భారీ ప్రదర్శనలు చేపట్టి కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలను ఖండించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ సమరోత్సాహంతో సమ్మె విజయవంతంగా చేపట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇటీవల పనిగంటలు పెంచడంపై కార్మికుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. కష్టజీవులకు మద్దతుగా వామపక్షాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, పాత్రికేయులు, న్యాయవాదులు ఇలా సకల జనావళి ఎక్కడికక్కడ వేలాదిగా తరలివచ్చి సంఘీభావం తెలియజేశారు. కార్మిక, కర్షక పోరాట చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన శ్రమజీవులకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం తదితర పక్షాలు, సంఘాలు అభినందనలు తెలిపాయి. (వార్తలు 3, 5,10 పేజీల్లో)

గుజరాత్‌లో ఘోరం

వడోదరలో వంతెన కూలి 11 మంది మృతి



వడోదర : గుజరాత్‌లో మరోఘోరం చోటుచేసుకుంది. గుజరాత్ మోడల్ అంటూ ప్రధాని మోడీ ప్రచారం చేసుకుంటున్న ఆ రాష్ట్రంలోని వడోదరలో మరో వంతెన కుప్పకూలి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో మరో ఆరుగురిని రెస్క్యూ బృందాలు కాపాడాయని గుజరాత్ హోంమంత్రి సంఘ్వీ వెల్లడించారు. పద్రా వద్ద మహిసాగర్ నదిపై ఉన్న గంభీర వంతెన ఒక్కసారిగా కూలటంతో నాలుగు వాహనాలు నదిలో పడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. ముగ్గురిని నది నుంచి సజీవంగా బయటకు తీశారు. ఇప్పటి వరకు ఆరు మృత దేహాలను గుర్తించగా, మరికొందరు నదీ గర్భంలో చిక్కుకుపోయినట్టు అనుమానిస్తున్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. గుజరాత్ నుంచి సౌరాష్ట్రకు వెళ్లేందుకు ప్రధాన మార్గంగా ఉన్న ఈ వంతెన వడోదర-ఆనంద్ పట్టణాలను కలుపుతోంది. ఈ ప్రమాదంతో ఆ రెండు పట్టణాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సరైన మరమ్మతులు లేకపోవడం వల్లే వంతెన కూలినట్టు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. రాష్ట్రంలో తరచూ వంతెనలు కుప్పకూలుతున్నా సరైన చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2022లో మోర్బిలో వంతెన కూలిన ప్రమాదంలో అత్యధికంగా 141 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో అనేక వాహనాలు వంతెన మీదుగా వెళుతున్నాయని స్థానికులు చెప్పారు. ఈ ఏడాది మార్చిలో అహ్మదాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ గాంట్రీ కుప్పకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమీక్ష నిలిపివేయాల్సిందే

- బీహార్‌లో పెల్లుబికిన ప్రజాగ్రహం
- రహదారుల దిగ్బంధనంతో స్తంభించిన జన జీవనం
- ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యానికి ప్రమాదం : రాహుల్, ఎంఎ బేబి, తేజస్వి

3

అమెరికా కక్షతో క్యూబాకు కష్టం

- సహాయానికి ఎన్‌సిఎస్‌సి పిలుపు

5

మరింతగా భూ సేకరణ

- రెండేళ్లలో పలు సంస్థలకు పందేరం
- స్పేస్ పాలసీకి ఆమోదం
- మంత్రి మండలి నిర్ణయం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతాంగం నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ రాష్ట్రంలో భూ సేకరణ ప్రక్రియ మాత్రం ఆగడం లేదు. రానున్న రెండేళ్ల కాలంలో మరింతగా భూములను సేకరించి వివిధ సంస్థలకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ దిశలో పలు నిర్ణయాలను తీసుకున్నారు. రామాయపట్నం పోర్టు రెండోదశ, బిపిసిఎల్ పెట్రోలియం, రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ప్రాజెక్టు, ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్, ఇంటిగ్రేటెడ్ సోలార్‌సెల్ మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్టులతో పాటు వివిధ పారిశ్రామిక టౌన్‌షిప్ ప్రాజెక్టులకు రానున్న రెండేళ్లలో భూములు సేకరించి ఇవ్వాలన్న ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు నెల్లూరు జిల్లాలో కందుకూరు, కావలిలో ఒక స్పెషల్ కలెక్టర్ యూనిట్, 5 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యూనిట్లను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. మంత్రి వర్గంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారధి మీడియాకు వెల్లడించారు.

అమరావతిలో భూ కేటాయింపుల సమీక్ష

అమరావతిలో భూమి కేటాయింపు నిబంధనలు -2017, భూమి కేటాయింపు నియంత్రణలు2017 ప్రకారం సిఆర్‌డిఎ ప్రాంతంలో వివిధ సంస్థలకు భూమి కేటాయింపులను సమీక్షించే ప్రతిపాదనకు మంత్రి మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే ఆరు కేంద్రప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిన 34.59 ఎకరాలను 33.39 ఎకరాలకు కుదించడం, నిర్మాణాలకు ముందుకు రాని గెయిల్, అంబికా సంస్థలకు కేటాయించిన భూములను రద్దు చేసేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపినట్లు ఆయన చెప్పారు. అమరావతి నేలపాడులో నిర్మాణంలో ఉన్న శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో పాటు ఆల్‌ఇండియా సర్వీసెస్ అధికారుల నివాస సముదాయాల పనులు వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు, దీనికోసం రూ.524.70 కోట్ల నిధులు మంజూరుకు ఆమోదం చెప్పినట్లు మంత్రి తెలిపారు. రాజధాని నగరానికి మిగతా 5లో

ఇలాగైతే కొత్త మంత్రులొస్తారు...!

- కేబినెట్‌లో సిఎం తీవ్ర అసంతృప్తి

2

మామిడి రైతులను ఆదుకోవడంలో విఫలం

- రాష్ట్ర ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం
- పోలీసుల ఆంక్షలు, ఉద్రికత్తల నడుమ బంగారుపాళ్యం పర్యటన
- తోపులాట, గందరగోళం



బంగారుపాళ్యం మామిడికాయల మండీ వద్ద మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి, బంగారుపాళ్యం)

మామిడి రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. మామిడిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మామిడి రైతుల కష్టాలను తెలుసుకోవడానికి చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం యార్డుకు బుధవారం ఆయన వచ్చారు. జగన్ పర్యటన ఆద్యంతం ఉద్రిక్తత, నిర్బంధాల నడుమ సాగింది. ఆయన షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి గత అనుభవాల దృష్ట్యా అధికార యంత్రాంగం అలర్ట్ అయ్యింది. భద్రతా కారణాల పేరిట 500 మంది కంటే ఎక్కువమంది పార్టీ శ్రేణులు రావడానికి వీల్లేదంటూ ఎస్‌పి ఆంక్షలు విధించారు. రోడ్డు షోకు అనుమతి ఇవ్వలేదు. అయితే, ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు, కడప జిల్లాలోని పార్టీ నాయకులూ ప్రతి మండలం నుంచి 15 నుంచి 20 కారుల్లోనూ, ద్విచక్ర వాహనాల్లోనూ భారీగా తరలి వచ్చారు. వారితో కలిసి కొత్తపల్లి నుంచి మార్కెట్ యార్డు వరకూ పెద్ద సంఖ్యలో వాహనాలతో జగన్ రోడ్డు షో నిర్వహించారు. బెంగళూరు నుంచి అరగొండ ఫ్లైఓవర్ వద్దకు 30 మందికే పోలీసులు అనుమతి ఇవ్వగా వందలాది మంది దూసుకొచ్చారు. దీంతో, తోపులాట జరిగింది. అనుమతి ఇచ్చిన సంఖ్య కంటే అదనంగా వచ్చిన వారిని జగన్ రాక ముందే పోలీసులు అడ్డుకొని తిప్పి పంపేశారు. ఎన్ని ఆంక్షలు విధించినా కార్యకర్తలు, అభిమానులు అడ్డదారుల్లో మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. ఒకానొక దశలో మార్కెట్ యార్డులోకి అనుమతి లేదంటూ పోలీసులు నిరాకరించడంతో వందల సంఖ్యలో గేట్లు తోసుకుని రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆంక్షలు ఉల్లంఘించి కార్యకర్తలు భారీగా తరలి రావడంతో పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జీ చేశారు. ఆ క్రమంలో కాన్వాయ్ నుంచి చిత్తూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి జారిపడిపోవడంతో మిగతా 5లో

ఆపిల్ కొత్త సిఒఒగా సబిహ్ ఖాన్

- భారత సంతతి వాసికి కీలక బాధ్యతలు



శాన్‌ఫ్రాన్సిస్కో : దిగ్గజ టెక్ కంపెనీ ఆపిల్ నూతన చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఒఒ)గా సబిహ్ ఖాన్ నియమితులయ్యారు. భారతీయ మూలాలున్న సబిహ్ ఈ కొత్త బాధ్యతలను జులై చివరలో స్వీకరించనున్నారు. ప్రస్తుత సిఒఒ జెఫ్ విలియమ్స్ రాజీనామా చేయడంతో ఆ కంపెనీ సిఇఒ టిమ్ కుక్ అదనపు బాధ్యతలను చూస్తున్నారు. సబిహ్ ఖాన్‌కు ఆపిల్‌లో 30 ఏళ్ల అనుభవం ఉంది. గత ఆరేళ్లుగా యాపిల్ గ్లోబెల్ సప్లయి చెయిన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఉత్పత్తి కార్యకలాపాలనూ పర్యవేక్షిస్తున్నారు. ఖాన్ ఉత్తరప్రదేశ్ మొరాదాబాద్ జిల్లాలో 1966వ సంవత్సరంలో జన్మించారు. అక్కడే ఫిఫ్త్ గ్రేడ్ వరకు చదువుకున్నారు. ఆ తర్వాత ఆయన కుటుంబం సింగపుర్‌కు అక్కడి నుంచి అమెరికాకు వలస వెళ్లింది.

అదనపు వసూళ్ల వాపస్

విద్యుత్‌శాఖ మంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

సర్దుబాటు ఛార్జీలపై స్పష్టత ఇవ్వాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల (ఎఫ్‌పిపిసిఎ)పై స్పష్టతనివ్వాలని, 2024-25లో అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వినియోగదారులకు వెంటనే వాపస్ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. దీనిపై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు బుధవారం లేఖ రాశారు. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కాములు) 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇంధన సర్దుబాటు (ఎఫ్‌పిపిసిఎ) ఛార్జీలను ప్రతినెలా యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా రూ.2,787.19 కోట్లు విద్యుత్ వినియోగదారుల నుండి వసూలు చేశాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎపిఇఆర్‌సి (విద్యుత్ నియంత్రణ మండలి) వెబ్‌సైట్‌లో సమ్మరీ పేరిట ఇచ్చిన టేబుల్‌లో స్పష్టం చేశారని వివరించారు. యూనిట్‌కు 40 పైసలు చొప్పున తాము వసూలు చేసినదానికంటే అదనంగా రూ.842.68 కోట్లు ట్రూఅప్ వసూలుకు అనుమతించబోమని ఆ పిటిషన్‌లో ఎస్‌పిడిసిఎల్, సిపిడిసిఎల్ సంస్థలు ఎపిఇఆర్‌సికి విజ్ఞప్తి చేశాయని, ఈ నెల విద్యుత్ బిల్లులో సైతం యూనిట్‌కు 40 పైసలను ఎఫ్‌పిపిసిఎగా వసూలు చేశారని తెలిపారు. ఇంత (రూ.2,787కోట్లు) వసూలు చేసిన డిస్కాములు 'ఈ ఏడాది ఎలాంటి ఛార్జీలు పెరగలేదని' పత్రికా ప్రకటనలివ్వడం వాస్తవాలను కప్పిపుచ్చడమే అవుతుందని, ఇలా ప్రజలను తప్పుదారి పట్టించడం సమంజసం కాదని అన్నారు.

అంతేగాక ఈ ఏడాది రూ.450 కోట్లు మిగులు లభించిందని విద్యుత్ సంస్థలు పేర్కొనడం మరీ విచిత్రంగా ఉందని, ఈ మిగులు కూడా పైన పేర్కొన్న రూ.2,787 కోట్లు వినియోగదారుల సొమ్ములోదేనని వివరించారు. ప్రజలను తప్పుదారి పట్టించే రీతిలో ప్రకటనలు చేస్తున్న పంపిణీ సంస్థలను సరిదిద్దాలని, వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్ ఛార్జీలపై స్పష్టతనిస్తూ ప్రభుత్వమే నేరుగా ప్రకటన చేయాలని, అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వినియోగదారులకు తక్షణం వాపస్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆగష్టు నెల నుండి నెలనెలా వసూలు చేస్తున్న యూనిట్‌కు 40 పైసలు సర్దుబాటు ఛార్జీల వసూళ్లను నిలిపివేయాల్సిందిగా సిపిఎం కోరింది.

ఇలాగైతే కొత్త మంత్రులొస్తారు...!

కేబినెట్‌లో సిఎం తీవ్ర అసంతృప్తి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

'మంత్రులు ఇలా ఉంటే ఎలా..? మహిళా ఎంఎల్‌ఏపై అనుచిత వ్యాఖ్యలు చేసినా స్పందించరా...? ఆ అంశంమీదే కాదు. ప్రతిపక్షం అదేపనిగా దుష్ప్రచారం చేస్తుంటే మాట్లాడక పోతే ఎలా...? ఇలాగైతే కొత్త మంత్రులు వస్తారు' అని రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నట్లు సమాచారం. బుధవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులతో విడిగా ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రుల పనితీరుపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'ఒక్క మంత్రి పనితీరు కూడా ఆశించిన మేరకు లేదని ఆయన అన్నట్లు సమాచారం. తనకు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని, అయితే, ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ లేదని ఆయన అన్నట్లు తెలిసింది. 'కాంగ్రెస్‌తో చాలా పోరాడాం. ఆ పార్టీతో ఎప్పుడు పోరాడినా రాజకీయమే ఉండేది. ఇప్పటి ప్రతిపక్షం అలా కాదు. వ్యక్తిగత అంశాలతో అదే పనిగా దుష్ప్రచారం చేస్తోంది' అని ఆయన అన్నారు. ఇంత జరుగుతున్నా మంత్రులు స్పందించడం లేదని, కొందరు మంత్రులైతే తమ శాఖలకు సంబంధించిన అంశాలపై కూడా మాట్లాడటం లేదని ఆయన అన్నారు. ఇదే ధోరణి కొనసాగితే 1995 నాటి సిఎంను మళ్లీ చూస్తారని చెప్పారు. శాఖల నిర్వహణలో కూడా చాలామంది వేగం చూపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అటువంటి వారంతా ఇక మారాల్సిన అవసరం ఉందని కూడా వ్యాఖ్యానించినట్లు సమాచారం. ప్రతిపక్ష కుట్రలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు మంత్రులంతా



కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు

ప్రయత్నించాలని స్పష్టంచేసినట్లు తెలిసింది.

పెట్టుబడులు వద్దంటూ మెయిల్స్‌పై విచారణ

ఒకవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా పనిచేస్తుంటే ప్రతిపక్షాలు పెట్టుబడులు వద్దంటూ అనేక సంస్థలకు ఇ-మెయిల్స్ పంపించడం ఏమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఎపిఎండిసి జారీ చేసిన బాండ్లలో పెట్టుబడులు వద్దంటూ దాదాపు 200 దేశీయ, విదేశీయ సంస్థలకు మెయిల్స్ వెళ్లినట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తొలుత ప్రస్తావించారు. తన దగ్గర ఉన్న ఆధారాలను కూడా సహచర మంత్రులకు అదించారు. ఈ మెయిల్స్ వైసిపి సానుభూతిపరుడితోనే పెట్టించినట్లు వివరించారు. పెట్టుబడులు రాకుండా వారే చేస్తూ రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదని వారే ఆరోపిస్తున్నారని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించనున్నట్లు తెలిపారు. తోతాపురి మామిడి పంటకు సంబంధించి జగన్ డ్రామాలకు దిగుతున్నారని మంత్రులు ఆరోపించారు. ఒక వైసిపి నేతకు చెందిన పొలం నుంచే కొన్ని వాహనాల్లో మామిడిని తీసుకువచ్చి రోడ్డుపై పారబోయించారని ముఖ్యమంత్రికి మంత్రులు వివరించారు. ఇది కేవలం అలజడి సృష్టించేందుకేనని ముఖ్యమంత్రి కూడా వ్యాఖ్యానించారు. ఇటువంటి వాటిని జనంలోకి తీసుకువెళ్లాలని ఆదేశించారు

ఆరోగ్య బీమా కొనసాగింపునకు చర్యలు

- ఎపిడబ్ల్యుజెఎఫ్‌తో మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఆరోగ్య బీమా, సమగ్ర బీమా పథకాల కొనసాగింపునకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు పౌరసంబంధాలు, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథి.. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ప్రతినిధులతో చెప్పారు. వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ కమిటీ నియామకం కూడా త్వరలో పూర్తి చేస్తామని, ఆ దిశగా డైరెక్టర్‌కు ఆదేశాలిచ్చామని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇంటి నిర్మాణ సబ్‌కమిటీలోని మంత్రులు పార్థసారథితో పాటు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణనును ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధులు సచివాలయంలో బుధవారం విడివిడిగా కలిశారు. జర్నలిస్టులకు ఇంటి స్థలం కేటాయింపు, నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రతిపాదనలను వినతిపత్రంలో పొందుపరిచారు. మంత్రులను కలిసిన వారిలో ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి ఎమ్‌డి నాథన్, ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ కన్వీనర్ వి శ్రీనివాసరావు ఉన్నారు.

సవరణ

ఈ నెల 9వ తేదీ సంచిక 2వ పేజీలో 'కడేరును కార్పొరేట్లకు అప్పగిస్తారా?' అని తప్పుగా ప్రచురితమైంది. కరేడు అని చదువుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

- ఎడిటర్

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

బియ్యం అక్రమ రవాణాపై నిఘా

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బియ్యం అక్రమ రవాణా జరగకుండా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలని అధికారులను పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. రాష్ట్రం నుంచి ఇతర దేశాలకు బియ్యం ఎగుమతులకు ప్రభుత్వం వ్యతిరేకం కాదన్నారు. ఎగుమతిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సులభంగా ఎగుమతులు చేసుకోవచ్చున్నారు. సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో కాకినాడ, విశాఖపట్నం, నెల్లూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి బయటకు వెళ్లే బియ్యం సరఫరాలో పిడిఎస్ (సబ్సిడీ) బియ్యం కలిపే ప్రసక్తే లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విశాఖ, కాకినాడ, నెల్లూరు పోర్టు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24/7 సిబ్బందితో తనిఖీలు చేపట్టాలని, అవసరమైతే చెక్‌పోస్టులు పెంచాలని అధికారులకు మంత్రి సూచించారు.

కాకినాడ పోర్టు వద్ద పిడిఎస్ బియ్యం నియంత్రణ బాగా జరుగుతోందని, విశాఖ, నెల్లూరు పోర్టు ప్రాంతాలను కూడా మరింత పటిష్టం చేయాలని సూచించారు. జాతీయ రహదారులపై కూడా అవసరమయ్యేచోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. కాకినాడ జిల్లాలో ఇప్పటి వరకు 85 కేసులు నమోదు కాగా, అందులో 21 కేసులు పోర్టు ఏరియాలో నమోదయ్యాయని, విశాఖపట్నం జిల్లాలో 92 కేసులు నమోదు కాగా, అందులో 9 కేసులు పోర్టు ప్రాంతంలో, నెల్లూరు జిల్లాలో 62 కేసులు నమోదు కాగా, అందులో 6 కేసులు కృష్ణపట్నం పోర్టుకు సంబంధించినవని మంత్రి నాదెండ్ల తెలిపారు.



ఉద్యోగ విరమణ వయసు పెంచండి

- ఆశా వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆశా వర్కర్ల పదవి విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్ల పెంచుతామని, గ్రాట్యుటీ, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవు అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్‌కు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, కార్యదర్శులు జి.చిట్టి కుమారి, కె.లక్ష్మి, నాయకులు పి.శ్రీలక్ష్మిలు వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. సచివాలయంలో మంత్రిని కలిసిన వీరు ఆశాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ ఏడాది మార్చి 1న స్వయంగా సిఎం ఈ హామీలను అసెంబ్లీలో ఇచ్చారని, ఇప్పటి వరకూ ఉత్తర్వులు జారీ చేయలేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మార్చి 1 నుంచి ఉద్యోగ విరమణ చేసిన వారిని తిగిరి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రితోపాటు మాజీ ఎమ్మెల్సీ, టిడిపి నాయకులు టి.డి జనార్ధన్ దృష్టికి సమస్యలను తీసువెళ్లారు.



గోదావరికి వరద ప్రవాహం

- భయాందోళనలో పోలవరం నిర్వాసితులు
- మెరక ప్రాంతాల్లోకి సామగ్రి తరలింపు

ప్రజాశక్తి - యంత్రాంగం

గోదావరికి వరద ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. బుధవారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 19 అడుగుల నుంచి 22.40 అడుగులకు చేరుకుంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 2,27,066 క్యూసెక్కుల వరద నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 28.250 మీటర్లు, దిగువన 18.680 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్‌కు ఎగువన 28.400 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్‌కు దిగువన 17.750 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 15.990 మీటర్ల నీటిమట్టం నమోదైంది. స్పిల్ వే 48 గేట్ల నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. పోలవరం నుంచి పట్టిసీమ వరకు 26.987 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు, గురువారం నాటికి 2.82 లక్షల క్యూసెక్కుల జలాలు గోదావరిలోకి రానున్నట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. వారం రోజులుగా తగ్గుతూ పెరుగుతూ వస్తున్న గోదావరి వరద రెండు రోజుల నుంచి పెరుగుతూనే ఉండడంతో కుక్కునూరు మండల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వేలేరుపాడు మండలంలోని రుద్రంకోట, రేపాకగొమ్ము, తదితర ప్రాంతాల్లోని నిర్వాసితులు మెరక ప్రాంతాల్లోకి, చల్లావారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలోకి తమ సామగ్రిని ట్రాక్టర్లపై, ఆటోల్లో తరలిస్తున్నారు. మన్యంలో కురుస్తున్న వర్షాలతో క్రమేపీ శబరి, సీలేరు నదుల్లో కూడా స్వల్పంగా నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. గోదావరి సహా పలు నదులు, వాగుల్లో నీటి ప్రవాహాలు పెరుగుతుండటం పోలవరం నిర్వాసిత మండలాల ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది.



3 గేట్ల ద్వారా నీటి విడుదల

- నిండుకుండలా శ్రీశైలం డ్యాం

ప్రజాశక్తి -శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతాలు కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల వల్ల ఆయా రాష్ట్రాల పరిధిలోని ఆల్మట్టి, నారాయణపూర్, తెలంగాణ పరిధిలోని జూరాల ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండుగా ఉన్నాయి. దిగువ శ్రీశైలానికి కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ఎగువ జూరాల నుండి 1,23,536 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 57,515 క్యూసెక్కులతో మొత్తం జలాశయానికి 1,81,051 క్యూసెక్కుల నీటి ప్రవాహం చేరింది. అదే సమయానికి జలాశయం నుండి ప్రస్తుతానికి మూడు గేట్ల ద్వారా ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం నీటి నిలువ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 201.1205 టిఎంసిలు నమోదయ్యింది. జలాశయం నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 882.40 అడుగులకు చేరింది. ఆనకట్ట నుండి మూడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జున సాగర్‌కు 80,646 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో గడచిన 24 గంటలలో 17.657 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేసి 35,564 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 17.2478 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తూ 31,088 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 19,166 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ 1,266 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం దిగువ నాగార్జునసాగర్ కు గేట్లు, విద్యుత్ ఉత్పాదన, శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా జలాశయం నుండి 1,68,371 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సర్కారు బడిలో చేరేవారేరి?

- **4,750 పాఠశాలల్లో 'సున్నా' అడ్మిషన్లు**
- **1,6 తరగతుల్లో చేరని విద్యార్థులు**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ప్రతియేటా పడిపోతుంది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు దుస్తులు, బూట్లు, పాఠ్యపుస్తకాలు వంటివి ఉచితంగా అందిస్తున్నా, విద్యార్థుల సంఖ్య పెరగడం లేదు. సంస్కరణల పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వల్ల ఏమాత్రం ఉపయోగం ఉండకపోగా, మరింత నష్టాన్ని చేకూరుస్తున్నాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులను బడికి దూరం చేయడం, ప్రతియేటా ఉపాధ్యాయుల భర్తీ చేయకపోవడం వంటి కారణాలు వల్ల సర్కారు బడుల్లో పిల్లల చేరిక తగ్గుతోందని అంటున్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో సుమారు 4,750 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా కొత్తగా చేరకపోవడం ఆందోళనకర విషయంగా చెబుతున్నారు. ఒకటో తరగతిలో గానీ, ఆరో తరగతిలో గానీ ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ఒక్క అడ్మిషన్ కూడా నమోదు కాలేదు. గత వైసిపి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న 'సాల్ట్' ఒప్పందంలో భాగంగా పాఠశాల విద్యలో సంస్కరణలు అమలు చేసింది. సుమారు 5 వేల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలకు గత ప్రభుత్వం తరలించింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా ఇంచుమించు ఈ సంస్కరణల అమలుకే పూనుకుంది. వైసిపి ప్రభుత్వం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పంపగా, కూటమి ప్రభుత్వం మోడల్ ప్రైమరీ పాఠశాల పేరుతో విద్యార్థులకు బడిని దూరం చేస్తోంది. ఇంటి పక్కనే ఉండాల్సిన బడి దూరం కావడంతో విద్యార్థులు ప్రైవేటు బడి బాట పడుతున్నారు.

గత విద్యాసంవత్సరం 3,200 పాఠశాలల్లో విద్యార్థులు ఒకటో తరగతిలో గానీ, ఆరో తరగతిలో గానీ ఒక్కరూ చేరలేదు. ఈ ఏడాది వాటితో పాటు అదనంగా మరో 1,550 పాఠశాలల్లో కొత్తగా విద్యార్థులు చేరలేదు. దీంతో తమ ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణల ప్రభావం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని కూటమి ప్రభుత్వం చెబుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలుస్తోంది. చిత్తూరు జిల్లాలో అత్యధికంగా 411 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా కొత్తగా చేరలేదు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈ సంఖ్య 220గా, ఏలూరులో 107 పాఠశాల్లలో పరిస్థితి ఇలానే ఉంది.

ఏడాదిలో 1.50 లక్షల మంది తగ్గుదల

ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య కూడా ఈ విద్యా సంవత్సరం తగ్గింది. గతేడాది జూన్ చివరి నాటికి సుమారు 35 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని విద్యాశాఖ అధికారులు చెప్పారు. కానీ విద్యా సంవత్సరం ముగిసే నాటికి ఆ సంఖ్య 32.50 లక్షలకు పడిపోయింది.

ప్రస్తుతం ఈ సంఖ్య 31 లక్షలలోపే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ గడువు ఆగస్టు 31వ తేదీ వరకు అవకాశం ఉందని, విద్యార్థులు పెరిగే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క మధ్యాహ్న భోజనాన్ని 29,49,329 మంది విద్యార్థులే తీసుకుంటున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. విద్యాశాఖ చెబుతున్న సంఖ్యకు, భోజనం తీసుకునే సంఖ్యకు పొంతన లేదు.

అమరావతికి మార్కెటింగ్‌తోనే నిధులు

- కన్సల్టెన్సీలకు సూచించిన వరల్డ్ బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతికి మార్కెటింగ్ చేయాల్సిన బాధ్యతను సిఆర్‌డిఎ తీసుకోవాలని వరల్డ్ బ్యాంకు ప్రతినిధులు సూచించారు. ఇటీవల సిఆర్‌డిఎ అధికారులతో జరిగిన సమావేశంలో ఈ మేరకు వారు సూచనలు చేశారు. ప్రపంచ బ్యాంకు నుండి ఇప్పటి వరకూ ప్రభుత్వానికి రూ.3 వేలకోట్లు రాగా, వాటిల్లో రూ.2,100 కోట్లు సిఆర్‌డిఎకు జమయ్యాయి. ప్రపంచబ్యాంకు నిధులతో ఇప్పటి వరకూ మొత్తం రూ.5,100 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటి వరకూ పనిచేస్తున్న కన్సల్టెన్సీలూ సమయానుకూలంగా వ్యవహరించడంతో పాటు పనులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రస్తుతం అమరావతి అభివృద్ధి పనులు, ముఖ్యంగా జిఎడి టవర్లు, ప్రజాప్రతినిధుల నివాసాలు, అధికారులు, సిబ్బంది గృహ సముదాయాలతోపాటు, ల్యాండ్ పూలింగు స్కీమ్ కింద రైతులకు ఇచ్చిన లేఅవుట్ల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వీటిల్లో ఆర్‌వి అసోసియేట్స్, ట్రాక్టబెల్, నిప్పన్‌కోయి సంస్థలు కన్సల్టెన్సీలుగా ఉన్నాయి. వీటిల్లో ఆర్‌వి అసోసియేట్స్ ఐదు జోన్లలో, ట్రాక్టబెల్ ఎనిమిది జోన్లలో, నిప్పన్‌కోయి రెండు జోన్లలో కన్సల్టెన్సీ బాధ్యతలు నిర్వహిస్తున్నాయి. వీటిపై పర్యవేక్షణ అధికారులదే అని చెబుతున్నా వరల్డ్ బ్యాంకు ప్రతినిధులు వారి పనిపై నిరంతరం సమీక్ష చేస్తున్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో పనులు చేయడంతోపాటు వాటికి ప్రచారం కల్పించాల్సిన బాధ్యత కూడా కన్సల్టెన్సీలపై ఉందని తెలిపారు. కమ్యూనికేషన్స్ విభాగం దీనిపై ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు. ఇప్పుడున్న పద్ధతుల్లో కాకుండా అప్‌డేటెడ్‌గా అమరావతి విషయాలు బయటకు తెలియాలని సూచించారు. అలాగే అమరావతికి పెట్టుబడులు వచ్చే విధంగా ప్రచార మార్కెటింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. ఇది జరగాలంటే ప్రస్తుతం జరుగుతున్న పనులపై రియల్‌టైమ్ నివేదికలు ఉండాలని సూచించారు. పెట్టుబడులు వస్తేనే అభివృద్ధి జరుగుతుందని, అప్పుడే నిధుల సమీకరణ, ఆదాయమూ పెరుగుతాయని వారు వివరించినట్లు పేర్కొన్నారు. తాము ఇచ్చిన నిధులకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయనేది కూడా నిరంతరం తెలిసేందుకు ఇది ఉపయోగపడుతుందని సూచించారు.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ సమక్షంలో మంగళగిరి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు ఆ పార్టీలో చేరారు. చేరిన వారిలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు పెనుగొండ సుబ్బారాయుడు (విజయవాడ), ఆర్యవైశ్యసత్ర సముదాయం అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు (కనిగిరి), కాశీ అన్నపూర్ణ చౌల్ట్రీస్ అధ్యక్షులు భవనాసి శ్రీనివాస్ (నంద్యాల) ఉన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు మాట్లాడుతూ.. పవన్‌కల్యాణ్ ఆలోచనలు, సిద్ధాంతాలు రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

వైద్యం వికటించి ఇద్దరు బాలింతలు మృతి

- బుడితి సిహెచ్‌సిలో ఘటన
- ఆందోళనకు దిగిన కుటుంబసభ్యులు

ప్రజాశక్తి - సారవకోట, శ్రీకాకుళం సిటీ

వైద్యం వికటించి ఇద్దరు బాలింతలు మృత్యువాత పడిన సంఘటన శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం బుడితి సామాజిక ఆస్పత్రి కేంద్రం (సిహెచ్‌సి)లో బుధవారం చోటుచేసుకుంది. వైద్యులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జలుమూరు మండలం యలమంచిలి పరిధిలోని కామేశ్వరరావుపేటకు చెందిన



కొర్లాపు ధనలక్ష్మి, పట్ట అరుణ

పట్ట అరుణ (21), పాగోడుకు చెందిన కొర్లాపు ధనలక్ష్మి (22)కి పురిటినొప్పులు రావడంతో ఈ నెల 7న బుడితి సిహెచ్‌సిలో చేశారు. ఆపరేషన్ చేయగా వారిద్దరూ మగ శిశువులకు జన్మనిచ్చారు. శిశువులు ఆరోగ్యంగానే ఉన్నా.. తల్లులు మాత్రం ఆపరేషన్ తర్వాత తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. పరిస్థితి విషమించడంతో సిబ్బంది వైద్యురాలికి సమాచారం ఇచ్చారు. డాక్టర్ శోభారాణి పరీక్షించి యూరిన్ బ్లాడర్‌లో సమస్య ఉందంటూ వారిద్దరినీ శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఆరోజు అర్ధరాత్రి 12 గంటలకు అంబులెన్స్‌లో శ్రీకాకుళంకు తరలించారు. అంతర్గతంగా బ్లీడింగ్, యూరిన్ బ్లాడర్ బ్లాక్ అయిన విషయాన్ని వైద్యులు గుర్తించి ఇద్దరు బాలింతలకు ఈ నెల 8న గర్భసంచులు తొలగించారు. అనంతరం ఇద్దరినీ వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. అప్పటికే వారిలో ఒకరి కిడ్నీలు, ఇతర అవయవాలన్నీ పనిచేయడం మానేశాయి. మరో మహిళకు కార్డియాక్ అరెస్టు కావడంతో సిపిఆర్ చేసినా ఫలితం లేకపోయింది. చివరికి ఇద్దరూ మృతి చెందినట్లు రిమ్స్ వైద్యులు ప్రకటించారు. మృతదేహాలను అంబులెన్స్‌లో బుడితి సిహెచ్‌సికి బుధవారం తెల్లవారుజామున పంపించేశారు. వైద్యురాలు చేసిన శస్త్రచికిత్స వికటించడం వల్లే గర్భిణుల ప్రాణాలు పోయాయని ఆరోపిస్తూ సారవకోట పోలీసు స్టేషన్ వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వివాదం తీవ్రమవుతున్న తరుణంలో పోలీసులు, గ్రామ పెద్దలు కలిసి బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడంతో వారు మృతదేహాలను ఇళ్లకు తీసుకెళ్లిపోయేందుకు అంగీకరించారు. ఈ వ్యవహారంలో ఒక్కో కుటుంబానికి రూ.నాలుగు లక్షల పరిహారం ఇప్పించేలా రాజీ కుదిర్చారని ప్రచారం సాగుతోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఘటనపై డిఎంహెచ్ఒ అనిత విచారణ చేపట్టారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

- వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రసాయన ఎరువుల వాడకం పెరగడం వల్ల ఉత్పన్నమయ్యే దుష్పరిణామాలు దృష్టిలో ఉంచుకుని, కొన్ని ప్రత్యామ్నాయ పద్ధతులను అందుబాటులోకి తెచ్చినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం సరఫరా చేసే ఎరువుల్లో ఎటువంటి కోత విధించలేదని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, సేంద్రీయ, జీవన ఎరువల వాడకాన్ని పెంచడం, రసాయన ఎరువులపై వినియోగాన్ని కొంత మేర తగ్గించామన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు వ్యక్తిగత పనిముట్లు సరఫరా చేసేందుకు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని మరింత విస్తృతం చేయాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. వడ్డేశ్వరంలోని సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో జిల్లా మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీ కోర్టు కేసులు, రావాల్సిన బకాయిలు, స్థలాలు, సాధారణ అమ్మకాలను ఈ సందర్భంగా సమీక్షించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుల సర్వే అడ్డగింత

- తమ జీవితాలను ఛిద్రం చేస్తే ఊరుకునేది లేదని గిరిజనుల హెచ్చరిక
- ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - అనంతగిరి, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ గుజ్జలి, టోకూరు పంచాయతీ చిట్టెంపాడు గ్రామాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే క్రమంలో సర్వే చేసేందుకు వచ్చిన అధికారిక బృందాలను బుధవారం గిరిజనులు అడ్డుకున్నారు. దీంతో వారు వెనుదిరిగారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు తమ ప్రాంతంలో వద్దంటూ ఇప్పటికే టోకూరు పంచాయతీ గ్రామసభ తీర్మానం చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ బుధవారం పాడేరు సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించాలని రెవెన్యూ అధికారులు భావించారు. అనివార్య కారణాలతో ఆ సభ రద్దయింది. అయినప్పటికీ సర్వే బృందాలు పై గ్రామాలకు వచ్చాయి. గిరిజనులు పెద్ద ఎత్తున నిరసనకు పూనుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల ప్రజాప్రతినిధులు కిల్లో మొస్య, పాంగి అప్పారావు, ఎంపిపి శెట్టి నీలవేణి మాట్లాడుతూ... అదాని, నవయుగ కంపెనీలకు చెందిన హైడ్రో పవర్ ప్రాజెక్టులకు తమ ప్రాంతాన్ని ధారాదత్తం చేస్తే



రేగులపాలెంలో ఆదివాసీ సంప్రదాయ ఆయుధాలు ఎక్కుపెట్టి నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 51ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కార్యక్రమంలో సిపిఎం నాయకులు జె.రమణ, ఎస్.నాగులు, మాజీ ఎంపిటిసి కొర్ర కొండమ్మ, వైసిపి మండల అధ్యక్షులు కొర్రా సూర్యనారాయణ, పీసా కమిటీ సభ్యులు లక్ష్మణ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. పెద్దకోట పంచాయతీ పరిధి రేగులపాలెం గ్రామం వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ ప్రయత్నాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ రేగులపాలెం, కుడియా, పెద్దకోట, కొండిబకోట తదితర గ్రామాల గిరిజనులు రేగుల పాలెం గ్రామం వద్ద విల్లంబులు, సంప్రదాయ ఆయుధాలతో ఆందోళన చేపట్టారు.

జెడ్‌పిలో గళమెత్తిన సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ఏజెన్సీలో హైడ్రోపవర్ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ తీర్మానం చేయాలని విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. జిఒ 51ని తీవ్రంగా వ్యతిరేకించారు. అటవీ చట్టాలను ఉల్లంఘించి హైడ్రో పవర్ ప్రాజెక్టులను మన్యంలో కట్టడం తగదన్నారు. అనంతరం హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా జెడ్‌పిలో తీర్మానం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయాన్ని నివేదించనున్నారు.

సమస్యను సృష్టించేందుకే జగన్ పర్యటనలు

- మంత్రులు అచ్చెన్న, అనగాని, నాదెండ్ల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యను సృష్టించేందుకే పర్యటనలు చేస్తున్నారని మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని జగన్‌కు లేదని, కేవలం ముందస్తు వేసుకున్న ప్రణాళికల ప్రకారం అనుమతులు లేకపోయినా ర్యాలీలు నిర్వహించడం, శాంతి భద్రతల సమస్యలు సృష్టించడం ద్వారా రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారని మంత్రులు విమర్శించారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో బుధవారం మంత్రులు మీడియాతో మాట్లాడారు. మామిడి రైతుల ఇబ్బందులను ముందుగానే గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని తోతాపురి మామిడి గత ఐదేళ్లలో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా, ఈ ఏడాది 6.5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. ఫలితంగా ధరలు తగ్గాయన్నారు. ఈ నేపథ్యంలో సిఎం రెండు నెలల క్రితమే టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కిలో రూ.12లకు కొనాలని నిర్ణయించారన్నారు. పల్పు కంపెనీల వద్ద పెద్దయెత్తున నిల్వలు ఉండటంతో కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో రూ.8లకు కొనాలని, ప్రభుత్వం తరపున రూ.4 ఇస్తామని చెప్పామన్నారు. ఇప్పటికే అన్నమయ్య జిల్లాలో 99 శాతం, తిరుపతి జిల్లాలో 98 శాతం, చిత్తూరు జిల్లాలో 80 శాతం కొనుగోలు చేశామన్నారు. తోతాపురి మామిడిని కొనుగోలు చేసేందుకు రూ.260 కోట్లు అవుతుందని అంచనా వేశామని తెలిపారు.



విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, స్కీం వర్కర్లు



వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేలులో నిరసన తెలుపుతున్న కార్మికులు

కదం తొక్కిన కార్మిక వర్గం

- లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే..
- చిత్తూరులో 30 యాక్ట్ విధించినా సమ్మెలో పాల్గొన్న కర్షకులు
- అసంఘటిత రంగ కార్మికులు రూ.26వేలు చెల్లించాలి
- విశాఖలో భారీ ఎత్తున పాల్గొన్న కేంద్ర ప్రభుత్వ కార్మికులు

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక వర్గం కదం తొక్కింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు రోడ్డెక్కారు. నాలుగు లేబర్‌కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని తదితర డిమాండ్లతో కార్మిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన సమ్మె విజయవంతమైంది. విద్యార్థులు, బ్యాంకులు, బీమా కంపెనీల్లోని ఉద్యోగులు, జర్నలిస్టు సంఘాలు సమ్మెలో భాగస్వామ్యమయ్యాయి. ప్రైవేటు పరిశ్రమల్లో పనిచేస్తున్నవారు, అసంఘటితరంగ కార్మికులు, స్కీం వర్కర్లు తమ విధులను బహిష్కరించి సంపూర్ణంగా సమ్మెలో పాల్గొన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో ర్యాలీలు, మానవహారాలు, ధర్నాలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలు మూతబడ్డాయి.

అవసరమైతే నిరవధిక సమ్మె

ఏలూరులో పవర్‌పేట రైల్వే స్టేషన్ నుంచి ఆర్‌ఆర్‌పేటలోని పార్కు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు బి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునే వరకూ వెనక్కి తగ్గేది లేదని, అవసరమైతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం బస్టాండ్ వద్ద నిర్వహించిన సభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మోడీ హయంలో ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, ఈ విధానాలను ఉపసంహరించుకోకపోతే ఇంటికి సాగనంపడం ఖాయమన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి పాల్గొన్నారు. ఐక్య పోరాటాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడతామని హెచ్చరించారు. తాడేపల్లిగూడెంలో ఎన్‌కె గ్రౌండ్ వద్ద నిర్వహించిన సభలో సిఐటియు రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం హాజరై మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను హరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచిందని విమర్శించారు. నరసాపురంలో ఆక్వా పరిశ్రమల వద్ద కార్మికులు నిరసన తెలిపారు. పాలకొల్లులో మాజీ ఎమ్మెల్సీ దిగుపాటి రాజగోపాల్ పాల్గొన్నారు. ఆచంటలో ర్యాలీ నిర్వహించారు.

రూ.170తో కార్మికులు ఎలా బతుకుతారు?

విశాఖలో దొండపర్తి వద్దగల రైల్వే డిఆర్‌ఎం కార్యాలయం నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిగింది. అనంతరం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకురాలు ఎం.లక్ష్మి మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులకు రోజుకు రూ.170 వేతనం చెల్లిస్తే సరిపోతుందని చెబుతోందని, ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఒక కుటుంబం బతకాలంటే నెలకు కనీసం రూ.26 వేలు తక్కువ లేకుండా వేతనం ఉండాలన్నారు. స్టీల్‌ప్లాంట్, పోర్టు, షిప్‌యార్డు, హెచ్‌పిసిఎల్, బిహెచ్‌ఇఎల్, ఎన్‌ఎస్‌టిఎల్‌లో కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అల్లూరి జిల్లా ఏజెన్సీ అంతటా సమ్మెలో కార్మికులు భాగస్వాములయ్యారు. పాడేరు, అరకులోయ, రంపచోడవరంలో భారీ ర్యాలీలు జరిగాయి. బొర్రా గుహలు, పద్మాపురం గార్డెన్స్, చాపరాయి సహా పర్యాటక ప్రాంతాలన్నీ మూతపడ్డాయి.

చిత్తూరులో 30 యాక్ట్

చిత్తూరు జిల్లాలో 30 యాక్ట్ పేరుతో పోలీసులు నిర్బంధం విధించినా కార్మిక సంఘం కదం తొక్కింది. చిత్తూరు గాంధీ విగ్రహం వద్దకు ఉదయం ఎనిమిది గంటలకే భారీగా కార్మికవర్గం చేరుకుంది. జిల్లాలోని 32 మండలాల్లోనూ ప్రదర్శనలు, మానవహారాలు చేపట్టారు. తిరుపతి జిల్లాలోని 34 మండలాల్లోనూ సమ్మె చేపట్టారు. తిరుపతిలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొన్నారు. తిరుపతిలో అగ్రికల్చర్, వెటర్నరీ యూనివర్సిటీలోని కాంట్రాక్టు కార్మికులు నల్ల దుస్తులు, గొడుగులతో మానవహారం చేపట్టారు. యూనివర్సిటీలో విద్యార్థిసంఘాలు పాల్గొన్నాయి. ప్రకాశం, బాపట్లలో మండల కేంద్రాల్లో ఉద్యోగులు, కార్మికులు ఎర్రజెండాలు పట్టుకుని ర్యాలీలు చేశారు. బ్యాంకింగ్, పోస్టల్, టెలికం, ఎల్‌ఐసి రంగాల్లో కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి.

పది గంటల పని విధానం ఉపసంహరించుకోవాలి

కాకినాడ కలెక్టరేట్ వద్ద జరిగిన సభలో సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి పాల్గొని మాట్లాడారు. పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని, శ్రామిక మహిళలకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, నిడదవోలు, చాగల్లు, ఉండ్రాజవరం, తాళ్లపూడి మండల కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, ముమ్మిడివరం, మండపేట, రామచంద్రపురం, రాజోలు, సఖినేటిపల్లి, ఆలమూరు, రావులపాలెం మండలాల్లో కార్మికులు ర్యాలీలు నిర్వహించారు.

మిర్చియార్డులో స్తంభించిన కార్యకలాపాలు

గుంటూరు మిర్చియార్డు, కోల్డ్ స్టోరేజీల్లో కార్యకలాపాలు స్తంభించాయి. గుంటూరులో స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి బిఆర్ స్టేడియం వరకూ వందలాది మంది కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. దుగ్గిరాలలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, తాడేపల్లిలో మాజీ ఎంపి మధు, పల్నాడు జిల్లా నరసరావుపేటలో సిఐటియు రాష్ట్ర నాయకులు ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలో డైమండ్ పార్కు నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద పోస్టల్, బ్యాంకింగ్, ఎల్‌ఐసి, బిఎస్‌ఎన్‌ఎల్, రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు చెందిన పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సమ్మె విజయవంతమైంది. కార్మికుల సమ్మెతో నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు, గరివిడిలోని డిఎఫ్ఎస్ తదితర మైన్స్ మూతపడ్డాయి. విజయనగరంలో కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు, ఎంజి రోడ్డు, గంటస్తంభం మీదుగా కన్యకాపరమేశ్వరి జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. తెర్లాంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉమ్మడి కర్నూలు, అనంతపురం, నెల్లూరు, కడపలో ర్యాలీలు ధర్నాలు

కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి రాజ్ విహార్ సెంటర్, మెడికల్ కాలేజీ మీదుగా కలెక్టర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద సభ నిర్వహించారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి లలిత తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో మార్కెట్ యార్డ్ నుంచి గాంధీ చౌక్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

అనంతరం గాంధీ చౌక్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగరాణి మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం, నెల్లూరు జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఆందోళనలు చేపట్టారు. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని 66 మండలాల్లో నిరసన ర్యాలీలు, ధర్నాలు, మానవహారాలు నిర్వహించారు.

ఏడాదిలో బైక్ ప్రమాదాల మృతులు 4,276 మంది

- హైకోర్టు ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి

గతేడాది ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 4,276 మంది మృతి చెందారని హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. వాహనదారులు హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. విజయవాడలో హెల్మెట్ ధరించేవారి సంఖ్య పెరగడంపై సంతృప్తిని వ్యక్తం చేసింది. ట్రాఫిక్ విధుల్లోని పోలీసు అధికారులు బాడీ కెమెరాలను విధిగా ధరించేలా చేయాలని చెప్పింది. రాష్ట్రంలోని సిసి కెమెరాలను ఎపి ఫైబర్‌నెట్‌కు అనుసంధానం చేస్తున్నామని పోలీసులు చెప్పడంపై స్పందించిన హైకోర్టు ఎపి ఫైబర్‌నెట్ ఎమ్‌డిని ప్రతివాదిగా చేస్తున్నట్లు ప్రకటించింది. మోటారు వాహన చట్ట నిబంధనలను అమలు చేసేలా ఉత్తర్వులివ్వాలంటూ న్యాయవాది తాండవ యోగేష్ దాఖలు చేసిన పిల్‌పై తదుపరి విచారణను ఆగస్టు 20కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

హైకోర్టు రిజిస్ట్రార్ ఆదేశాలపై పిల్

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులపై నమోదైన కేసుల్లో నిందితులకు రిమాండ్ విధించేప్పుడు సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ అమలు చేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ కింది కోర్టులకు ఇచ్చిన సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని, తమ ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహారం ఉంటే కోర్టుధిక్కరణ చర్యలకు బాధ్యులంటూ రాష్ట్రంలోని మెజిస్ట్రేట్లకు ఆదేశించింది. దీనిని సవాల్ చేస్తూ న్యాయవాది జయంతి ఎస్‌సి శేఖర్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, రిజిస్ట్రార్ జ్యుడీషియల్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, రిజిస్ట్రార్ జ్యుడీషియల్ కమలాకర్ రెడ్డిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేశారు. దీనిని విచారణ చేపట్టాలని చీఫ్ జస్టిస్ బెంచ్ ఎదుట న్యాయవాది చాపర్ల సీతారామ్ కోరారు. కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభిస్తామని మెజిస్ట్రేట్లను బెదిరించేలా సర్క్యులర్ ఉందన్నారు. దీనిపై సిజె స్పందిస్తూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే అది జారీ అయ్యిందన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ అమలు చేయని మెజిస్ట్రేట్స్‌పై శాఖాపరమైన చర్యలు ఉంటాయని, కోర్టు ధిక్కరణ చర్యలు ఉండకూడదని న్యాయవాది చెప్పారు. దీనిపై తర్వాత విచారణలో తేల్చుతామని బెంచ్ ప్రకటించింది.

జివిఎంసి భూ మార్పిడి నిర్ణయంపై స్టే

ప్రజాశక్తి-అమరావతి

జివిఎంసి పరిధిలోని బటర్ ఫ్లైపార్కుకు చెందిన కొంత భూమిని ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి, వాళ్ల స్థలాన్ని జివిఎంసి తీసుకొనేందుకు మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన ప్రొసీడింగ్స్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు స్టే ఇచ్చింది. భూమిని ప్రైవేటు వ్యక్తులకు కేటాయించకూడదని రాష్ట్రం గతంలో నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అదే భూమిని, అదే ప్రైవేటు వ్యక్తులకు కేటాయించేందుకు ప్రభుత్వం ప్రొసీడింగ్స్ ఇవ్వడాన్ని తప్పుపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్, జివిఎంసి కమిషనర్, జిల్లా కలెక్టర్లకు నోటీసులిచ్చింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జివిఎంసి పరిధిలోని కొంత భూమిని ప్రైవేటు వ్యక్తులు పి లక్ష్మణ పాత్రుడు, పోతిన అప్పారావుకు ఇచ్చి వాళ్ల స్థలాన్ని జివిఎంసి తీసుకునేందుకు అనుమతినిస్తూ గత మే 13న మున్సిపల్‌శాఖ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను జనసేన కార్పొరేటర్ పివిఎల్ఎన్ మూర్తియాదవ్ హైకోర్టులో సవాల్ చేశారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమీక్ష నిలిపివేయాల్సిందే

- బీహార్‌లో పెల్లుబికిన ప్రజాగ్రహం
- సార్వత్రిక సమ్మెకు ప్రతిపక్షాల మద్దతు
- రహదారుల దిగ్బంధనంతో స్తంభించిన జన జీవనం
- ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యానికి ప్రమాదం : రాహుల్, తేజస్వి, ఎంఎ బేబి



పాట్నా : రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఓటర్ల జాబితా ప్రత్యేక సమీక్ష (ఎస్ఐఆర్) పేరుతో ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రక్రియ పట్ల రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నిరసనలు వెల్లువెత్తాయి. దేశవ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మెకు ప్రతిపక్షాలు మద్దతు తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వున్న ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. ప్రతిపక్షాలు పిలుపిచ్చిన 'చక్కా జామ్' నిరసనతో రాష్ట్రం స్తంభించింది. రాష్ట్రవ్యాప్తంగా రైళ్లు, బస్సులు, ట్రక్కులు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. ప్రతిపక్ష పార్టీలైన ఆర్‌జెడి, కాంగ్రెస్, వామపక్షాలకు చెందిన వేలాదిమంది కార్యకర్తలు, మద్దతుదారులు రాజధాని పాట్నా వీధుల్లోకి వచ్చారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పట్ల ఆందోళన వెలిబుచ్చారు. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుండి కూడా వేలాదిమంది వచ్చి నిరసనల్లో పాల్గొన్నారు.

పాట్నాలో జరిగిన 'రహదారుల దిగ్బంధన' నిరసనలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) నేత ముకేష్ సహానీ పాల్గొన్నారు. మహాఘట్‌బంధన్ నేతల నాయకత్వంలో నిరసన ప్రదర్శన జరిగింది. బీహార్ ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి నేతలు వెళ్తుండగా, పోలీసులు వారిని బలవంతంగా అడ్డుకోవడానికి ప్రయత్నించారు.

దాంతో నేతలు అక్కడే నిరసనకారులను ఉద్దేశించి ప్రసంగించారు. పాట్నాలో రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ కలిసి నిరసన ప్రదర్శనలో పాల్గొనడం ఇదే మొదటిసారి.

యువత ఓటు హక్కు లాక్కునే ప్రయత్నాలు సహించం : రాహుల్

ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ గతేడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, ఇప్పుడు బీహార్‌లో కూడా అదే పరిస్థితిని పునరావృతం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బిజెపి ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని అన్నారు. ఓటర్లు ముఖ్యంగా యువత ఓటు హక్కును దొంగిలించేందుకు ఇసి ప్రయత్నించడాన్ని ఎంత మాత్రమూ సహించబోమని రాహుల్ స్పష్టం చేశారు.

నిలిచిన రైళ్లు

ప్రజల ఆందోళనలతో సుదూర ప్రాంత రైళ్లతో సహా మొత్తంగా 25కిపైగా రైళ్లు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల బంద్‌ను దృష్టిలో పెట్టుకుని ముందుగానే రైళ్లను ఆపివేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రహదారులను దిగ్బంధించారు. పలు జాతీయ, రాష్ట్ర హైవేలపై వామపక్షాల కార్యకర్తలు బైఠాయించారు. పాట్నా, వైశాలి, గయ, నవడా, సివాన్, అర్వాల్ జిల్లాల్లో రహదారులన్నీ ఆందోళనకారులతో నిండిపోయాయి. మొత్తంగా 38 జిల్లా ప్రధాన కేంద్రాల్లోనూ నిరసన ప్రదర్శనలు జరిగాయి. బ్లాక్, సబ్ డివిజనల్ స్థాయిల్లో కూడా ఆందోళనలు జరిగాయి. ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించిన వారిని పోలీసులు అడ్డుకున్నారు.

మోడీని కాపాడుతున్న ఇసి

సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

మోడీ పాలనను కాపాడే కమిషన్‌గా ఎన్నికల కమిషన్ దిగజారిపోయిందని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ విమర్శించారు. భారత రాజకీయాల్లో కొత్త శకానికి నాంది పలికిన అనేక ఉద్యమాలకు బీహార్ నాందిపలికిందని అన్నారు. బీహార్‌లో ప్రారంభమైన నిరసనలు చాలా వరకు భారీ విజయాలు సాధించాయని గుర్తు చేశారు. కేంద్రంలో మోడీ, అమిత్ షా పాలనకు, బీహార్‌లో నితీష్ కుమార్ పాలనకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ అధికారంలోకి వచ్చిన తరువాత, అతను క్రమంగా ప్రజాస్వామ్య హక్కులను ఒక్కొక్కటిగా లాక్కున్నాడని గుర్తు చేశారు. 1935లో హిట్లర్ న్యూరెంబర్గ్ చట్టాలను ప్రవేశపెట్టాడని, ఇది యూదులను ప్రజా జీవితంలోని అన్ని అంశాల నుండి మినహాయించిందన్నారు. దీంతో, ఆ దేశం పూర్తి ఫాసిజంలోకి దిగజారిందన్నారు. బిజెపి, కేంద్ర ప్రభుత్వ చర్యల్లో హిట్లర్ పాలన నాటి సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితిలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటానికి ప్రధాన ఉద్యమాలను ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. బీహార్ బంద్ మరిన్ని నిరసనలకు ఒక స్పష్టమైన పిలుపు అవుతుందని అన్నారు. హిట్లర్ పాలనలాగే బిజెపి పాలన కూడా అంతమవుతుందని చెప్పారు.

ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్, ప్రజాస్వామ్యానికి వినాశనమని అన్నారు. దీనివల్ల పేదలు, సమాజంలో వెనుకబడిన వర్గాలు, బలహీన వర్గాల ఓటింగ్ హక్కులు గల్లంతవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.



విజయవాడలో జరిగిన భారీ ర్యాలీలో డ్రోన్లతో పోలీసుల పహారా

ఎరుపెక్కిన విజయవాడ

- వేలాది మందితో ర్యాలీ, బహిరంగసభ
- సార్వత్రిక సమ్మెతో సర్కారుకు హెచ్చరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. రైల్వే, బ్యాంకింగ్, ఎల్‌ఐసి, స్కీం కార్మికులు, ఆటో, హమాలీ వంటి సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికులు వేలాది మంది విధులను బహిష్కరించి బుధవారం సమ్మెలో పాల్గొన్నారు. విజయవాడ వన్‌టౌన్‌లోని రథం సెంటర్‌కు కార్మికులు వేలాదిగా చేరుకుని, ఎర్ర జెండాలను చేతబూని భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో అన్ని రంగాల కార్మిక సంఘాలతోపాటు రైతు, వ్యవసాయ కూలీ, కౌలు రైతు, ముఠా, ఆటో, భవన నిర్మాణం, షాప్ వర్కర్స్‌తోపాటు ఆశా, అంగన్వాడీ, ఇతర స్కీం వర్కర్లు, పిఎసిఎస్, మున్సిపల్, బ్యాంక్, మెడికల్ రిప్స్, బీమా, రైల్వే, కాంట్రాక్ట్ వర్కర్లు అధిక సంఖ్యలో హాజరయ్యారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, 10 గంటల పని విధానం, నూతన వ్యవసాయ, మార్కెట్ విధానాలను రద్దు చేయాలని ఈ సందర్భంగా కార్మికులు నినదించారు. ర్యాలీ వన్‌టౌన్ కెనాల్ రోడ్డు నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం మీదుగా ఏలూరు రోడ్డు నుంచి లెనిన్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. సమ్మె పాటించినట్లు చెప్పారు. రాబోయే కాలంలో ఇటువంటి పోరాటాలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉద్యోగాలు, ఉపాధి, పని గంటలు, కార్మిక హక్కులపైనా దాడికి పాల్పడుతోందన్నారు. ఈ దాడిని కార్మికోద్యమాలతో తిప్పికొడతామని హెచ్చరించారు. కౌలు రైతులకు పంట రుణాలివ్వాలని, ఉపాధి హామీ పథకంలో కూలీల వేతనాన్ని రూ.600లకు పెంచాలని, పట్టణ ప్రాంతాల్లో ఈ పథకం అమలు చేయాలన్నారు. దేశంలో హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, షాపు వర్కర్స్, మెడికల్ రిప్రెజెంటీవ్స్ లాంటి అనేక రంగాల్లో 36 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలకు అనుకూల చట్టాలను ప్రభుత్వం రూపొందిస్తోందన్నారు. కంపెనీల దోపిడీకి ద్వారాలు బార్లా తెరిచారని చెప్పారు. కార్మికుల, కర్షకుల సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేశారని తెలిపారు.

రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఉన్నాయని తెలిపారు. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో స్వదేశీ, విదేశీ కంపెనీల ప్రయోజనాల కోసమే ప్రభుత్వాలు చట్టాలను చేస్తున్నాయని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా భారీగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, ఎఐయుటియుసి నాయకులు కె సుధీర్, ఎఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు జాస్తి కిషోర్‌బాబు, వైఎస్ఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి గౌతమ్‌రెడ్డి, ఇఫ్టూ నాయకులు ఎం రామకృష్ణ, ఎఐసిసిటియు నాయకులు ఉదయ్‌కిరణ్, టియుసిఐ నాయకులు మరీదు ప్రసాద్‌బాబు, బ్యాంక్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, పద్మ, హెచ్ఎంఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకట్రావు, రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై కేశవరావు, ఎం వెంకటరెడ్డి, మెడికల్ రిప్స్ అసోసియేషన్ నాయకులు కృష్ణయ్య తదితరులు ప్రసంగించారు. బహిరంగ సభకు ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె దుర్గారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ బాబూరావు, డి కాశీనాథ్, సిఐటియు నాయకులు కె సుబ్బరావమ్మ, కెఆర్‌కె మూర్తి, ధనలక్ష్మి, ఆర్‌వి నర్సింహారావు, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పోలారి, ఎఐటియుసి నాయకులు వెంకటసుబ్బయ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం

- శ్రామికులకు సిఐటియు అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు రాష్ట్రంలో బుధవారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతమైనట్లు సిఐటియు రాష్ట్ర కమిటీ తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కార్మికవర్గం ర్యాలీలు, నిరసనల్లో పాల్గొందని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు 15 లక్షల మంది సమ్మెలో పాల్గొన్నారని, అన్ని జిల్లా, పట్టణ కేంద్రాలు, 600 మండలాల్లో జరిగిన ర్యాలీల్లో కార్మికులు లక్షలాదిగా పాల్గొన్నారని తెలిపారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు రాష్ట్రంలో సమ్మెలో పాల్గొన్న లక్షలాది మంది కార్మికులకు సిఐటియు రాష్ట్ర కమిటీ అభినందనలు తెలిపింది. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోకపోతే కార్మికులు మరింత సమరశీలమైన, బలమైన పోరాటాలకు సన్నద్ధం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చింది. మోడీ తక్షణమే కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని, మోడీ విధానాలకు మద్దతు తెలుపుతున్న చంద్రబాబు, కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేకతను గుర్తించి పని గంటల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపు తదితర నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాష్ట్రంలో వెంటనే కనీస వేతనాల బోర్డును ఏర్పాటు చేసి కనీస వేతనాలు పెంచాలని, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసింది.

తెలంగాణలో కల్తీ కల్లు తాగి ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి ఏరియాలో కల్తీ కల్లు తాగి మూడు రోజుల్లో ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు సీతారామ్, చాకలి బొజ్జయ్య, నారాయణమ్మగా గుర్తించారు. వీరంతా హెచ్ఎంటీ హిల్స్ సాయిచరణ్‌కాలనీకి చెందిన వారుగా అధికారులు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిలో జి.దేవదాస్.. లోనోట్రోప్ మద్దతుతో డయాలసిస్ చేయించుకుంటున్నారు. మోనప్ప.. వెంటిలేటర్‌పై ఉండగా.. కృష్ణయ్య.. డయాలసిస్ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. 23 మందికి పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. వీరిలో 15 మంది మంగళవారం రాగా.. బుధవారం గాంధీ ఆస్పత్రి నుంచి ఇద్దరు, కూకట్‌పల్లి నుంచి మరో ఆరుగురు నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని మినహాయిస్తే మిగతా వారంతా కోలుకుంటున్నారు. నిమ్స్ హాస్పిటల్‌లోని మల్టీ డిసిప్లీనరీ నిపుణుల బృందం రోగుల పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్టు జనరల్ మెడిసిన్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీఎస్ సుబ్బలక్ష్మి తెలిపారు. ఇదిలా ఉంటే.. కల్తీ కల్లు ఘటనలో ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. కల్లు కాంపౌండ్‌లను సీజ్ చేశారు. కల్లు శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేస్తున్నారు. కూకట్‌పల్లిలోని ఉషా ముళ్లపూడి రోడ్డులోని కల్లు కాంపౌండ్, కేపీహెచ్‌బీలోని హైదర్‌నగర్, ఎల్లమ్మబండ ప్రాంతంలోని కల్లు కాంపౌండ్‌లో ఆదివారం సాయంత్రం కొంతమంది కల్లు తాగారు. వారిలో కొంతమంది మరుసటి రోజు ఉదయం నుంచి తీవ్రమైన వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దాంతో వారి కుటుంబ సభ్యులు హుటాహుటిన బాధితులను కూకట్‌పల్లిలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ప్రాథమిక చికిత్స అనంతరం నిమ్స్‌కు తరలించారు. కల్తీ కల్లు కేసులో ఐదుగురు నిర్వాహకులను బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కల్లు కాంపౌండ్లు నిర్వహిస్తున్న నగేశ్‌గౌడ్, బి.శ్రీనివాస్‌గౌడ్, టి.శ్రీనివాస్‌గౌడ్, టి.కుమార్‌గౌడ్, లీగల రమేష్‌పై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. నిర్వాహకులకు సంబంధించిన ఐదు షాపులను ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు

సంపాదకీయం

శ్రామికులకు జేజేలు


కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం కావడం పాలకవర్గాలకు ఒక హెచ్చరిక లాంటిది. శ్రమజీవుల రక్త మాంసాలతో లాభాల పంట పండించుకోవడానికి కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరిచే ఉదారవాద ఆర్థిక విధానాలకు దేశ వ్యాప్తంగా రూపొందుతున్న బలమైన ప్రతిఘటనకు ఇది ఒక నిదర్శనం. మంగళవారం అర్ధరాత్రి నుండి ప్రారంభమైన ఈ సమ్మెలో 25 కోట్ల మందికి పైగా కార్మికులు ప్రత్యక్ష భాగస్వాములయ్యారని కేంద్ర కార్మిక సంఘాలు ప్రకటించాయి. సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా మరెన్నో కోట్లమంది కర్షకులు, యువజన, విద్యార్థులు కదలడం పీడిత ప్రజానీకం ఏకమవుతున్న తీరుకు అద్దం పడుతోంది. రైల్వే, రవాణా, బీమా, బ్యాంకింగ్, పోస్టల్, రక్షణ, మైనింగ్, ఉక్కు, టెలికామ్, విద్యుత్, నిర్మాణ రంగాలతో పాటు అసంఘటిత రంగం కూడా సమ్మెలో పాలుపంచుకుంది. ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన తదితర స్కీమ్ వర్కర్లు దేశ వ్యాప్తంగా కదం తొక్కారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు, వ్యవసాయ కార్మికులు తరలిరావడంతో అనేక రాష్ట్రాల్లో బంద్ వాతావరణం నెలకొంది.

ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంఘం బిఎంఎస్ మినహా మిగిలిన ప్రధాన కేంద్ర కార్మిక సంఘాలు ఉమ్మడి వేదికగా ఏర్పడి సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఉదారవాద ఆర్థిక విధానాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కార్మిక కోడ్‌లను రద్దు చేసి, తిరిగి కార్మిక చట్టాలను పునరుద్ధరించడం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయడం, కాంట్రాక్టు పని పద్ధతిని రద్దు చేయడం, కనీస నెలవారీ వేతనాన్ని రూ.26,000కి పెంచడం, ఉద్యోగ భద్రత మరియు సామాజిక భద్రతను కాపాడటం తదితర 17 డిమాండ్ల సాధన ఈ సమ్మె లక్ష్యం. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన సి2 ప్లస్ 50 శాతం ఫార్ములా ఆధారంగా కనీస మద్దతు ధరలకు చట్టపరమైన హామీ ఇవ్వాలని, రైతులకు రుణ మాఫీ అమలు చేయాలని, ఉపాధి హామీ వేతనంతో పాటు పనిదినాలు పెంచాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాలు ఈ సమ్మెకు సంఘీభావం ప్రకటించాయి. వామపక్షాలూ మద్దతు ప్రకటించాయి.

కేరళలో సమ్మె నూరు శాతం విజయవంతమైంది. రవాణా సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో నామమాత్రపు హాజరు కనిపించింది. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి పశ్చిమ బెంగాల్‌లో మమత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టిన కోల్‌కతాతో పాటు, అనేక ప్రాంతాల్లో రోడ్లమీదకు వచ్చిన కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయినప్పటికీ నిర్బంధాన్ని అధిగమించి పలు ప్రాంతాల్లో రైలు పట్టాలపై బైఠాయించారు. సమ్మెను విఫలం చేయడానికి త్రిపుర ప్రభుత్వం ముందస్తు అరెస్టులతో పాటు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ కార్మికులు ఖాతరు చేయలేదు. జార్ఖండ్‌లో బొగ్గు, బ్యాంకింగ్, బీమా పోస్టల్ రంగాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఉత్తరప్రదేశ్, గుజరాత్, బీహార్‌లలో కూడా కార్మికులు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొన్నారు. తమిళనాడులో సమ్మె ప్రభావం గణనీయంగా కనిపించింది. సమ్మెతో అనుసంధానం చేస్తూ ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా బీహార్ బంద్ జరగడంతో ఆ రాష్ట్రం స్థంబించిపోయింది. బంద్‌ను విఫలం చేయడానికి ఎన్‌డిఎలో భాగస్వామియైన ఆ రాష్ట్ర అధికారపక్షం చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా సార్వత్రిక సమ్మె పూర్తి స్థాయిలో విజయవంతమైంది. తెలంగాణలోని సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తి దాదాపుగా నిలిచిపోయింది. సమ్మె విజయవంతం అయిన తీరుకు ఇవి కొన్ని ఉదాహరణలే!

నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడిన తరువాత జరిగిన ఏడవ సార్వత్రిక సమ్మె ఇది! కార్మికుల, కర్షకుల గొంతులను అణచి వేయడం, విస్మరించడం ఇక ఏమాత్రం సాధ్యం కాదని మోడీ ప్రభుత్వం గుర్తించాలి. వారు లేవనెత్తిన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలి. సుంకాల పేరుతో పేట్రేగుతున్న అమెరికా అడుగులకు మడుగులొత్తి మన రైతాంగాన్ని కష్టాల పాల్జేయడానికి కేంద్రం సిద్ధమౌతున్న సమయంలో ఐక్యంగా నిలిచి సమ్మెను విజయవంతం చేసిన శ్రామిక లోకానికి జేజేలు.

మహనీయుల మాట



పుస్తకాలు ఎంత ముఖ్యమో, అంతకంటే పది రెట్లు మనిషి జీవితానుభవం ద్వారా నేర్చుకోగలుగుతాడు. విద్య పుస్తకాల వరకే పరిమితం కాక, నిత్య జీవితంతో సంబంధం కలిగి వుండాలి. అది జీవితాంతం విద్య కావాలి.

- గ్రుండ్ విగ్,
ఫోక్ హైస్కూల్ రూపకర్త.




విశ్లేషణ

భారతీయతా భావం నుండి వేరు చెయ్యలేం

(నిన్నటి సంచిక తరువాయి)

లౌకికవాదం, సామ్యవాదం అన్న పదాలను రాజ్యాంగ పీఠికలో 'చేర్చారు', ఇది 1970ల నాటి ప్రభుత్వ బలవంతపు చేర్పు! అన్న వాదనలు మోసపూరితమైనవి. రాజ్యాంగసభ చర్చలు, వలస పాలన నుండి విముక్తి కోసం సాగిన స్వాతంత్య్రోద్యమ అనుభవాలు - ఇవన్నీ గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన మన దేశం ఎంచుకున్న ఆదర్శాలకు కేంద్ర బిందువులు. రాజ్యాంగం పూచీ పడిన సామాజిక ఆర్థిక న్యాయం, సమానత్వం, సహోదరత్వ భావాలు ప్రస్తుతం సామ్యవాద లక్షణాలే. మత స్వేచ్ఛను కల్పించడం, మత ప్రాతిపదికన వివక్షకు పాల్పడకుండా సాగడం, మైనార్టీల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండడం లౌకికవాద ఆదర్శాలే. పీఠిక నుండి ఈ రెండు పదాలనూ తొలిగించినా మన రాజ్యంగ మౌలిక సిద్ధాంతం, నిర్మాణం, స్వభావం అన్నీ లౌకికవాద, సామ్యవాద భావజాలానికే కట్టుబడి ఉంటాయి.



ఎం.ఎ. బేబి

1949 నవంబర్ 25న రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ సభను ఉద్దేశించి చేసిన కడపటి ప్రసంగం కూడా ఈ స్ఫూర్తినే వ్యక్తీకరించింది. "మనం సాధించుకున్న రాజకీయ ప్రజాస్వామ్యంతో సంతృప్తి పడకూడదు. మనం సాధించుకున్న ఈ రాజకీయ ప్రజాస్వామ్యన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా మలుచుకోవాలి. సామాజిక ప్రజాస్వామ్యాన్ని పునాదిగా నిలబెట్టుకోలేని ఏ రాజకీయపు ప్రజాస్వామ్యమూ ఎంతో కాలం మనలేదు. ఇంతకీ సామాజిక ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? స్వేచ్ఛ, సమానత్వం, సహోదరత్వం. ఈ మూడూ జీవిత సూత్రాలుగా కొనసాగాలి. సమానత్వం లేని స్వేచ్ఛ, స్వేచ్ఛ లేని సమానత్వం పొసగే అవకాశం లేదు. స్వేచ్ఛ, సమానత్వాలు రెండూ సహోదరత్వ భావనతో ముడిపడి వుంటాయి. సమానత్వం లేని స్వేచ్ఛ అతి కొద్దిమందిని అధికులుగా తయారు చేస్తుంది. అలాగే సహోదరత్వ భావన కొరవడిన స్వేచ్ఛ అత్యధికుల మీద అతి కొద్దిమంది ఆధిపత్యానికి దారితీస్తుంది. సహోదరత్వ భావన కొరవడిన స్వేచ్ఛ, సమానతలు స్వాభావికంగా మనజాలవు" అని అంబేద్కర్ స్పష్టం చేశారు.



ఆర్.ఎస్.ఎస్. ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబళె మన రాజ్యాంగ పీఠిక నుండి సామ్యవాదం, లౌకికవాదం అన్న పదాలను తొలగించాలని ఆషామాషీగా పిలుపు ఇవ్వలేదు. చారిత్రక తప్పిదాలను సరిచేసే పేరిట మన రాజ్యాంగం పునాది నిర్మాణం మీదనే దాడి చేయడానికి ప్రణాళికాబద్ధంగా వేసిన ఎత్తుగడ ఇది. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ ప్రతిలో ఈ రెండు పదాలూ లేవని కాషాయ శక్తులు వాదనకు దిగుతున్నాయి కానీ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలోనే అంతర్గతంగా ఈ భావనలు పొందుపరచబడ్డాయన్న వాస్తవాన్ని గుర్తించ నిరాకరిస్తున్నారు. 42వ రాజ్యాంగ సవరణ పరోక్షంగా వున్న భావానికి ప్రత్యక్ష రూపం ఇచ్చింది

అంతేకాదు - "సామాజిక తలంలో మన భారతీయ సమాజం తీవ్రమైన అంతరాల దొంతరలతో కూడుకుని ఉన్నందున కొందరు అత్యున్నత స్థాయిలో మరికొందరు అత్యంత అధమ స్థాయిలో జీవిస్తున్న పరిస్థితి ఉన్నది. ఆర్థిక రంగాన్ని పరిశీలిస్తే సమాజంలో అతి కొద్ది మంది పట్టరాని సంపదను అనుభవిస్తుంటే అత్యధిక ప్రజానీకం దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతున్నారు. 1950 జనవరి 26న మనం ఇన్ని వైరుధ్యాల మయమైన జీవితంలోకి అడుగిడబోతున్నాం. రాజకీయాల్లో సమానత్వం దాగి సామాజిక ఆర్థిక జీవితాల్లో తీవ్ర అసమానతలు ఎదుర్కొంటున్నాం. రాజకీయాల్లో ఒక మనిషికి ఒకే ఓటు ఒకే విలువను మనం గుర్తిస్తున్నాం. అయితే మన సమాజంలో సామాజికంగా ఆర్థికంగా నెలకొన్న తీవ్ర అసమానతల కారణంగా సామాజిక ఆర్థిక జీవితాల్లో ఒక మనిషి ఒకే విలువ అన్న సూత్రాన్ని నిరాకరిస్తున్నాం. సామాజిక ఆర్థిక రంగాల్లో ఇలా మనం ఎంతకాలం సమానత్వాన్ని నిరాకరిస్తూ కొనసాగగలుగుతాం? ఎప్పటికి ఈ వైరుధ్యాన్ని పరిష్కరిస్తాం? ఈ అసమానతలు దీర్ఘ కాలం పాటు కొనసాగితే మన రాజకీయ ప్రజాస్వామ్యం పెను సంక్షోభంలో పడిపోతుంది. సాధ్యమైనంత తొందరగా మనం ఈ వైరుధ్యాన్ని పరిష్కరించాలి. లేదంటే ఈ అసమానతలతో బాధలు అనుభవిస్తున్నవారు మనం ఎంతో శ్రమకోర్చి సాధించుకున్న రాజకీయ ప్రజాస్వామ్య సౌధాన్ని బద్దలుకొడతారు." అని డాక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు.

సమాజంలో ఉన్న సామాజిక, ఆర్థిక అంతరాలను, అసమానతలను పరిష్కరించే సాధనంగా మన రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని అంబేద్కర్ శక్తివంతంగా తెలియజెప్పారు. లౌకికవాదం, స్వామ్యవాదాల స్ఫూర్తి ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. మన రాజ్యాంగానికి పునాది విలువలుగా ఉన్న లౌకికవాదం, స్వామ్యవాద భావనలను ఏమాత్రం పలుచన చేయాలని చూసినా రాజకీయ ప్రజాస్వామ్యం దెబ్బ తినిపోయే ప్రమాదం ఉన్నదని ముందుగానే హెచ్చరించారు.

బట్టబయలైన ఆర్.ఎస్.ఎస్ వైఖరి

ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబళె మన రాజ్యాంగ పీఠిక నుండి సామ్యవాదం, లౌకికవాదం అన్న పదాలను తొలగించాలని ఆషామాషీగా పిలుపు ఇవ్వలేదు. చారిత్రక తప్పిదాలను సరిచేసే పేరిట మన రాజ్యాంగం పునాది నిర్మాణం మీదనే దాడి చేయడానికి ప్రణాళికాబద్ధంగా వేసిన ఎత్తుగడ ఇది. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ ప్రతిలో ఈ రెండు పదాలూ లేవని కాషాయ శక్తులు వాదనకు దిగుతున్నాయి కానీ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలోనే అంతర్గతంగా ఈ భావనలు పొందుపరచబడ్డాయన్న వాస్తవాన్ని గుర్తించ నిరాకరిస్తున్నారు. 42వ రాజ్యాంగ సవరణ పరోక్షంగా వున్న భావానికి ప్రత్యక్ష రూపం ఇచ్చింది. 42వ రాజ్యాంగ సవరణ చేపట్టక మునుపే రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(2)(ఎ)లో లౌకికవాదం అనే పదం పొందుపరచబడి ఉంది. అలాగే రాజకీయ, సామాజిక శాంతిని నెలకొల్పడం కోసం ప్రజల సంక్షేమాన్ని పెంపొందించాలని ఆర్టికల్ 38 ద్వారా నిర్దేశించి సామ్యవాద భావనలవైపు మొగ్గింది.

చారిత్రకంగా పరిశీలిస్తే ఆర్‌ఎస్‌ఎస్ మన సమాజంలో అసమానతలు, పితృస్వామిక భావజాలాన్ని మరింతగా పెంచి పోషించి, మెజార్టీ మతతత్వ ధోరణితో మన జాతీయతను పునర్ నిర్వచించాలని ప్రయత్నిస్తున్నదని ఎవరికైనా ఇట్టే బోధపడుతుంది. చరిత్రను తిరగ రాసి, వలస వ్యతిరేక స్వాతంత్య్రోద్యమ ఘన వారసత్వానికి మసిబూసి మారేడు కాయ చేసి మత రాజ్యాన్ని స్థాపించాలనే తన లక్ష్యానికి ఆటంకంగా ఉన్నాయి కాబట్టే రాజ్యాంగ పీఠిక నుండి లౌకికవాద, సామ్యవాద పదాలను తొలగించడానికి ప్రయత్నిస్తున్నది. ఇది మన దేశ బహుళత్వానికి, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిది.

మన రాజ్యాంగం ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సహోదరత్వ భావనలను కల్పించాలని, ఇందుకు లౌకికవాద, సామ్యవాద దృక్పథమే మార్గాంతరమని స్పష్టం చేస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ తాజాగా ఈ విలువల మీదే దాడికి తెగబడి ప్రజలకు రాజ్యాంగ హక్కులు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నది. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి ఆ స్థానంలో మనుస్మృతిని తీసుకువచ్చి దేశాన్ని హిందూ రాజ్యంగా మలచాలని కుట్ర పన్నుతుంది.

స్వాతంత్య్రోద్యమంలో పాలుపంచుకుని తమ యవ్వనాన్ని వ్యర్థం చేసుకోవద్దని పిలుపునిచ్చి ఒక తరం యువతరాన్ని బ్రిటిష్ వలస వ్యతిరేక పోరాటానికి దూరం చేయాలన్న దుష్ట బుద్ధితో వ్యవహరించిన ఆర్‌ఎస్‌ఎస్ తాజా కుట్రలను...స్వాతంత్య్రోద్యమ విలువల పట్ల గౌరవంగల శక్తులన్నీ కలిసి ఐక్యంగా తిప్పికొట్టాలి. మతతత్వ హిందూ రాజ్యాన్ని నెలకొల్పాలన్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నాలను వమ్ము చేసి భారత రాజ్యాంగాన్ని సమున్నతంగా నిలబెట్టాలి.

(వ్యాసకర్త సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి)

సమస్య

ఉద్దానం ఉసురు తియ్యొద్దు!

ఉద్దానం, శ్రీకాకుళం జిల్లాలోని సముద్రతీర ప్రాంతం. కొబ్బరి, జీడి తోటలు, పచ్చని పొలాల మధ్య నెలకొన్న సహజ సౌందర్య ప్రాంతం. ఉద్యానవనంలా ఉండడంతో దీనికి ఉద్దానం అనే పేరు వచ్చింది. ఇక్కడి ప్రజలు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ, వందల సంఖ్యలో మరణిస్తున్నా పట్టని ప్రభుత్వం నేడు ఉద్దానంలో అభివృద్ధి పేరిట విధ్వంసానికి పాల్పడుతోంది.

దేశంలోని కార్గో ఎయిర్‌పోర్టులన్నీ ఏదో ఒక ఎయిర్‌పోర్టుతో అనుసంధానమై ఉన్నాయి. కానీ, ఈ కార్గో ఎయిర్‌పోర్టు మాత్రం దేశంలో మొదటిసారిగా, ఎలాంటి ప్యాసింజర్ ఎయిర్‌పోర్టుతో సంబంధం లేకుండా ప్రతిపాదించబడింది. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) బృందం 2024 నవంబర్ 22న మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని ప్రతిపాదిత ప్రాంతాలను సందర్శించి, స్థల పరిశీలన నిర్వహించింది. మందస మండలంలోని బేతాళపురం, లక్ష్మీపురం, బిడిమి, వజ్రపుకొత్తూరు మండలంలోని మెట్టూరు, చీపురుపల్లి పంచాయతీలలో 1383.98 ఎకరాల భూమిని గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశాల మేరకు...భూమి కేటాయింపు, అవసరమైన వనరుల సమీకరణ కోసం...జిల్లా అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. అయితే ఈ ప్రతిపాదిత కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి స్థానిక ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత ఎదురవుతోంది. ఈ భూ సేకరణ వల్ల గంగువాడ, బేతాళపురం, లక్ష్మీపురం, బిడిమి, అనకాపల్లి, ఒంగూరు వంటి గ్రామాల్లోని రైతుల జీవనోపాధి దెబ్బతింటుంది. ఈ ప్రాంతంలోని సారవంతమైన వ్యవసాయ భూములు, కొబ్బరి, జీడి తోటలు నాశనమవుతాయి.



శ్రీకాకుళంలో ప్రతిపాదిత కార్గో విమానాశ్రయం కోసం చేపడుతున్న 'భూ సేకరణ'కు నిరసనగా జాతా

భారతదేశంలో ప్రస్తుతం పూర్తిగా కార్గో రవాణాకు ప్రత్యేకంగా నిర్మించిన, కార్గో కార్యకలాపాల కోసం మాత్రమే ఉపయోగించే విమానాశ్రయాలు లేవు. అనేక ప్రధాన విమానాశ్రయాలే ప్రయాణికుల సేవలతో పాటు కార్గో నిర్వహణకు ప్రత్యేక కార్గో టెర్మినళ్లు నిర్వహిస్తున్నాయి. ఉదాహరణకు ఢిల్లీ విమానాశ్రయం భారతదేశంలోనే అతి పెద్ద కార్గో కేంద్రమే కాక, దక్షిణ ఆసియాలోనే అత్యధిక కార్గో నిర్వహణ సామర్థ్యం కలిగినది. ఇది కేవలం 150 ఎకరాల విస్తీర్ణంలో రెండు సమీకృత కార్గో టెర్మినళ్లు, ఆన్-ఎయిర్‌పోర్ట్ లాజిస్టిక్స్ సెంటర్, 70 పైగా అంతర్జాతీయ, 80 పైగా దేశీయ గమ్యస్థానాలకు సేవలు అందిస్తోంది.

ఇవన్నీ పరిశీలించాక...అంత పెద్దఎత్తున కార్గో సేవలు అందిస్తున్న ఢిల్లీ కేంద్రానికే 150 ఎకరాలు సరిపోయినప్పుడు, ఈ ప్రతిపాదిత కార్గో ఎయిర్‌పోర్టుకు దాదాపు 1400 ఎకరాల భూమి అవసరమా? అన్నది ప్రధాన అంశం. రెండోది మిగిలినవన్నీ ఏదో ఎయిర్‌పోర్టుతో అనుసంధానంగా ఉంటే, ఇక్కడ ప్రత్యేకంగా వేరే ఉండవలసిన అవసరం ఏమిటి? మూడోది ప్రతిపాదిత మూల పేట పోర్టు వద్ద ఢిల్లీకి రెట్టింపు భూమి (అంటే 300 ఎకరాలు) ఉండగా, మరలా భూ సేకరణ అవసరం ఏమొచ్చింది? నాల్గవది దీనికి సమీపంలోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తవుతుండగా, దేశంలో మిగిలిన చోట్ల లాగానే అక్కడే కార్గో రవాణా ఏర్పాట్లు చేయవచ్చు కదా! ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికితే, అనేక ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగు చూస్తాయి. అవేమిటంటే, టిడిపి కూటమి ప్రభుత్వం పారిశ్రామికీకరణ పేరున పెద్దఎత్తున భూ పందేరం చేస్తోంది. రాజధాని అమరావతి, నెల్లూరు, విశాఖ, ప్రకాశం, అల్లూరి జిల్లాల్లో పంప్డ్ హైడ్రో ప్రాజెక్టుల పేరున గిరిజన ప్రాంతంలోనూ ఇదే తీరు.

ఉద్దానం ప్రాంతంలో ఇప్పటికే పోర్టు పేరున మూలపేట దగ్గర భూసేకరణ చేశారు. గతంలోనే థర్మల్ పవర్ పేరున సోంపేట వద్ద వెయ్యి ఎకరాల భూమి సేకరించి, అలాగే ఉంచారు. ఇదే జిల్లా కాకరాపల్లిలో 2240 ఎకరాల భూమిని సేకరించి ఖాళీగా వదిలేశారు. దీనివల్ల అనేక మంది మత్స్యకారులకు ఉపాధి పోయింది. తమ భూమిని తమకు అప్పగించమని గత పదిహేనేళ్లుగా స్థానికులు పోరాడుతున్నా పాలకులలో చలనమే లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా కల్లబొల్లి కబుర్లు కట్టిపెట్టి, ఉద్దానం ఉసురు తీసే విధానాలు విడనాడాలి. ఇక్కడ కార్గో ఎయిర్ పోర్టు నిర్ణయం విరమించుకోవాలి. వ్యవసాయాధారిత కొబ్బరి పీచు, జీడి పండ్ల రసం, ఇతర పంటల ప్రోసెసింగ్ యూనిట్లు, వంశధార నీరు, మత్స్యకారులకు జీవనోపాధి పెంచేలా భావనపాడు ఫిషింగ్ హార్బర్, జెట్టీలు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు, కిడ్నీ వ్యాధి నిర్మూలన వంటి చర్యల ద్వారానే ఉద్దానం అభివృద్ధి సాధ్యమనే వాస్తవాన్ని గుర్తించాలి.

- కోనారి మోహన రావు,
ఎ.పి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి,
సెల్ : 9492418043

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

వ్యాఖ్య

వివేకానందుడు-గోరక్షకుడు

ఇది 1897 ఫిబ్రవరిలో కోల్‌కతాలోని బాగ్ బజార్ ప్రాంతంలో జరిగింది. స్వామి వివేకానందుడు రామకృష్ణ పరమహంస భక్తుడు ప్రియనాథ్ ఇంట్లో కూర్చుని ఉన్నారు. రామకృష్ణ భక్తులు చాలా మంది ఆయనను కలవడానికి అక్కడికి వచ్చారు. అక్కడ రకరకాల అంశాల గురించి మాట్లాడుకుంటున్నారు. అప్పుడే అక్కడికి గోరక్షణ గురించి ప్రచారం చేసే ఒక వ్యక్తి వచ్చారు. వివేకానందుడు ఆయనతో మాట్లాడారు. వారిద్దరి మధ్య చాలా ఆసక్తికరమైన చర్చ జరిగింది. దీనిని శరత్‌చంద్ర చక్రవర్తి బంగ్లాలో రాశారు. స్వామీ వివేకానందుడు గోరక్షణ ప్రచారకులతో అప్పట్లో ఏం మాట్లాడి ఉంటారు? షికాగోలో 1893లో జరిగిన ప్రపంచ మత సమ్మేళనంలో హిందూమతం విశిష్టతపై అనర్గళంగా ప్రసంగించి స్వదేశానికి తిరిగి వచ్చిన వివేకానంద గోరక్షకులతో ఏమని మాట్లాడారో ఊహించడం అంత సులభం కాదు.



(వివేకానందుడు-గోరక్షకుడి మధ్య సంభాషణ)

ఆ రోజు గోరక్షకుడు కూడా కాషాయ వస్త్రాలే ధరించి ఉన్నారు. ఆయన తలపై కాషాయ తలపాగా కూడా ఉంది. ఆయన బెంగాల్ బయట హిందీ బెల్టుకు చెందినవారు. గోరక్షకుడైన ఆ స్వామీజీ, వివేకానందుడు ఉన్న గది లోపలికి అడుగుపెట్టారు. వివేకానందునికి ఒక గోమాత చిత్రం ఇచ్చారు. తర్వాత వివేకానందుడు ఆయనతో మాట్లాడారు. ఇద్దరి మధ్యా జరిగిన ఆ సంభాషణ 'కంప్లీట్ వర్క్స్ ఆఫ్ వివేకానంద'లో ఇలా ఉంది.

వివేకానందుడు- మీ సంఘం ఉద్దేశం ఏంటి?

గోరక్షకుడు- మేం దేశంలోని గోమాతలను కసాయిల నుంచి రక్షిస్తున్నాం. వివిధ ప్రాంతాల్లో గోశాలలు ఏర్పాటు చేశాం. కసాయిల నుంచి తప్పించిన వాటిలో జబ్బుపడి, బలహీనంగా ఉన్న ఆవులకు గోశాలల్లో ఆశ్రయం ఇచ్చాం.

వివేకానందుడు - చాలా మంచి విషయం చెప్పారు. మీ సంఘానికి ఆదాయం ఎలా వస్తుంది?

గోరక్షకుడు - మీలాంటి మహాపురుషులు దయతో కొంత ఇస్తారు. వాటితోనే సంఘాన్ని నిర్వహిస్తాం.

వివేకానందుడు - మీ దగ్గర జమ అయిన మొత్తం ఎంత ఉంటుంది?

గోరక్షకుడు - మార్వాడీ వైశ్య సంఘాలు దీనికి చాలా ఆర్థిక సాయం అందిస్తున్నాయి. వారు ఈ సత్కార్యానికి చాలా నిధులు అందించారు.

వివేకానందుడు - మధ్య భారతదేశంలో ప్రస్తుతం భయంకరమైన కరువు ఉంది. తిండి దొరకక 9 లక్షల మంది ఆకలితో చనిపోయారని భారత ప్రభుత్వం చెప్పింది. మీరు ఈ కరువు పరిస్థితుల్లో వారికి ఏదైనా సాయం చేయడానికి ప్రయత్నించారా?

గోరక్షకుడు - మేం కరువులు లాంటి వాటికి సాయం చేయం. ఈ సంఘం కేవలం గోవులను రక్షించాలనే ఉద్దేశంతోనే ఏర్పాటు చేశారు.

వివేకానందుడు - కరువుతో మీ కళ్ల ముందే లక్షలాది మంది చనిపోతున్నారు. మీ దగ్గర అంత డబ్బు ఉన్నప్పుడు వారికి ఒక్క మెతుకైనా అందించి, భయంకరమైన కరువు నుంచి వారిని కాపాడడం మీ కర్తవ్యం అనుకోలేదా?

గోరక్షకుడు - లేదు, అది వారి కర్మఫలం. వారు పాపాలు చేయడం వల్లే కరువు వచ్చింది. 'కర్మ ఎలా ఉంటుందో అలాంటి ఫలం లభిస్తుంది'.

గోరక్షకుల సమాధానం విని స్వామి వివేకానందుడి కళ్లు ఆగ్రహంతో మరింత పెద్దవయ్యాయి. చింతనిప్పుల్లా మారాయి. కానీ ఆయన తన భావాలన్నీ లోపలే దాచుకున్నారు. శాంతంగా మాట్లాడారు.

"ఏ సంఘాలు మనుషులపై సానుభూతి చూపించవో, సాటి సోదరుల ఆకలి చావులు చూస్తూనే, వారి ప్రాణాలు కాపాడడానికి పిడికెడు మెతుకులు కూడా పెట్టవో, పక్షులు-పశువుల కడుపు నింపడానికి మాత్రం భారీగా ఖర్చు పెడతాయో అలాంటి సంఘాలపై నాకు ఎలాంటి సానుభూతి ఉండదు. అలాంటి సంఘాల వల్ల సమాజానికి పెద్దగా ప్రయోజనం ఉంటుందని నాకు ఎలాంటి నమ్మకం లేదు" అని వివేకానంద అన్నారు.

తర్వాత వివేకానందుడు కర్మఫలం గురించి కూడా మాట్లాడారు.

"మనుషులు తమ కర్మఫలం వల్లే మరణిస్తున్నారు. ఇలా అంతా కర్మఫలం అని ఉండిపోతే, ప్రపంచంలో ఏదైనా పని చేయడానికి ప్రయత్నించడం అనేది పూర్తిగా పనికిరానిదనే నిరూపితం అవుతుంది. పశుపక్ష్యాదులకు మీరు చేసే సాయం కూడా దీని కిందికే వస్తుంది. దీనిని కూడా కర్మఫలమనే చెప్పవచ్చు. గోమాతలు కూడా తమతమ కర్మఫలం వల్లే కసాయిల చేతుల్లోకి చేరుతున్నాయి. ప్రాణాలు కోల్పోతున్నాయి. అందుకే వాటి రక్షణ కోసం ప్రయత్నించడం వ్యర్థం" అన్నారు.

వివేకానందుడి వ్యంగ్యం

వివేకానందుడి నోటి వెంట ఆ మాటలు విన్న గోరక్షకుడి నోట కాసేపు మాట రాలేదు. తర్వాత ఆయన "ఆ, మీరు చెబుతున్నది నిజమే, కానీ శాస్త్రాలు గోవును మన తల్లిగా చెబుతున్నాయిగా" అన్నారు.

ఆయన మాటలు వివేకానందుడికి నవ్వు తెప్పించాయి. ఆయన నవ్వుతూనే "అవును, గోవు మన తల్లి. అది నాకు చాలా బాగా తెలుసు. లేదంటే ఇలాంటి అద్భుతమైన సంతానానికి వేరే ఎవరు జన్మనివ్వగలరు" అన్నారు.

దాంతో గోరక్షకుడు ఏం మాట్లాడలేకపోయారు. ఆయన బహుశా వివేకానందుడి వ్యంగ్యాన్ని అర్థం చేసుకుని ఉండరు. తర్వాత ఆ గోరక్షకుడు వివేకానందుడితో ఈ సంఘం తరఫున మీ దగ్గర ఏదైనా భిక్ష పొందడానికి వచ్చాను అన్నాడు.

దానికి వివేకానందుడు "నేను ఏమీలేని సన్యాసిని, బికారిని. నా దగ్గర మీకు సాయం చేయడానికి చిల్లిగవ్వ కూడా లేదు. కానీ ఇంకో మాట కూడా చెప్పాలి. నా దగ్గర ఎప్పుడైనా డబ్బు ఉన్నా, దానిని మొదట మనుషులకు సేవ చేయడానికే ఖర్చు చేస్తా. మొదట మనిషిని కాపాడాలి. అన్నదానం, విద్యాదానం, జ్ఞానదానం చేయాలి. అవన్నీ చేశాక, డబ్బులేవైనా మిగిలితే అప్పుడు మీ సంఘానికి ఎంతోకొంత ఇవ్వగలను" అన్నారు.

వివేకానందుడి సమాధానంతో గోరక్షకుడు అక్కడినుంచి వెళ్లిపోయారు.

'మానవత్వమే పెద్ద మతం'

అప్పుడు అక్కడే ఉన్న రామకృష్ణ పరమహంస శిష్యుడు శరత్‌చంద్ర తర్వాత ఏం జరిగింది రాశారు. తమతో జరిగిన సంభాషణను వివరించారు.

'గోరక్షకుడు ఏం చెప్పారు, ఏమన్నారు? కర్మఫలం వల్లే మనిషి మరణిస్తున్నాడా? అందుకే వాళ్లపై ఎందుకు దయ చూపించాలి అంటాడా? మన దేశం ఇలా కావడానికి ఇది సజీవ సాక్ష్యం. నీ హిందూ మతం కర్మవాదం ఎటువైపు వెళ్లిపోతోంది? మనిషిగా ఉండి సాటి మనిషి మీద జాలి చూపించని వారు అసలు మనుషులేనా?' అని వివేకానందుడు అన్నారని శరత్ చంద్ర చెప్పారు.

అలా అంటున్నప్పుడు వివేకానందుడి శరీరమంతా బాధతో, దుఃఖంతో కదిలిపోయింది.

ఈ మొత్తం సంభాషణ 128 ఏళ్ల ముందు జరిగింది. కానీ ఈ సంభాషణకు ప్రస్తుత కాలానికి ఏదైనా సంబంధముందా?

ఈ సంభాషణతో వివేకానందుడికి మనిషి, మానవత్వం అనేదే అన్నిటికంటే పెద్ద మతం అని మనకు తెలుస్తుంది. కానీ ఆయన పేరు తలుచుకున్నప్పుడు, వివేకానందుడిలోని ఈ భావన మనలో ఎంతమందికి గుర్తొస్తుంది.

మరింత ఆలోచిస్తే?

మెదడుకు పనిపెడితే, అది మెదడును మరింత చురుగ్గా చేస్తుందని నిపుణులు చెబుతారు. అందుకే మనం ఇప్పుడు ఒక విషయాన్ని ఊహించుకుందాం. ఒకవేళ కాషాయ వస్త్రాలు, తలపాగా ధరించే స్వామి వివేకానందుడే ఇప్పుడు మన మధ్య ఉండుంటే ఇటీవల జరిగిన ఘటనలకు ఏమనేవారు?

జార్ఖండ్‌లో సంతోషి, మీనా ముసహర్, సావిత్రి, రాజేంద్ర బిర్హోర్.. ఇక ఢిల్లీలోని ముగ్గురు చిన్నారులు శిఖ, మానసి, పారుల్ ఆకలితో చనిపోయారు.

ఆవులు దొంగిలించారనే ఆరోపణలతో అఖ్లాఖ్, అలీముద్దీన్, పహ్లూ ఖాన్, కాసిం, రక్బర్ ఖాన్ లాంటి వారిని హత్య చేశారు.

ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి హత్యలు, దాడులు లేదా ఇతర హింసను సమర్థించుకునే ప్రయత్నాలు జరిగాయి.

గోశాలల్లో ఆవులు మృతి చెందాయి.

పంట చేతికి రాక అప్పుల్లో మునిగిపోయి వేలాది రైతులు చనిపోయారు.

ఇలాంటి ఘటనలు చూసుంటే వివేకానందుడు ఏం అనేవారో మనం సులభంగా అంచనా వేయచ్చు. అవునా?

అయినా, ఇలాంటి వాటిని ప్రశ్నించడం అక్రమమే అవుతుంది. ఒకవేళ ఈరోజు స్వామి వివేకానందుడు ఉంటే, ఆయన ఎవరైనా గోరక్షకుడితో అప్పుడు మాట్లాడినట్టే మాట్లాడి ఉంటే ఆయనకు ఏమయ్యేది?

/బిబిసి.కామ్ సౌజన్యంతో/

సార్వత్రిక సమ్మె సక్సెస్

దేశవ్యాప్తంగా 25 కోట్ల మందికి పైగా భాగస్వామ్యం • కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలకు కార్మిక సంఘాలు అభినందనలు



మహారాష్ట్రలోని ముంబయి-ఢిల్లీ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న నాయకులు, మహిళలు



గుజరాత్‌లో..

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌ల రద్దుతో పాటు మరో 17 డిమాండ్లతో జరిగిన జాతీయ సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగాలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాల్లో 25 కోట్ల మందికి పైగా ఈ సమ్మెలో భాగస్వాములు అయ్యారు. పలుచోట్ల రాస్తారోకో, రైల్‌రోకోలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలు, బ్లాక్-సబ్ డివిజన్ స్థాయిల్లో అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, సాధారణ ప్రజలతో సహా వివిధ వర్గాల ప్రజానీకం భారీ ఆందోళనలు చేపట్టింది. అనేక రాష్ట్రాల్లో విద్యార్థులు, యువత భాగస్వామ్యం అయ్యారు. గ్రామీణ భారతదేశంలో ఆందోళనలకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి ఫ్రంట్ నాయకత్వం గణనీయమైన పాత్ర పోషించింది.

బొగ్గు, ఎన్‌ఎండిసి లిమిటెడ్, ఇనుప ఖనిజం, రాగి, బాక్సైట్, అల్యూమినియం, బంగారు గనులు, బొగ్గుయేతర ఖనిజాలు, ఉక్కు, బ్యాంకులు, ఎల్‌ఐసి, జిఐసి, పెట్రోలియం, విద్యుత్, పోస్టల్, గ్రామీణ డాక్ సేవకులు, టెలికాం, అణుశక్తి, సిమెంట్, పోర్ట్ అండ్ డాక్, తోటలు, జూట్ మిల్లులు, మెడికల్ అండ్ సేల్స్, ఐటీ అండ్ ఐటీఈలు, ప్రజా రవాణా, ప్రయివేటు రంగంలో వివిధ రకాల రవాణా, వివిధ రంగాలు, రాష్ట్రాల్లోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పోస్టల్, ఆదాయపు పన్ను, ఆడిట్, ఇతర ప్రధాన రంగాలలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. అనేక బహులజాతి కంపెనీ (ఎంఎన్‌సి)లు సహా దేశంలోని చాలా పారిశ్రామిక ప్రాంతాలలోని కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని ప్రదర్శనలు నిర్వహించారు. రక్షణ రంగ ఉద్యోగులు సమ్మెకు మద్దతుగా ఒక గంట పాటు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రైల్వే యూనియన్లు సంఘీభావ కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. నిర్మాణ కార్మిక సంఘాలు, బీడీ, అంగన్‌వాడి, ఆశా, మిడ్ డే మీల్‌తో సహా ఇతర స్కీమ్ కార్మికులు, మత్స్యకారులు, గృహ కార్మికులు, హాకర్లు, హెడ్-లోడ్ కార్మికులు, ప్రయివేటు సెక్యూరిటీ వర్కర్లు, ఉబర్, ఓలా, ఇన్‌స్టామార్ట్, స్విగ్గీ, ర్యాపిడో, గృహ ఆధారిత పీస్ రేట్ కార్మికులు, రిక్షా, ఆటో, టాక్సీ డ్రైవర్లు సమ్మెలో పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు, సామాజిక కార్యకర్తలు కూడా అనేక చోట్ల ప్రదర్శనలు, ధర్నాల్లో పాల్గొన్నారు. సామాన్య ప్రజలు సైతం సమ్మె చర్యలకు మద్దతు ఇచ్చారు. పుదుచ్చేరి, అస్సాం, బీహార్, జార్ఖండ్, తమిళనాడు, పంజాబ్, కేరళ, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, కర్ణాటక, గోవా, మేఘాలయ, మణిపూర్, జమ్ముకాశ్మీర్, అండమాన్ నికోబర్ మొదలైన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో బంద్ దిగ్విజయంగా జరిగింది. రాజస్థాన్, హర్యానా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మొదలైన రాష్ట్రాల్లోనూ సమ్మె జరిగింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్‌లలో పారిశ్రామిక వాడల్లో సమ్మె విజయవంతంగా జరిగింది. అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు, ప్రయివేటు సంస్థల యజమానులు బెదిరింపులు, అణచివేత చర్యలకు పాల్పడ్డారు. వీటిని కార్మికులు, ఉద్యోగులు సమర్థవంతంగా తిప్పికొట్టారు. కోల్ ఇండియా లిమిటెడ్, దాని అనుబంధ కంపెనీల్లో సమ్మె సంపూర్ణంగా జరిగింది.



బెంగళూరులో..

కోల్ ఇండియాలో బంద్ సంపూర్ణం

కలకత్తా ఓడరేవులో నిలిచిన సరుకుల రవాణా

కోల్ ఇండియా లిమిటెడ్, దాని అనుబంధ కంపెనీల సమ్మె సంపూర్ణంగా జరిగింది. కలకత్తా ఓడరేవులో సరుకు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. పోర్ట్ కార్మికులు, ఉద్యోగులు చేపట్టిన సమ్మె కారణంగా కోల్‌కతాలోని పోర్ట్ ట్రస్టులో భాగమైన నేతాజీ సుభాష్ డాక్‌లో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పోర్టులోని తాత్కాలిక కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, వారికి కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ పోర్టులోని అనేక కార్మిక సంఘాల కార్మికులు సమ్మెకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కలకత్తా పోర్ట్, షోర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సమర్ మండల్ మాట్లాడుతూ.. శాశ్వత, తాత్కాలిక కార్మికుల ఉమ్మడి భాగస్వామ్యం కారణంగా పోర్టు పనులు పూర్తిగా నిలిచిపోయాయని అన్నారు.

ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఉద్యోగులు సమ్మెకు సంఘీభావం తెలిపారు. భారతీయ నావికులు సముద్రంలో షిప్‌లపై నిరసన తెలిపారు. మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగులు సమ్మె చేశారు. బిపిసిఎల్‌లో సమ్మె చేయకూడదనే కేరళ హైకోర్టు ఆదేశాన్ని ఉల్లంఘిస్తూ, కొచ్చి శుద్ధి కర్మాగారంలోని ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.

బెంగాల్‌లో అరెస్టులు

పశ్చిమ బెంగాల్‌లోని కోలకత్తా, ప్రెసిడెన్సీ, జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయాల విద్యార్థులు సమ్మెకు సంఘీభావంగా వీధుల్లోకి వచ్చారు. కోలకత్తాలో ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్యతో పాటు పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులోని అనేక చోట్ల రైలు రాకపోకలు స్తంభించాయి. ఇంధన రంగంలోని ఉద్యోగులు, కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.

ఢిల్లీలో నిరసన ప్రదర్శన

సమ్మెకు మద్దతుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ట్రేడ్ యూనియన్లు, జర్నలిస్టులు, వివిధ ఉద్యోగుల నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలో పది కేంద్ర కార్మిక సంఘాల జాతీయ నాయకులు తపన్ సేన్ (సిఐటియు), అమర్‌జీత్ కౌర్ (ఎఐటియుసి), అశోక్ సింగ్ (ఐఎన్‌టియుసి), హర్భజన్ సింగ్ (హెచ్‌ఎంఎస్), రాజీవ్ దిమ్రీ (ఎఐసిసిటియు), లతా బెన్ (సేవా), చౌరాసియా (ఎఐయుటియు), జవహర్ (ఎల్‌పిఎఫ్), ధర్మేంద్ర వర్మ (టియుసిసి) ఆర్‌ఎస్ డాగర్ (యుటియుసి), వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఐసిఇయు, ఎంఇసి, ఎఐకెఎస్ నేతలు పాల్గొన్నారు. జంతర్ మంతర్ వద్ద నుంచి నిర్వహించిన భారీ ర్యాలీలో సిఐటియు అధ్యక్షురాలు కె హేమలత, కార్యదర్శి ఎఆర్ సింధు, కిసాన్ సభ అధ్యక్షులు అశోక్ ధావ్లే, ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. అరుణ్ కుమార్, సీనియర్ నేతలు బృందాకారత్, హన్నన్‌మొల్ల, ఎస్. పుణ్యవతి, రాజ్యసభ ఎంపి ఎఎ రహీం, అనురాగ్ సక్సేనా, పి.కృష్ణప్రసాద్, పివి అనియన్ తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు సంఘీభావంగా జర్నలిస్టులు ర్యాలీ చేశారు. డియుజె నాయకులు ఎస్ కె పాండే, ఎఎం జిగీష్, సుజాత మధోక్, కెయుడబ్ల్యుజె నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.

కార్మిక వర్గానికి సిపిఎం అభినందనలు

లేబర్ కోడ్ సవరణలు రద్దు చేయాలి : సిపిఐ(ఎం)

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతమవడంతో కార్మిక వర్గానికి సిపిఐ(ఎం) అభినందనలు తెలిపింది. ఈ మేరకు పార్టీ పొలిట్‌బ్యూరో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సమ్మెలో పాల్గొననివ్వకుండా పలు చోట్ల కార్మికులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. మరికొన్ని చోట్ల లాఠీచార్జి చేశారు. అయినా సరే కార్మికులు ఆ దాడులన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని, సమ్మెను విజయవంతం చేశారు. కార్మికులకు సంఘీభావంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, వివిధ రంగాలకు చెందిన ప్రజలు ఈ సమ్మెలో పాల్గొన్నారు. నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కార్మిక వర్గానికి మద్దతుగా నిలిచి, ఈ సార్వత్రిక సమ్మెను పెద్ద ఎత్తున విజయవంతం చేసిన అందరికీ సిపిఎం అభినందనలు తెలియజేస్తోందని ఆ ప్రకటన పేర్కొంది. వివాదాస్పద లేబర్ కోడ్‌లు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన గళాన్ని కేంద్రంలోని మోడీ సర్కారు వినాలని కోరింది. కార్మిక చట్టాలకు చేసిన సవరణలను వెంటనే రద్దు చేయాలని, వారి హక్కులను కాపాడాలని ఆ ప్రకటనలో పార్టీ డిమాండ్ చేసింది.



కోల్‌కతాలో..



హర్యానాలో..



ఢిల్లీలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, మాట్లాడుతున్న తపన్ సేన్ (ఇన్‌సెట్‌లో)

గుజరాత్ యూనివర్సిటీలో ఫుడ్ పాయిజన్

- వంద మందికిపైగా విద్యార్థులకు అస్వస్థత

వడోదరా: వదోదరలోని మహారాజా సాయాజీరావు విశ్వవిద్యాలయంలోని ఎస్‌డి హాల్ హాస్టల్‌లో వంద మందికిపైగా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం రాత్రి సమయంలో హాస్టల్‌లో డిన్నర్ చేసిన తర్వాత వారంతా ఇబ్బందికి గురయ్యారు. భోజనం చేసిన కొన్ని గంటల తర్వాత విద్యార్థులు విరేచనాలు, వాంతులు, తీవ్రమైన కడుపు నొప్పితో ఇబ్బంది పడ్డారు. మెస్‌లో భోజనం చేసిన సుమారు 350 మంది విద్యార్థుల్లో వంద మందికిపైగా విద్యార్థుల్లో ఫుడ్ ఇన్ఫెక్షన్ లక్షణాలు కనిపించాయి. హాస్టల్ యాజమాన్యం వెంటనే విద్యార్థులను చికిత్స నిమిత్తం గోత్రి, సాయాజీ ఆస్పత్రులకు తరలించారు. ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు వైద్యులు తెలిపారు. విద్యార్థుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనతో వర్సిటీ హాస్టల్‌లో ఆహార భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు వర్సిటీకి చేరుకొని హాస్టల్ మెస్‌నుంచి శాంపిల్స్ కలెక్ట్ చేసుకున్నారు.

నాణ్యతపై విద్యార్థుల ఆందోళనలు చేస్తున్నా..

హాస్టల్ మెస్‌లో అందించే ఆహారం నాసిరకంగా ఉంటోందని విద్యార్థులు చాలాకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫుడ్ నాణ్యత విషయంలో గతంలో చాలాసార్లు హాస్టల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి నాసిరకం ఆహారం తింటున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాజా ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

తహవ్వూర్ రాణా జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : ముంబై ఉగ్రవాద దాడి నిందితుడు తహవ్వూర్ హుస్సేన్ రాణా జ్యుడీషియల్ కస్టడీని ఆగస్టు 13 వరకూ ఢిల్లీ కోర్టు పొడిగించింది. గతంలో మంజూరు చేసిన జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాణాను బుధవారం తన ముందు హాజరుపరిచిన తర్వాత ప్రత్యేక న్యాయమూర్తి చందర్ జిత్ సింగ్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 2008 నవంబర్ 26న ముంబైలో 166 మంది మరణానికి కారణమైన ఉగ్రదాడికి ప్రధాన కుట్రదారుడైన డేవిడ్ కోల్మన్ హెడ్లీ అలియాస్ దావూద్ గిలానీకి రాణా అత్యంత సన్నిహితుడు. అతనిని భారతదేశానికి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను ఏప్రిల్ 4న అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీంతో, అతన్ని భారతదేశానికి తీసుకువచ్చారు. రాణాపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) దాఖలు చేసిన అనుబంధ ఛార్జ్ షీట్‌ను ఆగస్టు 13న కోర్టు పరిశీలిస్తుంది. తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడేందుకు అవకాశమివ్వాలని రాణా దాఖలు చేసిన దరఖాస్తును ఈ నెల 15న కోర్టు విచారించనుంది.

అమెరికా కక్షతో క్యూబాకు కష్టం

- ఆర్థిక ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరి
- ఆహార రవాణాకూ జరిమానా
- సహాయానికి ఎన్‌సిఎస్‌సి పిలుపు



ఆందోళన చేస్తున్న క్యూబావాసులు

న్యూఢిల్లీ : కోవిడ్‌లాంటి కష్టకాలంలో తమ దేశంలోని వైద్యులను ప్రపంచ నలుమూలలకూ పంపించి, వైద్యసేవలందించిన క్యూబా అమెరికా ఆంక్షలతో తీవ్రంగా నష్టపోతోంది. ఆర్థికంగా ఉక్కిరిబిక్కిరవుతున్న ఆ దేశానికి సంఘీభావంగా, మద్దతుగా భారతీయులు సహాయమందించాలని నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా (ఎన్‌సిఎస్‌సి) సంస్థ విజ్ఞప్తి చేసింది. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఆహారం, ఔషధాలు, ఇంధనం, రవాణా వంటి ప్రాథమిక అవసరాల కొరతతో పాటు విద్య, వైద్యం, గృహనిర్మాణం వంటి రంగాలు నష్టపోయాయి. క్యూబాతో వాణిజ్యం చేయాలనుకునే కంపెనీలు, దేశాలపై ఒత్తిడితెచ్చి అస్థిరపరిచే విధంగా అమెరికా వ్యవహరిస్తోంది.

ఇటీవలే ఎల్‌ఎల్‌సి అనే లాజిస్టిక్స్ కంపెనీ క్యూబాకు ఆహార పదార్థాలతోపాటు చిన్నపాటి యంత్రాలు, ఎలక్ట్రిక్ వస్తువులను రవాణా చేసినందుకు 6 లక్షల డాలర్ల జరిమానా అమెరికా విధించడం దుర్మార్గం.

ఇతర దేశాలకు కోవిడ్ వైద్య సహాయం

క్యూబా 1962 నుండి అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొంటోంది. ఈ ఆంక్షలు క్యూబాను ఆర్థికంగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వీటివల్ల ఆ దేశ ప్రజలకు రూ.1,29,69,717.04 కోట్ల నష్టం వాటిల్లింది, ఉత్పాదక అడ్డంకులు ఎదుర్కొంటుంది. అయినప్పటికీ, క్యూబా తన ప్రజలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం, క్రీడలు, కళలు, సాంస్కృతిక రంగాలలో అవకాశాలను అందిస్తోంది. క్యూబా తన వైద్యులను, నర్సులను, ప్రకృతి విపత్తులు ఎదుర్కొన్న దేశాలకు పంపింది. కోవిడ్ సమయంలో చాలా పెద్ద దేశాలు టీకాలు, వైద్య సామాగ్రి పంపడానికి నిరాకరించినప్పుడు, ఇటలీ వంటి అభివృద్ధి చెందిన దేశాలుసహా 50కిపైగా దేశాలకు వైద్యులను పంపింది. 90 శాతానికి పైగా సామర్థ్యం ఉన్న తమ టీకాలను అవసరమైన దేశాలతో పంచుకుంది. తద్వారా క్యూబా నిజమైన అంతర్జాతీయత, మానవత్వం, స్నేహం, సంఘీభావం చాటుకుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

క్యూబాకు సంఘీభావం, మద్దతు

ఇటీవల దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో దీర్ఘకాలిక అంతరాయం ఏర్పడింది. ప్రపంచానికి తమ ఔషధాలతో సహాయం చేసిన క్యూబా, ఇప్పుడు ఔషధ ఉత్పత్తికి కావాల్సిన ముడిసరుకు కొరతను ఎదుర్కొంటుంది. ఆహారం, ఇంధనం, ముడిసరుకు లభ్యత లేకుండా పోయింది. మరోవైపు క్యూబాను టెర్రరిజం స్పాన్సర్ చేస్తున్న దేశాల జాబితాలో అన్యాయంగా చేర్చింది అమెరికా.

ఈ దుర్మార్గాన్ని ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు ఖండించాయి. అయినా అమెరికా నిర్బంధాన్ని కొనసాగించడం దుర్మార్గమని పలువురు విమర్శిస్తున్నారు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం ఆత్మ విశ్వాసంతో పోరాడుతున్న సార్వభౌమాధికారం కలిగిన క్యూబాను బలపరచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. క్యూబా భవిష్యత్తు కోసం ఉదారంగా విరాళాలు ఇవ్వాలని "నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా " సంస్థ దాతలను ప్రకటనలో కోరింది. క్యూబా కోసం విరాళాల సేకరణకు భారతీయ కార్మిక సంఘాలు, రైతు, లాయర్, మహిళా, యువజన, విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయి.

బ్రిక్స్‌లో ఉంటే భారత్ పైనా అదనపు సుంకం

- ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్ : బలమైన కూటమిగా బ్రిక్స్ ఎదుగుతుందన్న ఆందోళనలో ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి బ్రిక్స్‌పైన, భారత్‌పైన అక్కసు వెళ్లగక్కారు. బ్రిక్స్‌లో కొనసాగిన పక్షంలో భారత్‌పై కూడా పది శాతం అదనపు సుంకం విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. బ్రిక్స్‌ను స్థాపించిన ఐదు దేశాలలో భారత్ ఒకటి. ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సు అమెరికాపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అమెరికా ఏకపక్షంగా సుంకాలు విధిస్తోందని, సుంకేతర చర్యలు చేపడుతోందని విమర్శించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ 'బ్రిక్స్‌లో ఉంటే భారత్‌పై 10 శాతం అదనపు సుంకాన్ని విధిస్తాం. ఎందుకంటే మమ్మల్ని దెబ్బతీయడానికే బ్రిక్స్ ఏర్పడింది. మా డాలరు విలువను తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. దానిని ప్రామాణికంగా తీసుకోకూడదని అంటోంది. వారు అలా చేయదలచుకుంటే ఓకే. నాకూ ఆట ఆడడం వచ్చు. బ్రిక్స్‌లో ఎవరు ఉన్నప్పటికీ అదనంగా పది శాతం సుంకం చెల్లించాల్సి ఉంటుంది. భారత్ విషయంలోనూ అంతే. ఎలాంటి మినహాయింపులు ఉండవు' అని అన్నారు. భారత్ గురించి, బ్రిక్స్ విడుదల చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రశ్నించగా డాలరును సవాలు చేయాలని అనుకునే దేశాలు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని బెదిరించారు. అయితే అందుకు వారు సిద్ధపడతారని తాను అనుకోవడం లేదని చెప్పారు. వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా మధ్య జరుగుతున్న చర్చలు తుది దశకు చేరుకుంటున్న తరుణంలో ట్రంప్ ఈ బాంబు పేల్చారు.

మోడీకి నమీబియా అత్యున్నత పురస్కారం

- 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఎన్షియంట్ వెల్విట్చియా మిరాబిలిస్' బహూకరణ

విండ్‌హెూక్ : నమీబియాలోని విండ్‌హెూక్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోడీకి అత్యున్నత పురస్కారం లభించింది. నమీబియా అధ్యక్షురాలు నేతుంబో నంది-న్డైట్వాహ్ చేతుల మీదుగా నమీబియా అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్విట్చియా మిరాబిలిస్'ను మోడీకి ప్రదానం చేశారు. భారత్.. నమీబియా దేశాలు పలు కీలక ఒప్పందాలు చేసుకున్నాయి.

మామిడి రైతులను ఆదుకోవడంలో విఫలం

(మొదటిపేజీ తరువాయి)

స్వల్పంగా గాయపడ్డారు. మార్కెట్ యార్డులోకి జగన్ చేరుకొనేసరికి పరిసరాలు గందరగోళంగా మారడంతో ఆయన కొద్దిమంది రైతులతో స్వల్పంగా మాట్లాడారు. అనంతరం మార్కెట్ యార్డులో మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో కిలో మామిడిని రూ.29కు కొన్నామన్నారు. కర్ణాటకలో కిలో రూ.16కు కొనుగోలు చేస్తుంటే, టిడిపి కూటమి ప్రభుత్వం రూ.12కు కూడా కొనడం లేదన్నారు. చిత్తూరు జిల్లాలో రెండు రూపాయల నుంచి నాలుగు రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రైతుల పట్ల కనికరం లేకుండా ప్రభుత్వం మామిడి గుజ్జు పరిశ్రమలకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం అందలేదని, వారి తరపున తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. 'అన్నదాతా సుఖీభవ'లోనూ ఎన్నో మెలికలు పెడుతున్నారన్నారు. తాను వస్తున్నానని అభిమానులు వస్తుంటే పోలీసులు ఓవరాక్షన్ చేస్తూ ఆంక్షలు పెట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పర్యటనలో ఆంక్షలు విధించడంపై ఎస్‌పి మణికంఠతో జగన్ వాగ్వాదానికి దిగారు. కాగా, మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ఈ సమస్యను జగన్ దృష్టికి తీసుకెళ్లడానికి కొంతమంది రైతులు ఆయన వచ్చే దారిలో రోడ్డుపై మామిడి కాయలు పోసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ వెంట ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు ద్వారకనాథరెడ్డి, పూతలపట్టు సమన్వయకర్త సునీల్ కుమార్, జడ్‌పి మాజీ చైర్మన్ కుమార్ రాజా, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపిపి శిరీష్ రెడ్డి ఉన్నారు

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి

బంగారుపాళ్యం మార్కెట్ యార్డులోకి వెళ్లనీయకుండా పోలీసులు ఆంక్షలు విధించడంపై వైసిపి కార్యకర్తలు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మార్కెట్ యార్డులోని మామిడికాయలను తొక్కి ధ్వంసం చేశారు. ఈ ఘటనను చిత్రీకరిస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివపై కొంతమంది దాడి చేయడంతో మరింత గందరగోళం నెలకొంది. ఫొటోగ్రాఫర్‌పై దాడిని పూతలపట్టు ఎంఎల్‌ఎ కలికిరి మురళీమోహన్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు జయరాజ్ ఖండించారు. బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న శివను మురళీమోహన్ పరామర్శించారు.

మాందానీ గెలిస్తే న్యూయార్క్‌ను మేమే పాలిస్తాం : ట్రంప్

వాషింగ్టన్ : సామాన్యులు, పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రకటించి, న్యూయార్క్ ప్రజల మద్దతు పొందుతున్న జోహ్రాన్ మందానిపై మరోసారి ట్రంప్ అక్కసు వెళ్లగక్కారు. ఈ ఏడాది నవంబరులో న్యూయార్క్ మేయర్ పదవికి జరిగే ఎన్నికలలో డెమొక్రటిక్ – సోషలిస్ట్ అభ్యర్థి మాందానీ విజయం సాధిస్తే ఆ నగర పాలనను ఫెడరల్ ప్రభుత్వం తన చేతిలోకి తీసుకుంటుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా హెచ్చరించారు. న్యూయార్క్ సిటీలో, వాషింగ్టన్ డీసీలో స్థానిక నాయకత్వాలు తన ప్రభుత్వ అజెండాకు కట్టుబడి ఉండని పక్షంలో వాటిని ఫెడరల్ ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకుంటుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ రెండు నగరాలూ డెమొక్రాట్ల అధీనంలో ఉన్నాయి. శ్వేతసౌధంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ట్రంప్ ప్రసంగిస్తూ 'న్యూయార్క్ నగరాన్ని పాలించేందుకు ఓ కమ్యూనిస్టు ఎన్నికైతే అది ఎన్నటికీ ఒకేలా ఉండబోదు' అని మాందానీని ఉద్దేశిస్తూ చెప్పారు. అవసరమైనప్పుడు ఆయా ప్రదేశాలను పరిపాలించడానికి శ్వేతసౌధంలో తమకు కావాల్సినంత బలముందని వ్యాఖ్యానించారు. న్యూయార్క్ పదవికి జరగబోతున్న ఎన్నికలలో ప్రత్యర్థులైన ప్రస్తుత మేయర్ ఎరిక్ ఆడమ్స్, మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమో కంటే మాందానీ ముందంజలో ఉన్నారు. దీంతో మాందానీపై ట్రంప్ పదేపదే దాడి చేస్తున్నారు. ఆయన 'ఒక విపత్తు' అంటూ ఆరోపించారు. ఆయన డెమొక్రాట్ల నామినేషన్ పొందారని, వారు ఏ వైపు వెళుతున్నారో ఇది సూచిస్తోందని విమర్శించారు. బిలియనీర్ వ్యాపారవేత్త జాన్ కాట్సిమాటిడిస్‌కు చెందిన కిరాణా దుకాణాలను హస్తగతం చేసుకునేందుకు మాందానీ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. న్యూయార్క్‌ను పాలించే సామర్థ్యం ఆయనకు లేదని ట్రంప్ అన్నారు.

మరింతగా భూ సేకరణ

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైన భూములను సిఆర్‌డిఎ సేకరించడంతో జీవనోపాధికోల్పోయిన 1575 కుటుంబాలను ప్రత్యేక కేసుగా పరిగణిస్తూ పింఛన్ ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి చెప్పారు. కుప్పం విమానాశ్రయానికి వయబిలిటి గ్యాప్ ఫండింగ్ సపోర్టుతోపాటు దగదర్తి, శ్రీకాకుళం, అమరావతి విమానాశ్రయాల అభివృద్ధికి నిధుల కోసం రూ.వెయ్యి కోట్లను హడ్కో నుంచి రుణం తీసుకునేందుకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఎపి బల్క్‌డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు 2001 ఎకరాల బదలాయింపు:

అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో ఎపిఐఐసి ప్రతిపాదించిన బల్క్ డ్రగ్ పార్క్ సరిహద్దును మార్చేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఎఎంఎన్‌ఎస్‌ఐ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కేటాయించిన భూముల తరలింపుకు పరిహారంగా అదనంగా 790 ఎకరాల భూములను సేకరించడంతో పాటు మొత్తం 2001.80 ఎకరాల భూములను ఎపి బల్క్‌డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు బదిలీ చేయాలన్న ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది.

ఇవి కాక..

- రాష్ట్ర ప్రభుత్వం 2025–30 కాలానికి స్పేస్ రంగ అభివృద్ధి కోసం రూపొందించిన ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ
  4.0కు పరిశ్రమలు, వాణిజ్యశాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం.
- ఎపి మార్క్‌ఫెడ్ కు ఇప్పటికే పొందిన రూ.6,700 కోట్ల రుణంతో పాటు వెయ్యి కోట్ల అదనపు రుణాన్ని మంజూరు చేసేందుకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుంచి క్రెడిట్ పొందేందుకు ప్రభుత్వ హామీ పొడిగింపు.
- కోకో రైతులకు మద్దతు ధరగా కిలోకు రూ.50ల చొప్పున రూ.14,884 కోట్లు మంజూరుతోపాటు ప్రస్తుత సీజన్‌లో నిర్దేశించి అమ్ముడు పోని 2976.76 మెట్రిక్ టన్నుల కోకో గింజల టన్నులను ప్రామాణిక ఆపరేటింగ్ విధానంతో సేకరించాలని నిర్ణయం.
- ప్రస్తుత సీజన్‌లో 6.50లక్షల టన్నుల తోతాపూరి మామిడిని సేకరించాలని నిర్ణయం. ఎస్‌ఓపి ప్రకారం కిలోకు రూ.4ల చొప్పున ప్రభుత్వ మద్దతు ధరగా మొత్తం రూ.260కోట్లను మంజూరు.
- అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌కు ప్రభుత్వ కంపెని ఏర్పాటు
  ఎపి షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం –1988లోని సెక్షన్ 23కి సవరణ, 73వ సెక్షన్‌కు సవరణను కలిపి ది ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (అమెండ్‌మెంట్) బిల్లు –2025 .
- ఎపి మోటారు వాహనాల పన్ను చట్టం –1963 ఐదవ షెడ్యూల్‌లోని క్రమసంఖ్య 1,2,3ని సవరిస్తూ ఎపి మోటారు వాహనాల పన్ను (సవరణ) బిల్లు 2025 స్థానంలో ఆర్డినెన్స్.
- రాజధానిలో రెండో విడత భూ సేకరణ విషయం మంత్రి వర్గ ఉపసంఘం ప్రజల్లో అవగాహన కల్పించిన అనంతరం సిఎం తుది నిర్ణయం.

నేడు మెగా పేరెంట్ టీచర్ మీట్

- పుట్టపర్తిలో హాజరుకానున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యాన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పిటిఎం)-2.0 గురువారం జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 61 వేల ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమం జరగనుంది. 74,96,228 మంది విద్యార్థులు, 3,32,770 మంది ఉపాధ్యాయులు, 1,49,92,456 మంది తల్లిదండ్రులు, దాతలు ఈ వేడుకల్లో భాగస్వాములవుతారని విద్యాశాఖ అంచనా వేస్తోంది. ఈ కార్యక్రమం నిర్వహణను గిన్నిస్ రికార్డు సృష్టించాలని విద్యాశాఖ ఆశిస్తుంది. అందుకు తగ్గ ఏర్పాట్లను పూర్తి చేసింది. విద్యార్థుల చదువులకు సంబంధించిన సమగ్ర పురోగతి కార్డులను తల్లిదండ్రులకు అందించనుంది. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు జిల్లా ఉన్నత పాఠశాలలో నిర్వహించే మెగా పిటిఎం కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొంటారు.

పిఐబి విజయవాడ డైరెక్టర్‌గా రత్నాకర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



పిఐబి విజయవాడ కార్యాలయ మీడియా అండ్ కమ్యూనికేషన్ డైరెక్టర్‌గా పి రత్నాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే డిప్యూటీ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఐఐఎస్ అధికారైన రత్నాకర్ ఇప్పటి వరకూ పిఐబి ప్రాంతీయ కార్యాలయంలో డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల క్షేత్రస్థాయి ప్రచార విభాగాలు, వార్తా విభాగాల్లోనూ ఆయన విధులు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిఆర్‌జిఐకి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ సంస్థల, ప్రచార కార్యకలాపాలు, క్షేత్రస్థాయి కార్యకలాపాలు ప్రింట్, మీడియా సంస్థలకు సంబంధించిన వివిధ కార్యకలాపాలను తన కొత్త హోదాలో సమన్వయం చేస్తానని ఆయన తెలిపారు.

కాకినాడ సెజ్‌లో కానరాని పరిశ్రమలు

- నిరుపయోగంగా వేల ఎకరాల భూములు
- 19 ఏళ్లైనా పట్టించుకోని ప్రభుత్వాలు



కాకినాడ సెజ్ ప్రాంతం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ సెజ్ ప్రాంతంలో పరిశ్రమల జాడ కనిపించడం లేదు. పరిశ్రమలు వస్తే తమకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత ఆశలపై ప్రభుత్వాలు ఏళ్ల తరబడి నీళ్లు చల్లుతున్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక్కడ పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయని అంతా ఎదురుచూస్తున్నారు. కానీ, ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను 2003లో ప్రారంభించారు. 2005 డిసెంబర్, 2006 జనవరిలో భూసేకరణకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. కాకినాడ పరిసరాల్లో ఒఎన్‌జిసి ఆధ్వర్యంలో రిఫైనరీ ఏర్పాటుతో సహా పలు ఆయిల్ కంపెనీలు తీసుకొస్తామని అప్పటి ప్రభుత్వం చెప్పుకొచ్చింది. నాడు 2,587.50 ఎకరాల పరిధి మేరకు మాత్రమే కాకినాడ సెజ్‌కు కేంద్రం అనుమతులిచ్చింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం 5,120 ఎకరాలను రైతుల నుంచి బలవంతంగా సేకరించింది. ఈ భూములతో పాటూ పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని యు.కొత్తపల్లి మండలానికి చెందిన వివిధ గ్రామాల పరిధిలో 2,295 ఎకరాలు, తొండంగి మండలంలో మరో 2,398 ఎకరాలకు డిక్లరేషన్ కూడా లేకుండానే భూసేకరణ చేపట్టారు. 19 ఏళ్లు గడుస్తున్నా రెండు మండలాల్లో 4,693 ఎకరాలకు అవార్డులూ ప్రకటించలేదు. వాటితో పాటు ప్రభుత్వ భూములను కూడా కలుపుకుంటే మొత్తం 10,500 ఎకరాల పరిధిలో కాకినాడ సెజ్ ఉంది. వీటిలో 2,180 ఎకరాలను రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామని గత ప్రభుత్వం చెప్పింది. ఆ ప్రక్రియ నేటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వాటిని తీసివేస్తే మిగిలిన 8,320 ఎకరాలూ నిరుపయోగంగా ఉన్నాయి.

పారిశ్రామిక ప్రగతి సాధ్యమేనా..?

19 ఏళ్లు దాటుతున్నా పరిశ్రమలు రాకపోగా భూములన్నీ ఖాళీగానే ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా సెజ్ భూముల్లో పట్టుమని పది ఎకరాల విస్తీర్ణంలోనైనా కార్యకలాపాలు కనిపించడం లేదు. చైనాకు చెందిన పల్స్ ఫ్లష్ అనే సంస్థ బొమ్మల తయారీ యూనిట్ నడుపుతోంది. మరో మూడు ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు మాత్రమే నెలకొల్పారు. కొందరు మహిళలకు మాత్రమే వీటిలో ఉపాధి లభిస్తుంది. రూ.32 కోట్లతో కాకినాడ పెట్రో కారిడార్ పేరుతో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తామని ఎన్నో ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వడం తప్ప పనులు జరిగిన దాఖలాలు లేవు.

టిడిపి కూటమి నేతల హామీలు నెరవేరేనా...?

ఏ ఉద్దేశంతో అయితే రైతుల నుంచి భూములు తీసుకున్నారో ఆ ఉద్దేశం నెరవేరలేదని, సెజ్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గతేడాది నవంబర్ 4న పిఠాపురం పర్యటనలో పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడ సెజ్‌లో పరిశ్రమలు తెచ్చే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు గతేడాది జులై 3న జరిగిన బహిరంగ సభలో సైతం హామీ ఇచ్చారు. భారీ మెజారిటీతో గెలిపించిన తరువాత పిఠాపురం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు పట్టణంలోని ఉప్పాడ బస్టాండ్ సెంటర్లో జరిగిన బహిరంగ సభలోనూ ఆయన సెజ్ గురించి ప్రస్తావించారు. కానీ, ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. డిప్యూటీ సిఎం ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న సెజ్ ప్రాంతంలోనూ ఒక్క పరిశ్రమ కూడా రాకపోవడం, బడ్జెట్‌లో సెజ్ అభివృద్ధికి ఎలాంటి కేటాయింపులూ లేకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. టిడిపి జిల్లా మహానాడులో ఆ పార్టీ సీనియర్ నేత, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కూడా సెజ్ కోసం ప్రస్తావించారు. కాకినాడలో సెజ్‌ను 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారని, నేటికీ పరిశ్రమలు రాకపోవడంతో యువత నిరాసలో ఉన్నారని వ్యాఖ్యానించారు. కాకినాడ సెజ్ రైతులకు అన్యాయం జరుగుతోందని మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు గతేడాది డిసెంబరులో ముఖ్యమంత్రికి స్వయంగా లేఖ రాశారు. అయితే ఎలాంటి కదలికా రాలేదు.

పరిశ్రమల జాడ లేదు

2013 భూ సేకరణ చట్టం ప్రకారం పారిశ్రామిక అవసరాల కోసం సేకరించిన భూములు వినియోగంలోకి రాకపోతే ఐదు నుంచి ఏడేళ్ల తర్వాత వాటిని వెనక్కి ఇచ్చేయాలి. సెజ్ వచ్చి 19 ఏళ్లు అయ్యింది. నేటికీ పరిశ్రమలు రాలేదు. ఇప్పటికే దేశవ్యాప్తంగా దాదాపు 40 సెజ్‌లకు అనుమతులను రద్దు చేశారు. కేంద్రం మూసేస్తామని ప్రకటించిన వాటిలో కాకినాడ సెజ్ కూడా ఉంది. ఇప్పటికైనా పరిశ్రమలను తీసుకురావాలి, లేదా వెంటనే భూములను తిరిగి ఇచ్చేయాలి.

- డి.శేషబాబ్జి, సిపిఎం సీనియర్ నాయకుడు, కాకినాడ జిల్లా

లెనిన్ సెంటర్ విజయవాడ ప్రజల అభీష్టం

- బిజెపి కుత్సిత బుద్ధితో వివాదం చేయడాన్ని నగర ప్రజలు అంగీకరించరు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలో లెనిన్ సెంటర్ ఎవరో నిర్ణయించిన పేరు కాదని, కాలక్రమంలో ప్రజలు నిర్ణయించుకున్న పేరని, దానిని రద్దు చేసే అధికారం ఎవరికీ లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు తెలిపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ చేసిన వ్యాఖ్యలపై తనను కలిసిన మీడియా ప్రతినిధులతో బాబూరావు మాట్లాడారు. బిజెపి అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన రోజునే (బుధవారం) వివాదం సృష్టించి ప్రజల మధ్య విద్వేషాలు రాజేయాలని మాధవ్ ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండించారు. లెనిన్ విగ్రహాన్ని విజయవాడ పౌర కమిటీ ఏర్పాటుచేసిన తరువాత ఆ కేంద్రాన్ని ప్రజలు లెనిన్ సెంటర్‌గా పిలుచుకోవడం ప్రారంభించారని, తరువాత అధికారికంగా రికార్డులకెక్కిందని తెలిపారు. లెనిన్ విదేశీయుడంటూ అరిగిపోయిన రికార్డునే మాధవ్ వేశారని, లెనిన్ అంతర్జాతీయ శ్రామికవర్గ నేత అని, శ్రమను గౌరవించేవారెవరైనా ఆయనను గౌరవిస్తారని పేర్కొన్నారు. ప్రముఖ కవి విశ్వనాథ సత్యనారాయణ పేరుతో విజయవాడ, మాచవరంలో వీధికి నామకరణం చేశారని, ఆయన గ్రంథాలు, భావాలపై ఎన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నా అందరూ గౌరవిస్తారని తెలిపారు. విజయవాడలో అనిబీసెంట్ పేరుతో బీసెంట్ రోడ్ దశాబ్దాల క్రితమే రూపుదిద్దుకుందని, ప్రముఖ ప్రజాస్వామ్య వాది నెల్సన్ మండేలా పేరుతో పార్కు ఉందని వివరించారు. విజయవాడ నగరంలో అనేకమంది ప్రముఖులను పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా గౌరవించుకునే సంప్రదాయం ఉందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, మహోన్నత వ్యక్తులను గౌరవించుకోవడం విజయవాడ సంప్రదాయంగా రూపుదిద్దుకుందని, మాధవ్ రాష్ట్ర అధ్యక్షులుగా ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వివాదాలను సృష్టించే కన్నా ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి తన హోదాను, ప్రభుత్వంలో తన పలుకుబడిని ఉపయోగించడం మంచిదని సూచించారు. ఇప్పటికైనా వివాదాలు కట్టి పెట్టి దశాబ్దాల నుండి ప్రజలు నామకరణం చేసుకున్న లెనిన్ సెంటర్‌ను గౌరవించాలని బాబూరావు కోరారు.

మాధవ్ వ్యాఖ్యలకు సిపిఐ ఖండన

విజయవాడలోని లెనిన్ సెంటర్ పేరు మార్చాలంటూ బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షులు మాధవ్ చేసిన వ్యాఖ్యలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గం ఎక్కడున్నా లెనిన్‌తో సంబంధం ఉంటుందనేది జగమెరిగిన సత్యమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచంలో మొట్టమొదటి కార్మికవర్గ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన శక్తి లెనిన్ అని తెలిపారు. ప్రధాని మోడీ విదేశాలకు వెళ్లి అవార్డులు తీసుకున్నప్పుడు, మోడీ గురించి, ఆయన అవార్డుల గురించి గర్వంగా చెప్పుకోలేదా? అని మాధవ్‌ను ప్రశ్నించారు. మాధవ్ వ్యాఖ్యలు అనాలోచితం, అసంబద్ధం, అజ్ఞానపూరితమైనవని చెప్పారు. మొత్తమ్మీద బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తొలి ప్రయత్నంలోనే 'డక్ అవుట్' అయ్యారని పేర్కొన్నారు.

సింహగిరి ప్రదక్షిణకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - సింహాచలం (విశాఖపట్నం)

ఆషాఢ పౌర్ణమి సందర్భంగా చతుర్దశి నాడు ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన సింహాచలం గిరి ప్రదక్షిణకు బుధవారం యాత్రికులు పోటెత్తారు. ఉదయం నుంచే సింహగిరి తొలి పావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి కొండ చుట్టూ 32 కిలో మీటర్ల మేర కాలినడకన ప్రదక్షిణ మొదలుపెట్టారు. అధికారికంగా మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు స్వామివారి పుష్ప రథాన్ని జెండా ఊపి ప్రారంభించడంతో గిరి ప్రదక్షిణ వేడుక ప్రారంభమైంది. ఆయన వెంట కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఇఒ త్రినాథరావు తదితరులు ఉన్నారు. బుధ, గురువారాల్లో జరగనున్న ఈ గిరి ప్రదక్షిణకు అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. మూడు వేల మందితో పోలీసు బందోబస్తు సమకూర్చింది. ప్రతి ఆరు కిలో మీటర్లకు ఒక బృందం చొప్పున మొత్తం ఆరు అధికార బృందాలను మూడు షిఫ్టుల్లో కలెక్టర్ నియమించారు. యాత్రికుల సౌకర్యార్థం 1800-4250-0009, 0891-2507225 టోల్ ఫ్రీ నెంబర్లను యంత్రాంగం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇటీవల చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందడం, ఇతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కడా ఏ విధమైన లోపం తలెత్తకుండా పలు చర్యలు చేపట్టారు. రెండు రోజులపాటు జరిగే గిరి ప్రదక్షిణకు ఐదు లక్షల మంది హాజరయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ పాఠశాలలు, కల్యాణ మండపాల్లో మొత్తం 14 చోట్ల విశ్రాంతి బస ఏర్పాట్లు చేశారు. కుర్చీలు, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించారు. పుష్ప రథం వెంట యాత్రిక జనం కదులుతున్నారు.



గిరి ప్రదక్షిణలో భారీ సంఖ్యలో పాల్గొన్న యాత్రికులు

తిరువణ్ణామలై ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమ గోదావరి జిల్లా)

నరసాపురం నుండి తిరువణ్ణామలై (అరుణాచలం) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రైలు భవిష్యత్తులో వారానికి మూడుసార్లు నడిపేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు అరుణాచలం వెళ్లడానికి మన రాష్ట్రం నుండి నేరుగా రైలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి రావడంతో తిరువణ్ణామలై ఎక్స్‌ప్రెస్ నడిపేలా రైల్వే అధికారులను ఒప్పించామన్నారు. ఈ రైలు ఉభయగోదావరి జిల్లాలతో పాటుగా కోస్తా జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీనివాసరావు, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ అందే శంకర్, స్టేషన్ మేనేజర్ మధుబాబు, టిడిపి కూటమి నేతలు పాల్గొన్నారు.

పోలవరం పునరావాసం పనులు పూర్తి చేయండి

- ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు ఆదేశం
- పునరావాసంపై అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు


ప్రజాశక్తి-విజయవాడ

పోలవరం నిర్వాసితుల పునరావాసానికి సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అధికారులకు సూచించారు. పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ అధికారులతో విజయవాడలోని తన కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. నిర్వాసితుల సమస్యలతోపాటు ఐటిడిఎ పరిధిలోని గిరిజనులకు అందుతున్న పునరావాస వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ పరిధిలో తన దృష్టికి వచ్చిన అనేక సమస్యలను అధికారులకు తెలిపి, ఆయా సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజనులకు సంబంధించి పునరావాసం, ఉద్యోగ, ఉపాధి కల్పన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 373 గ్రామాలకు పునరావాసం అందించే దిశగా చర్యలు చేపట్టామని అధికారులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. మొత్తం 76 కాలనీలు మంజూరు కాగా, 26 కాలనీలు పూర్తయ్యాయని తెలిపారు. ఉపాధి కల్పనకు సంబంధించి కంప్యూటర్ శిక్షణ, మెకానికల్ వర్క్సతోపాటు కుట్టు పనిలో శిక్షణ అందిస్తున్నామని, 5223 మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. భూములు కోల్పోయిన గిరిజనులకు ప్రత్యామ్నాయంగా భూములు ఇచ్చామని, 18320 మందికి గాను 9249 మందికి పూర్తిస్థాయి నష్టపరిహారం అంజేశామని తెలిపారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ.. పునరావాస కాలనీల్లో తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. గిరిజనుల సహజ జీవన శైలికి అద్దం పట్టేలా పునరావాస చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. పునరావాసానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారంతో నిర్వాసితులకు భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

స్టార్‌లింక్‌కు స్పేస్ ఏజెన్సీ నుంచీ గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ : ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌కు కేంద్రం నుంచి కీలక అనుమతులు లభించాయి. భారత్‌లో కమర్షియల్‌గా శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు ప్రారంభించేందుకు కావాల్సిన అనుమతులను ఇండియన నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్) మంజూరు చేసిందని తెలుస్తోంది. దీంతో 2022 నుంచి కమర్షియల్ లైసెన్స్ పొందేందుకు ఎదురుచూస్తున్న ఈ అమెరికన్ సంస్థకు భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు ప్రారంభించేందుకు మార్గం సుగమం అయ్యింది. టెలికాం శాఖ విభాగం నుంచి గత నెలలోనే స్టార్‌లింక్ అనుమతులు పొందింది. స్టార్‌లింక్‌తో పాటు వన్‌వెబ్, రిలయన్స్ జియోకు ఇప్పటికే ఈ తరహా అనుమతులు లభించాయి. ఇంకా ప్రభుత్వం నుంచి స్పెక్ట్రమ్ పొందడం, బేస్ స్టేషన్ల ఏర్పాటుకు మౌలిక వసతులు సమకూర్చుకోవడంతో పాటు తమ సేవలు సెక్యూరిటీ ప్రోటోకాల్‌కు లోబడి ఉన్నాయని నిరూపించేందుకు ట్రయల్స్ నిర్వహించాల్సి ఉంటుందని తెలుస్తోంది. శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు భారత్‌లో అనుమతి ఇచ్చిన వేళ ఆ సంస్థ ఛార్జీల పట్ల పరిశ్రమలో తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే స్టార్‌లింక్ ఛార్జీలు తడిసిమోపెడు కానున్నాయని తెలుస్తోంది. ఇటీవలే ఆ సంస్థ బంగ్లాదేశ్‌లోనూ తన కార్యకలాపాలను ప్రారంభించింది. ఇందుకోసం డేటా రిసీవర్‌కు సంబంధించిన హార్డ్‌వేర్ ధరను రూ.33,000 నిర్ణయించింది. నెలవారీ ప్లాన్ ప్రారంభ ధరల రూ.3,000గా ఉంది. అదే ధరలను భారత్‌లోనూ వసూలు చేయవచ్చని జాతీయ మీడియాల్లో రిపోర్టులు వస్తోన్నాయి. ప్రస్తుతం దేశంలో బిఎస్ఎన్ఎల్, జియో, భారతీ ఎయిర్‌టెల్ అందిస్తున్న బ్రాడ్‌బాండ్ ధరలతో పోల్చితే స్టార్ లింక్ ధర చాలా భారంగా ఉండనుంది. స్టార్ లింక్ శాటిలైట్ సేవలతో భారత రక్షణకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు అధిక చార్జీలు ప్రజల ఆదాయాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని నిపుణులు భావిస్తున్నారు.



పాణ్యం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

పొగాకు కొనుగోలు చేయించాలి

- ఎమ్మెల్యే గౌరు చరిత ఇంటి ముందు రైతుల ఆందోళన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఇంటి దగ్గర బుధవారం పొగాకు రైతులు ఆందోళనకు దిగారు. తమ వద్ద మిగిలి ఉన్న పొగాకును పూర్తిగా కొనుగోలు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ఎ కృష్ణ, గొందిపర్ల మాజీ సర్పంచి ఆంజనేయులు మాట్లాడుతూ పొగాకు సాగుచేసిన రైతుల దగ్గర కంపెనీలు కొనుగోలు చేయకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రధానంగా కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు, వెల్దుర్తి మండలాల్లో విస్తారంగా పొగాకు సాగు చేశారని చెప్పారు. గతేడాది బాగా రేటు వచ్చిందని, ఈసారి వస్తుందని భావించారన్నారు. కంపెనీలు సిండికేటై రేటును పూర్తిగా తగ్గించి రైతుల దగ్గర మిగిలి ఉన్న పొగాకును పూర్తిగా కొనుగోలు చేయడంలేదన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. చివరి ఆకు వరకు కొంటామని సిఎం చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు ప్రకటనలు చేస్తున్నారు తప్ప, కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రూ.273 కోట్లు విడుదల చేశామని అంటున్నా, ఎవరికిచ్చారో అర్థం కాలేదన్నారు. వారి సమస్యలపై ఎమ్మెల్యే గౌరుచరిత దృష్టికి తీసుకువెళ్లారు. సన్న చిన్నకారు, మధ్యతరగతి రైతుల పట్ల సానుభూతితో కర్నూలు జిల్లాలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి పొగాకు కొనుగోలుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే గౌరుచరిత స్పందిస్తూ తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండలం రైతు సంఘం కార్యదర్శి చంద్రబాబు నాయుడు, శతనాల చాంద్‌బాషా, నన్నూరు, మల్లేశు, దేవమాడ, రామచంద్రుడు, నన్నూరు, మహేష్, లక్ష్మీపురం, వెంకటసుబ్బయ్య, ఉల్చాల ప్రకాస్, కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు, వెల్దుర్తి, మండలాల రైతులు పాల్గొన్నారు.

విశాఖలో రౌడీషీటర్ దారుణ హత్య

ప్రజాశక్తి - మాధవధార (విశాఖపట్నం)



లోహిత్ (ఫైల్)

విశాఖ నగరంలోని మాధవధారలో జరుగుతున్న కుంచుమాంబ అమ్మవారి పండగలో ఓ రౌడీ షీటర్ హత్యకు గురయ్యారు. పాత కక్షల నేపథ్యంలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటన నగరంలో కలకలం రేపింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. పెందుర్తి సమీపానగల సుజాతనగర్‌కు చెందిన మాసపు లోహిత్ (20) అలియాస్ నాని గతంలో మాధవధార సమీపంలోని శీతల గార్డెన్స్‌లో నివాసం ఉండేవారు. మాధవధారలో మంగళవారం జరిగిన కుంచుమాంబ అమ్మవారి పండగకు వచ్చారు. పాత స్నేహితులంతా ఒకేచోట కలుసుకున్నారు. ఉత్సవ వేదిక వెనుక వీరి మధ్య పాత కక్షల నేపథ్యంలో వాగ్వాదం జరిగింది. దీంతో లోహిత్ అక్కడి నుంచి వెళ్లిపోతుండగా వారిలోని ఒక యువకుడు లోహిత్ వెంటపడి అతని మెడ పట్టుకుని కొంత దూరం లాక్కుని వెళ్లారు. కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో లోహిత్‌తోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున లోహిత్ మృతి చెందారు. దాడి చేసిన వారిలో కొందరిని పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. లోహిత్‌పై రౌడీషీట్, దాడి చేసినట్టుగా భావిస్తున్న యువకునిపై సస్పెక్ట్ షీట్ ఉన్నట్టు స్థానిక పోలీసులు చెప్పారు. విశాఖ ఎయిర్ పోర్టు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అనిశ్చితిలోనూ ఎంఎఫ్‌లపై ఆసక్తి

- జూన్‌లో పెరిగిన పెట్టుబడులు

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి, హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ ఈ ఏడాది జూన్‌లో మ్యూచువల్ ఫండ్ ఈక్విటీ పథకాల్లో పెట్టుబడులు 24 శాతం పెరిగాయి. పెట్టుబడిదారులు దీర్ఘకాల లాభాలపై నమ్మకంతో ఈక్విటీ ఫండ్లలో ఎక్కువగా డబ్బు పెట్టారని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (అంఫీ) వెల్లడించింది. గడిచిన జూన్‌లో ఈక్విటీ ఎంఎఫ్‌ల్లో పెట్టుబడులు 24 శాతం పెరిగి రూ.23,587 కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం ఐదు నెలల్లోనూ వరుసగా ఎంఎఫ్‌లు పెట్టుబడులు పడిపోయాయి. మే నెలలో ఇవి రూ.19,013 కోట్లుగా ఉన్నాయి. అంఫీ రిపోర్ట్ ప్రకారం.. గడిచిన జూన్ నెలలో ఫ్లెక్సీ క్యాప్, స్మాల్ క్యాప్ ఫండ్లు అత్యధిక పెట్టుబడులను ఆకర్షించాయి, వీటిలో ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లు రూ.5,733 కోట్లు, స్మాల్ క్యాప్ ఫండ్లు రూ.4,024 కోట్లు చొప్పున సేకరించాయి. మిడ్ క్యాప్ ఫండ్లలో రూ.3,754 కోట్లు పెట్టుబడిగా వచ్చాయి. జూన్ ముగింపు నాటికి మొత్తం ఈక్విటీ ఆస్తులు రూ.33.47 లక్షల కోట్లకు చేరాయి. ఇంతక్రితం మేలో ఈ మొత్తం రూ.32.05 కోట్లుగా ఉంది. జూన్ నెలకు గానూ సిప్ చేసిన ఖాతాల సంఖ్య మే నెలతో పోలిస్తే 8.56 కోట్ల నుంచి 8.64 కోట్లకు పెరిగాయి. సిప్ నిర్వహణలోని ఆస్తుల మొత్తం రూ.15.31 లక్షల కోట్లకు చేరింది. మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ మొత్తం ఆస్తుల విలువలో సిప్ వాటానే 20.2 శాతం కావడం విశేషం. అలాగే మొత్తం సిప్ ఖాతాల సంఖ్య కూడా 9.06 కోట్ల నుంచి 9.19 కోట్లకు పెరిగింది.

సెన్సెక్స్‌కు 176 పాయింట్ల నష్టం

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల నికర లాభాలు పడిపోవచ్చనే అంచనాల్లో మదుపర్లు అమ్మకాలకు దిగారు. దీంతో బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 176.43 పాయింట్లు లేదా 0.21 శాతం నష్టపోయి 83,536కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 46 పాయింట్లు లేదా 0.18 శాతం తగ్గి 25,476 వద్ద ముగిసింది. ముఖ్యంగా రిలయన్స్, ఐసిఐసిఐ బ్యాంక్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడిని పెంచాయి. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, రిలయన్స్, బిఇఎల్ షేర్లు అధిక నష్టాలను చవి చూశాయి. బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

బంధన్ ఎంఎఫ్ నుంచి 'మల్టీ ఫ్యాక్టర్ ఫండ్' విడుదల

న్యూఢిల్లీ : బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా 'బంధన్ మల్టీ-ఫ్యాక్టర్ ఫండ్'ను ప్రారంభించింది. ఇది ఒక ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్, వాల్యూ, క్వాలిటీ, తక్కువ అస్థిరత వంటి బహుళ కారకాల ఆధారంగా పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్ దీర్ఘకాలిక సంపద సృష్టిని లక్ష్యంగా చేసుకుంది. 50-65 లార్జ్, మిడ్-క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడి పెడుతుంది. ఈ కొత్త ఫండ్ జులై 10 నుండి 24 వరకు అందుబాటులో ఉంటుందని ఆ సంస్థ వెల్లడించింది. ఇందులో కనీస పెట్టుబడిగా రూ.1,000గా నిర్ణయించింది.

ఎంజి మోటార్ తొలి 'సెలెక్ట్' ఎక్స్‌పీరియన్స్ సెంటర్

ముంబయి : జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ 'ఎంజి సెలెక్ట్'ను థానెలో ఏర్పాటు చేసింది. దీనిని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ మెహ్రోత్రా లాంచనంగా ప్రారంభించారు. ఈ డీలర్‌షిప్ కస్టమర్లకు ప్రీమియం కార్ల శ్రేణిని అందించడంతో పాటు అత్యాధునిక సేవలు, కస్టమైజ్డ్ ఆటోమొబైల్ అనుభవాన్ని అందించనుందని ఆ సంస్థ పేర్కొంది.

జగన్ జనంలోకి వస్తే టిడిపి కూటమి నేతలకు వణుకు

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనంలోకి వస్తున్నారంటే టిడిపి కూటమి నేతలకు వణుకుపుడుతోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ ఎక్కడ పర్యటించినా ప్రభుత్వం అడుగడునా ఆంక్షలు విధిస్తోందన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లో పోలీసులు ఓవర్ యాక్షన్ చేస్తున్నారని ఆరోపించారు. వేలాది మందికి నోటీసులు, ముందస్తు అరెస్టులతో జగన్ పర్యటనను ప్రభుత్వమే వివాదం చేస్తోందన్నారు. జగన్ పర్యటనకు వెళితే రౌడీషీట్లు ఓపెన్ చేస్తానని చిత్తూరు ఎస్‌పి మణికంఠ చేసిన హెచ్చరికలను ఆయన తప్పుపట్టారు. గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న మామిడి రైతులను పరామర్శించేందుకు వెళితే పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. జగన్ కోసం జనం వస్తున్నారని తెలిపారు. స్వచ్ఛందంగా వస్తున్న ప్రజలను అడ్డుకోవాలనుకోవడం టిడిపి కూటమి ప్రభుత్వానికి జగన్ పర్యటనలపై ఉన్న భయాన్ని తెలియజేస్తోందన్నారు. జగన్‌కు ఉన్న ప్రజాదరణ చూసి కూటమి నేతల వెన్నులో వణుకుపడుతోందని తెలిపారు. ఏడాదికే జగన్‌కు జనాదరణ ఇలా ఉంటే.. రెండేళ్ల తరువాత ప్రజలు పోలీసులను కూడా లెక్కచేయని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మామిడి రైతుల పరామర్శకు వస్తున్న జగన్‌ను కలిసేందుకు వస్తున్న రైతులపై ప్రభుత్వం అడుగడునా ఆంక్షలు విధించిందని తెలిపారు. ప్రజలను మార్కెట్ యార్డుకు వెళ్లకుండా, హెలిప్యాడ్ దగ్గరకు పోనీయకుండా నిర్బంధం అమలు చేశారన్నారు. బంగారుపాళ్యంలో 116 దుకాణాలకు నోటీసులు జారీ చేశారని తెలిపారు.

ఆ 8 మంది మరణించారు

- అధికారిక ప్రకటన విడుదల
- ప్రమాదంలో కాలిబూడిదైనట్టు నిర్ధారణ
- ప్రభుత్వానికి నివేదించిన అధికారులు
- 52కు చేరిన సిగాచి మృతులు
- పరిశ్రమ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాశమైలారం మృత్యు సిగాచి పరిశ్రమ మిగిల్చిన విషాదం అంతా ఇంతా కాదు. పేలుళ్ల ధాటికి కొందరు తునాతునకలవ్వగా, ఇంకొందరు శరీరాలు తెగిపడి మొండాలయ్యాయి. చెయ్యెత్తు మనుషులు చిన్న పెట్టేలో పట్టే మాంసం ముద్దలయ్యారు. పూర్తిగా కాలిపోయి బొగ్గయ్యారు. 44 మంది శరీర అవశేషాలను గుర్తించడంతో వారి బంధువులు అశ్రునయాలతో కనీసం అంత్యక్రియలైనా చేసుకునే వీలు ఏర్పడింది. కానీ, ఆచూకీ లభించని మరో ఎనిమిది మంది మంటల్లో మాడి మసైనట్టు చెబుతున్నారు. బూడిద కూడా లభించకపోవడంతో కన్నవాళ్లు, కట్టుకున్నవాళ్లు కన్నీటి పర్యంతరంగా విలపిస్తున్నారు. ఆచూకీ లభించని వాళ్లంతా చనిపోయి ఉంటారంటూ, మంటల్లో బూడిదైనందునే శరీర అవశేషాలేవీ లభించలేదంటూ అధికారులు నిర్ధారించారు. అచూకీ లభించని వారిలో రాహుల్‌కుమార్ శర్మ (ఉత్తరప్రదేశ్), జి.వెంకటేశ్ (ఆంధ్రప్రదేశ్), సిల్వేరు రవి (తెలంగాణ), శివాజీకుమార్ (బీహార్), విజయ్‌కుమార్ నిషాద్, అఖిలేష్‌కుమార్ (యుపి), ఇర్ఫాని అన్సర్ (జార్ఖండ్), జస్టిన్ (తెలంగాణ) ఉన్నారు. సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగి పది రోజులు దాటింది. శిథిలాల తొలగింపు పూర్తయినా ఈ ఎనిమిదికి సంబంధించిన శరీర అవశేషాలేవీ లభించకపోవడంతో వీరంతా ప్రమాదంలో భారీగా ఎగసిపడిన మంటల్లో కాలి బూడిదై ఉంటారని అధికారులు భావిస్తున్నారు. 40 మంది కార్మికుల మృతదేహాల అవశేషాలు శిథిలాల కింద లభ్యమయ్యాయి. వాటిని డిఎన్ఎ పరీక్షలు నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మరో నలుగురు మంటల్లో తీవ్రంగా కాలిపోయి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించడంతో వారి మృతదేహాలను బంధువులకు అప్పజెప్పారు. చివరి వరకూ మరో ఎనిమిది మంది ఆచూకీ లభించకపోవడంతో వారి బంధువులు పది రోజులుగా కంపెనీ వద్దే పడిగాపులు కాస్తున్నారు. హెల్ప్‌లైన్ సెంటర్ వద్ద ఏదైనా సమాచారం చెబుతారనే ఆశతో ఎదురు చూశారు. శిథిలాల కింద సేకరించిన వందకుపైగా నమూనాలను ఫోరెన్సిక్ లాబొరేటరీకి పంపగా, ఆ ఎనిమిదిమంది కుటుంబసభ్యుల డిఎన్ఎతో సరిపోలలేదు. దీంతో, వారంతా ఈ ఘటనలో పూర్తిగా కాలి బూడిదైనట్టుగా అధికారులు నిర్ధారించారు. ఈ విషయాన్ని వారి బంధువులకు సమాచారమిచ్చారు. వారి అంత్యక్రియల కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అధికారులు సమాచారమివ్వడంతో ఆశలు వదులుకోవాల్సి వచ్చింది.


ప్రమాదం జరిగిన ప్రాంతం

మృతుల కుటుంబాలకు రూ.కోటీ చొప్పున నష్టపరిహారమివ్వాలి : సిఐటియు

సిగాచి పరిశ్రమ ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఆచూకీ లభించని కార్మికుల కుటుంబాలకు కేవలం రూ.15 లక్షలిచ్చి చేతులు దులిపేసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటి వరకు 44 మంది మృతి చెందారని, ప్రమాదం జరిగి పది రోజులైనా ఇంకా ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ దొరకలేదని అధికారులు చెప్పడం సరైంది కాదన్నారు. అత్యాధునిక టెక్నాలజీ ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్లనే వీరి ఆచూకీ లభించకుండా పోయిందన్నారు. ఆచూకీ లేని వాళ్లు కూడా చనిపోయినట్టు చెబుతున్నందున సిగాచి మృతుల సంఖ్య 52కు చేరుతుందని, వారందరి కుటుంబాలకూ కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు మూడు స్థాయిలో వేసిన కమిటీలు విచారణ జరిపినప్పటికీ తుది నివేదిక ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. వెంటనే సిగాచి పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని, ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నేడు బీహార్ ఓటర్ల జాబితా సవరణపై సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : ప్రతిపక్షాల ఆందోళనల నేపథ్యంలో బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై జస్టిస్ దులియా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ జరపనుంది. ఇసి చేపట్టిన ఈ డ్రైవ్‌ను నిలిపివేయాలంటూ, కొనసాగించాలంటూ వేసిన 10 వేర్వేరు పిటిషన్లపై ధర్మాసనం విచారించనుంది.

రాజస్థాన్‌లో కూలిన యుద్ధ విమానం..

- ఇద్దరు పైలట్లు మృతి

జైపూర్ : రాజస్థాన్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన యుద్ధవిమానం కుప్పకూలడంతో ఇద్దరు పైలెట్లు మృతి చెందారు. బుధవారం చురు జిల్లా రతన్‌గఢ్ ప్రాంతంలోని భానుడా గ్రామ సమీపంలో విమానం కూలిపోయింది. విమానం కూలినప్పుడు పెద్ద శబ్దం వచ్చిందని, భారీగా పొగ, మంటలు ఎగిసిపడ్డాయని స్థానికులు తెలిపారు. భారత వైమానిక దళానికి చెందిన జాగ్వార్ యుద్ధ విమానం కూలిపోయినట్లు జాతీయ మీడియా పేర్కొంది.



జనసంద్రంగా స్వర్ణాల చెరువు

- నేటితో ముగియనున్న రొట్టెల పండుగ

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నేటితో రొట్టెల పండుగ ముగియనుండడంతో నగరంలోని యాత్రికులతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులతో స్వర్ణాల చెరువు జనసంద్రమైంది. రాష్ట్ర మాదిగ సంక్షేమ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి బుధవారం దర్గాను సందర్శించారు. తొలుత దర్గాకు వెళ్లి స్వర్ణాల చెరువులో ఆరోగ్య రొట్టె తీసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన యాత్రికులతో బారా షాహీద్ దర్గా కిక్కిరిసిపోయింది. చదువు, ఉద్యోగం, ఆరోగ్యం, గృహం, విదేశీయానం, ఇలా అనేక రకాల రొట్టెలను వదిలారు. దుబాయ్, ఆఫ్ఘనిస్తాన్‌తోపాటు కర్ణాటక, తమిళనాడు, ఎపి, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు తరలివచ్చారు. స్వర్ణాల చెరువులో స్నానం చేసి తమకు అవసరమైన రొట్టెలు పట్టుకున్నారు. తొలిసారిగా ఇద్దరు మహిళా పోలీసు ఉన్నతాధికారులు దగ్గరుండి బందోబస్తు నిర్వహించారు.

ప్రసన్నకుమార్‌రెడ్డిపై కేసు నమోదు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కోవూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. క్రైం నెంబర్ 210-2025 అండర్ సెక్షన్ 74,78,79,296 కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రోత్సాహంతో కోడూరు కమలాకర్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్, కళ్యాణ్‌రెడ్డి తదితరలు ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేశారని పట్టణంలోని నాల్గవ పోలీసు స్టేషన్‌లో జెడిపిటిసి సభ్యులు శ్రీలత ఫిర్యాదు చేశారు. ఎంపి, ఎమ్మెల్యేలతో పాటు, ముఖ్యనాయకులు పేర్లు ఉండడంతో కేసు నమోదు చేసి విషయంలో పోలీసులు తర్జన భర్జన పడుతున్నట్లు తెలిసింది.

ఆగని ఇజ్రాయిల్ దాడులు

- వందకు పైగా పాలస్తీనియన్ల మృతి
- కాల్పుల విరమణ చర్చల్లో కానరాని పురోగతి

గాజా : పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడులు చేస్తోంది. ఆహారం కోసం సహాయ శిబిరాల వద్ద బారులు తీరిన ప్రజలపై సైతం అమానుషంగా విరుచుకుపడుతోంది. గత 24 గంటల కాలంలో ఇజ్రాయిల్ జరిపిన దాడులలో 105 మంది పాలస్తీనియన్లు మరణించారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలావుండగా కాల్పుల విరమణపై చర్చించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూతో రెండోసారి సమావేశమయ్యారు. అయితే ఈ చర్చలలో పురోగతి కన్పించలేదని సమాచారం. దక్షిణ లెబనాన్‌లోని హెజ్బులా మౌలిక సదుపాయాల స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేశానని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. జబాల్ బ్లాట్‌లో ఆయుధ డిపోలు ఉన్న ఓ ప్రాంగణాన్ని తమ దళాలు నాశనం చేశాయని చెప్పింది. లాబోహన్స్ ప్రాంతంలో హెజ్బులా ఆయుధ స్థావరాన్ని గుర్తించామని కూడా పేర్కొంది. అయితే దీనిపై హెజ్బులా నుండి ఎలాంటి స్పందన రాలేదు. కాగా అమెరికా, ఇజ్రాయిల్ మద్దతుతో నడుస్తున్న వివాదాస్పద సహాయ కేంద్రాల వద్ద జరిగిన దాడులలో ఇప్పటి వరకూ మరణించిన వారి సంఖ్య 770కి చేరింది. సెంట్రల్ గాజాలో ఆహార పంపిణీ కేంద్రాన్ని మూసివేయడంతో వేలాది మంది పాలస్తీనీయులు దక్షిణ ప్రాంతం వైపు తరలిపోతున్నారు. ఉత్తర గాజాలోని ఆస్పత్రులను విద్యుత్ కొరత వేధిస్తోంది. ఫలితంగా వందలాది మంది చనిపోయే ప్రమాదం ఉన్నదని ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. రఫా నగరంలోని ఓ సహాయ కేంద్రంపై ఇజ్రాయిల్ దళాలు జరిపిన కాల్పులలో చనిపోయిన వారి సంఖ్య ఎనిమిదికి చేరింది. అమెరికా, ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆహార పంపిణీ కేంద్రాల వద్ద గందరగోళం నెలకొంటోంది. ఆహార పదార్థాలను ఎప్పుడు పంపిణీ చేస్తారో ఎవరూ చెప్పడం లేదు. దీంతో ప్రజలు తెల్లవారుజాము నుండే అక్కడ పెద్ద ఎత్తున గుమిగూడుతున్నారు. సాయం కోసం ఎదురు చూస్తున్న అన్నార్తులపై కూడా ఇజ్రాయిల్ దాడులు సాగిస్తోంది. ఇదిలావుండగా ఇంధన కొరతతో విలవిలలాడుతున్న గాజా ఆస్పత్రులకు వెంటనే సరఫరాలు ప్రారంభించాలని, లేని పక్షంలో వాటిని మూసివేయక తప్పదని ఐరాస మానవ హక్కుల కార్యాలయం ప్రతినిధి ఆందోళన వ్యక్తం చేశారు.


ఇజ్రాయిల్ దాడిలో ధ్వంసమైన భవనం


తహశీల్దార్‌తో మాట్లాడుతున్న తల్లిదండ్రులు

మా పాఠశాల మాకు కావాలి

- ఎల్ఇ స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రుల రాస్తారోకో

ప్రజాశక్తి - పెనుమంట్ర (పశ్చిమగోదావరి జిల్లా)

మా స్కూల్ మాకు కావాలి అంటూ పెనుమంట్ర ఎల్ఇ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర ప్రధాన రహదారిపై బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రాస్తారోకో చేశారు. వీరి పోరాటానికి కార్మిక చట్టాల రద్దు కోరుతూ అటువైపుగా ప్రదర్శనతో వెళ్తున్న సిఐటియు, తదితర సంఘాల నేతలు మద్దతుగా నిలిచి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెల రోజులకుపైగా విలీనం చేసిన పాఠశాలకు వెళ్లకుండా పాత ఎల్ఇ పాఠశాలలోనే ఉండిపోయిన 3, 4, 5 తరగతుల విద్యార్థులు 27 మందికి హాజరు వేయకుండా, భోజనం పెట్టకుండా విద్యాశాఖ ఇబ్బంది పెడుతోందని తల్లిండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ వై.రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపిపి కర్రి వెంకట నారాయణ రెడ్డి, సర్పంచి తాడిపర్తి ప్రసన్న, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు వీర్రెడ్డి పాల్గొన్నారు.

జీవన సౌరభం

అజ్ఞానాన్ని తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం.

మీ కోసం

నల్ల జీలకర్రను వస్త్రంలో చుట్టి నలుపుతూ వాసన చూస్తూ ఉంటే ముక్కు దిబ్బడ తగ్గుతుంది.



దొంగ దొరికాడు



విల్లు పురంబను చక్కని రాజ్యము
విశ్వనాథుడు ఆ దేశపు రాజు
పరిపాలన ఎరిగిన వాడు
ప్రజల బాధలు తెలిసినవాడు

ప్రజలకోసమే మేమంటూ
పథకాలెన్నో ప్రవేశ పెట్టెను
అవసరాలను కనుగొంటూ
తగు సహకారము అందించెను

రాజు మంచిగా వున్నను గాని
దొంగతనములు జరుగుచుండెను
కోటలో కూడా దొంగలు చేరిరి
సొమ్మును తెలివిగ అపహరించిరి

ఎంత కాపలా పెట్టిన గానీ
దొంగతనము ఆగదాయెను
రోజు రోజుకు ధనాగారము
తగ్గిపోవడం బాధాకరము

మహారాజు విసిగెత్తి పోయెను
దొంగను పడితే బహుమతి అనెను
రాజధానికో కమ్మరి వచ్చెను
దొంగలను పట్టు యంత్రము తెచ్చెను

"చూడండి, రాజా ఈ యంత్రము
మహిమాన్వితము దీని పనితనం
ధనాగారమున దగ్గర నుంచిన
దొంగల పేర్లను వెల్లడించును

యంత్రముకున్న ఈ మీట నొక్కిన
దీని పనితనం ఆగిపోవును"
అని వెల్లడించి యంత్రమును
ఖాజానాకు దగ్గరగా నిలిపెను

అర్ధరాత్రి దాటిందనగానే
ముసుగు మనిషి ఒకడొచ్చెను
అటునిటు చూసి ఎవ్వరు లేరని
యంత్రము కున్న మీట నొక్కెను

ఒక్కసారిగా దీపములన్నీ
కాంతివంతముగా వెలిగెను.
వెనుతిరిగిన ఆ ముసుగు వాడు
అడ్డముగా దొరికి పోయెను

మనతో పాటు వున్న దొంగను
పట్టుట ఎవరికి సాధ్యము
మన అధికారే దొంగైతే
అనుమానించుట అసాధ్యము

క్షమించండి మహారాజా
ఇది పెద్ద యంత్రము కాదు
మీటను ఆపిన దీపాలు వెలుగు
నటుల దీనిని తయారు చేసితి

దొంగ తప్పక మీటను నొక్కును
అందరిలో దొరికి పోవును
అను నా ఊహ నిజమే ఆయెను
ఇతడే దొంగని తెలిసి పోయెను

తన అధికారే దొంగని తెలిసి
రాజు మిక్కిలి బాధ పడెను.
కమ్మరిని ఘనంగ సత్కరించెను
దొంగకు తగిన శిక్ష విధించెను!

– కూచిమంచి నాగేంద్ర,
91821 27880


ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని పదాలు ఇచ్చాం. వాటిలో కొన్ని అక్షరాలు తప్పిపోయాయి. క్లూ ఆధారంగా అవేంటో మీరు రాయండి.

అ, ర, శ, ఫ, ఠ, భ, ఖ, ల, ఢ

-జతం	ర-స
కం-ం	-తకం
-రక	స-లం
ఆ-రణం	శం-ం
ప-క	-మరుకం

నేను గీసిన బొమ్మ





పూజిత,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
హవేలి ఘణపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వర్షాకాలంలో పిల్లల ఆరోగ్య సంరక్షణ



వర్షాకాలం పిల్లలకు చాలా ఇష్టం. అయితే ఈ వాతావరణం పిల్లలు ఆరోగ్యాన్ని త్వరగా దెబ్బ తీస్తుంది. తరచూ జ్వరం, జలుబు, దగ్గు వంటి వాటి బారిన పడే అవకాశం ఉంటుంది. అనారోగ్యం రాకుండా ముందుగానే పిల్లలకు కొన్ని జాగ్రత్తలు చెప్పి సిద్ధం చేస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు.

- జంక్ ఫుడ్ జోలికి పోకుండా సమతుల్య ఆహారం తినిపించాలి. ఎక్కువగా ఫ్రై చేసిన ఆహారం, రోడ్డు పక్కన చిరుతిళ్లు, ఫాస్ట్ ఫుడ్, సరిగ్గా ఉడకని లేదా పచ్చిగా ఉన్న ఆహారం తినిపించకూడదు.
- కాచి చల్లార్చిన వేడి నీళ్లను తాగించాలి. స్కూల్‌కి వెళ్లేటపుడు కూడా అవే నీళ్లను బాటిల్‌లో పోసి ఇవ్వాలి.
- వాళ్ల వయసు ప్రకారం వాళ్లకు వేయించాల్సిన వ్యాక్సినేషన్లు పూర్తిచేయాలి. ఇంట్లో, ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచాలి. దోమలు పెరగకుండా జాగ్రత్తపడాలి. వాటివల్ల మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- తడిగా ఉండే బట్టలు, షూలు వేయకూడదు. వాటి వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది.
- భోజనానికి ముందు తప్పకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేయాలి. త్వరగా ఆరిపోయే బట్టలు వేయాలి.
- బయట ఆడుకునే వీలు లేకపోతే, శారీరక వ్యాయామం కోసం ఇంట్లోనే స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్ లాంటి ఆటలు ఆడేలా ప్రోత్సహించాలి.
- బట్టలు వేసేముందు టాల్కమ్ పౌడర్ రాయాలి. షూలకు, పాదాలకు యాంటీ ఫంగల్ పౌడర్ రాస్తే మంచిది.
- రెయిన్ కోట్లు, గొడుగులు, నీళ్ల నుంచి రక్షించే గమ్ బూట్స్ సిద్ధం చేసుకోవాలి.
- తులసి, దాల్చిన చెక్క, నిమ్మకాయ, అల్లం వంటి వాటిని పిల్లల ఆహారంలో చేర్చాలి. వీటిలో ఉండే పోషకాలు రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటూ జ్వరాలు రాకుండా కాపాడతాయి.
- పిల్లల్లో ఎలర్జీ సమస్య ఉంటే కార్పెట్లు, కర్టెన్లు లాంటివి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. ఎప్పటికప్పుడు ఇంటిని శుభ్రం చేస్తూ ఉండాలి.
- ఈ కాలంలో మురికి నీళ్లలో ఆడుకుంటే జరిగే నష్టాలు పదే పదే పిల్లలకి చెప్పాలి. అప్పుడే వాటికి దూరంగా ఉంటారు.
- పొడవాటి చేతులున్న షర్టులు, ప్యాంట్లు వేయాలి. దోమల నుంచి ఇవి రక్షిస్తాయి. అవసరమైతే ఇంట్లో దోమతెర వాడాలి. బయట నుంచి ఇంటికి రాగానే చేతులు కడుక్కోవడం అలవాటు చేయాలి.

మొక్కజొన్నతో ఆరోగ్యం



వాతావరణం చల్లగా ఉన్నప్పుడు వేడి వేడిగా ఏమైనా తినాలనిపిస్తుంది. బయట ఫుడ్ కన్నా ఇంట్లో చేసుకునే ఆహారానికి మొదట ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే నూనెతో చేసిన పదార్థాల కన్నా మొక్కజొన్న పొత్తు చాలా బెటర్. ఈ సమయంలో మొక్కజొన్న విరివిగా, అతి చౌకగా లభించే ఆహారం. దీని గింజలను పచ్చిగా కాని, కాల్చుకొని లేదా ఉడకబెట్టుకొని తినొచ్చు. ఇది చాలా బలమైన ఆహార పదార్థం. ఇవి ఈ సీజన్‌లో తినడం వల్ల ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

- మొక్కజొన్నలో లినోలిక్ ఆసిడ్, విటమిన్ ఇ, బి1, బి6, నియాసిన్, ఫోలిక్ ఆసిడ్, రైబోఫ్లోవిన్ అనే విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. పీచు పుష్కలంగా ఉంటుంది. అది జీర్ణక్రియకు బాగా పనిచేస్తుంది. ఆహారంలో పీచు ఉంటే అది మలబద్ధకం, మొలలు వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుంది. పేగు కేన్సర్ అరికడుతుంది.
- ఎముకల బలానికి అవసరమైన లవణాలు, మినరల్స్ మొక్కజొన్నలో పుష్కలంగా ఉంటాయి. పసుపు రంగులో ఉండే ఈ చిన్న గింజలలో మినరల్స్ అధికంగా ఉంటాయి. మెగ్నీషియం, ఐరన్, కాపర్, ఫాస్ఫరస్ వంటివి కూడా వీటిలో ఉండి ఎముకలు గట్టిపడేలా చేస్తాయి. కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచటంలో ఇవి ఎంతగానో సహాయ పడతాయి.
- మొక్కజొన్నలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా ఉంచుతాయి. మొక్కజొన్న గింజల నూనెను చర్మానికి రాస్తే దీనిలో ఉండే లినోలె యాసిడ్ చర్మ మంటలను, ర్యాష్‌లను తగ్గిస్తుంది.
- మొక్కజొన్నలో ఫోలిక్ యాసిడ్ ఉండటం వలన అది రక్తహీనతను తగ్గిస్తుంది. మొక్కజొన్నను ప్రతిరోజు తినడం వల్ల జుట్టు మొదళ్లకు బలాన్ని చేకూరుస్తుంది. జుట్టు రాలిపోదు. ఇందులో ఉండే విటమిన్ సి పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్ లైకోపిన్ వల్ల జుట్టు మెత్తగా, మృదువుగా మారుతుంది.

పాదాల ఆరోగ్యం పదిలం

వర్షాకాలంలో సాధారణంగా తడి కారణంగా షూల నుంచి దుర్వాసన వస్తుంటుంది. షూల అపరిశుభ్రతతో పాటు పాదాల నుంచి వచ్చే దుర్గంధం కూడా దీనికి కారణం కావొచ్చు. ఇంట్లో వుండే వస్తువులతోనే ఈ చెడు వాసనను నియంత్రించవచ్చు.


పాదాల శుభ్రత ఇలా : వెడల్పాటి బకెట్లో సగం వరకు నీటిని తీసుకోవాలి. ఆ నీటిలో బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. తర్వాత ఆ నీటిలో పాదాలను పది నిమిషాల పాటు ఉంచాలి. తర్వాత కాళ్లను బయటకు తీసి కాటన్ గుడ్డతో అరికాళ్లు, కాలి వేళ్లను బాగా తుడవాలి. ఇలా రోజూ చేస్తే పాదాల వాసన క్రమంగా తగ్గుతుంది.

- ఒక బకెట్‌లో పాదాలు మునిగేంత వరకు గోరువెచ్చని నీటిని పోసి, ఒక టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా, అదే మొత్తంలో నిమ్మరసం వేసి బాగా కలపాలి. తర్వాత ఈ నీటిలో పాదాలను 10 నిమిషాల పాటు ఉంచాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే సమస్య తగ్గుతుంది.
- ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో ఒక కప్పు ఎప్సమ్ సాల్ట్ మిక్స్ చేసి అందులో పాదాలను ఉంచాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయాలి.
- ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో అరకప్పు వెనిగర్ వేసి పాదాలను 15 నిమిషాల పాటు ఉంచాలి. ఇలా వారానికి 2–3 సార్లు చేస్తే ఉపయోగకరం.
- రోజూ సాక్స్ మార్చాలి. ఉతక్కుండా పదే పదే ఉపయోగించొద్దు. అలాగే సాక్స్ తడిగా ఉన్నా ఉపయోగించకూడదు.

షూల శుభ్రత ఇలా : రసం పిండేసిన నిమ్మకాయ, నారింజ తొక్కలను రాత్రంతా బూట్లలో వేసి ఉంచితే వాటి నుంచి వచ్చే దుర్వాసన తొలగిపోతుంది.

- తడిసిన బూట్లలో కొంచెం బేకింగ్ సోడా వేసి రాత్రి అంతా అలా ఉంచేయాలి. ఉదయానికి బూట్లు పొడిగా, దుర్వాసన రహితంగా ఉంటాయి.
- బూట్ల లోపలి భాగంలో టాల్కమ్ పౌడర్ చల్లి రాత్రంతా ఉంచితే ఇది బూట్లలోని తడిని గ్రహించి, చెడు వాసనను అరికడుతుంది.





'విడి-14'లో ఆఫర్ ప్రకటన


విజయ్ దేవరకొండ ప్రస్తుతం నటిస్తున్న సినిమాల్లో 'విడి-14' ఒకటి. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించబోతుంది. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాయల సీమ నేపథ్యంలో 1854 –1878 మధ్య కాలంలో జరిగే ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం రూపొందనుంది. దీంట్లో విజయ్ ఓ యోధుడి పాత్రలో కనిపించనున్నట్లు చిత్ర వర్గాలు ప్రకటించాయి. ఈ సినిమాలో రష్మిక కథా నాయికగా నటించబోతున్నట్లు సమాచారం. తాజాగా ఈ మూవీ టీమ్ బేబీ గర్ల్ తల్లులకు ఓ బంపర్ ఆఫర్ ఇచ్చింది. సినిమాలో పాల్గొనే చాన్స్ ఉందని తెలుపుతూ ఓ ఇంట్రెస్టింగ్ ట్వీట్ చేసింది. 'మేము ఒక చిన్న బేబీ గర్ల్ కోసం ఎదురు చూస్తున్నాము. అయితే ఆ పాప ఏజ్ 4 నుంచి 5 సంవత్సరాల మధ్యలో ఉండాలి. హైట్ వచ్చేసి 3 ఫీట్ 2 ఇంచెస్‌కి తక్కువగా ఉండాలి. ఇక స్కిన్ కలర్ డస్కీ అండ్ డార్క్‌గా పాప సన్నగా ఉండాలి' అని చెప్పారు. ఇంట్రెస్ట్ ఉన్నవాళ్లు తమ పాపల ఫొటోస్‌ను ఈ నెంబర్‌కి పంపండి అని నెంబర్ పెట్టారు.

11న 'మై బేబి' తెలుగులో విడుదల



తమిళంలో ఇటీవల విడుదలై విజయ వంతంగా ప్రదర్శిత మవుతున్న డిఎన్ఎ సినిమాను ఎస్‌కె పిక్చర్స్ ద్వారా నిర్మాత సురేష్ కొండేటి తెలుగులో 'మై బేబి' పేరుతో ఈనెల 11న విడుదల చేయబోతున్నారు. గతంలో 'ప్రేమిస్తే', 'జర్నీ', 'షాపింగ్‌మాల్', 'పిజ్జా' వంటి విజయవంతమైన 15 చిత్రాలను నిర్మాతగా విడుదల చేసిన సురేష్ కొండేటి డిస్ట్రిబ్యూటర్‌గా 85 పైగా చిత్రాలను కూడా విడుదల చేశారు. ఇప్పుడు నిర్మాతగా 16వ చిత్రంగా 'మై బేబీ'ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సిద్ధమయ్యారు. 'నెల్సన్ వెంకటేసన్ దర్శకత్వంలో తమిళంలో ఇటీవలే విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అధర్వ మురళి, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్, భావోద్వేగ డ్రామాతో కూడిన గ్రిప్పింగ్ కథాంశంతో ఆకట్టుకుంది.

'బ్యాడాస్' సినిమా పోస్టర్ రిలీజ్



'కృష్ణ అండ్ హిజ్ లీల' చిత్రంతో ఆకట్టుకున్న కథా నాయకుడు సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు రవికాంత్ పేరెపు కలయికలో మరో సినిమా రాబోతుంది. ఈసారి వారు 'బ్యాడాస్' అనే విభిన్న చిత్రం కోసం చేతులు కలిపారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సిద్ధు జొన్నలగడ్డ మంచి నటుడే కాకుండా, ప్రతిభగల రచయిత కూడా అనే విషయం తెలిసిందే. 'బ్యాడాస్' సినిమాకి రవికాంత్ పేరేపుతో పాటు సిద్ధు జొన్నలగడ్డ రచయితగా వ్యవహరిస్తున్నారు. రవికాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. టిల్లు పాత్రతో వినోదాన్ని పంచి, ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సిద్ధు జొన్నలగడ్డ.. ఇప్పుడు 'బ్యాడాస్'లో కొత్తగా కనిపించబోతున్నారు. మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో కనిపించడమే కాకుండా.. లోతైన, పరిణతి చెందిన నటనతో మెప్పించబోతున్నారు. నిర్మాతలు టైటిల్‌తో కూడిన అద్భుతమైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'ఇఫ్ మిడిల్ ఫింగర్ వాస్ ఎ మేన్' అనే బోల్డ్ స్టేట్మెంట్‌తో ఇప్పటికే ఈ చిత్ర పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సిద్ధు జొన్నలగడ్డతో 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' వంటి ఘన విజయాల తర్వాత వారి నిర్మాణంలో వస్తున్న మూడో చిత్రమిది.



శివ రాజ్‌కుమార్ కొత్త చిత్రం ఫస్ట్ లుక్

కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. 'సప్త సాగరాలు దాటి' ఫేమ్ హేమంత్ ఎం రావు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. డాలీ ధనుంజయ కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి శివ రాజ్‌కుమార్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్‌మీడియాలో చిత్రబృందం షేర్ చేసింది. వైశాక్ గౌడ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 1970 నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుందని సమాచారం. తెలుగు, కన్నడ భాషల్లో ఈ సినిమా సిద్ధమవుతోంది.

'రాజు గాని సవాల్' టీజర్ విడుదల



లెలిజాల రవీందర్, రితికా చక్రవర్తి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'రాజు గాని సవాల్'. ఈ చిత్రాన్ని లెలిజాల కమల ప్రజాపతి సమర్పణలో, ఎల్ఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై లెలిజాల రవీందర్ నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఆగస్టు 8న శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా విడుదలయ్యేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా టీజర్‌ను నటుడు జగపతి బాబు విడుదల చేశారు. అనంతరం ఫిల్మ్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. బాపిరాజు గారితో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ సినిమాలను తెలుగు ప్రేక్షకులు అద్భుతంగా ఆదరిస్తారన్నారు. ఈ సినిమా మంచి విజయాన్ని ఖచ్చితంగా అందుకుంటుందని ఆకాంక్షించారు. నిర్మాత సాంబశివరావు, నటుడు రవీందర్ బొమ్మకంటి, నటి పద్మ, ప్రొడ్యూసర్ తరుణిక, కథానాయిక రితికా చక్రవర్తి, కథానాయకుడు లెలిజాల రవీందర్, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు మాట్లాడారు.



'ఓ భామ అయ్యో రామ' హిట్ కొట్టాలి : మంచు మనోజ్

నటుడు సుహాస్ నటిస్తున్న కొత్త సినిమా 'ఓ భామ అయ్యో రామ'. మాళవిక మనోజ్ ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతున్నారు. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ బ్యానర్‌పై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈనెల 11న ఈ సినిమా విడుదల కానుంది. హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ వేడుకలో కథానాయకుడు మంచు మనోజ్ బిగ్ టికెట్‌ను ఆవిష్కరించారు.

లార్డ్స్ రాజు ఎవరో..?

- నేటినుంచి భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య మూడో టెస్ట్
- మధ్యాహ్నం 3.30గం॥ల నుంచి



లార్డ్స్: ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత జట్టు మూడో టెస్ట్‌కు సిద్ధమైంది. లార్డ్స్ వేదికగా గురువారం ప్రారంభం కానున్న మూడో టెస్టులో భారత్-ఇంగ్లండ్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరుజట్లు 1-1 సమంగా ఉండడంతో.. లార్డ్స్‌లో టెస్టులో ఎలాగైనా గెలిచి ఆధిక్యం పెంచుకోవాలని ఇరుజట్లు ఉవ్విళ్లూరుతున్నాయి. ఇంగ్లండ్ జట్టులోకి స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ దాదాపు నాలుగేళ్ల తర్వాత తిరిగొచ్చాడు. అదేవిధంగా రెండో టెస్టుకు విశ్రాంతి తీసుకున్న టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రా.. లార్డ్స్‌లో ఆడడం ఖాయమైంది. లార్డ్స్ మైదానంలో పచ్చికతో కూడిన వికెట్‌ను తయారు చేయడంతో ఫాస్ట్ బౌలర్లకు, బ్యాటర్లకు మధ్య గట్టి పోటీ నెలకొంది. ఈ మైదానంలో గత రికార్డులను పరిశీలిస్తే... లార్డ్స్‌లో ఇప్పటివరకు 19టెస్టులు ఆడిన టీమిండియా.. కేవలం మూడింట మాత్రమే గెలిచి 12 మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది. మరో నాలుగు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. భారత జట్టు 1986లో కపిల్‌దేవ్ నేతృత్వంలో లార్డ్స్‌లో తొలి టెస్టు విజయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత 2014లో మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్సీలో, చివరగా 2021లో విరాట్ కోహ్లి నాయకత్వంలో భారత జట్టు లార్డ్స్‌లో టెస్టు మ్యాచ్‌లను గెలిచింది.

గిల్ మ్యాజిక్ రిపీట్ చేస్తాడా..?

టీమిండియా లార్డ్స్‌లో చివరగా 2021లో టెస్టు మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి సారథ్యంలోని భారత జట్టు అద్భుతం చేసింది. ఆతిథ్య ఇంగ్లండ్‌ను చిత్తు చేసిన కోహ్లి సేన.. ఏడేళ్ల తర్వాత లార్డ్స్‌లో టెస్టు విజయాన్ని అందుకుంది. 272 పరుగుల లక్ష్య చేధనలో ఇంగ్లండ్‌ను 120 పరుగులకే భారత్ ఆలౌట్ చేసి తమ సత్తాను చాటింది. ఇప్పుడు యువ సారథి శుబ్‌మన్ గిల్ వంతు. లార్డ్స్‌లో 2021 నాటి చారిత్రత్మక టెస్ట్ విజయంలో భాగమైన ఐదుగురు భారత ఆటగాళ్లు ప్రస్తుత జట్టులో కూడా ఉన్నారు. జస్ప్రీత్ బుమ్రా, కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా వంటి స్టార్ ప్లేయర్లు అప్పుడు విజయంలో కీలక పాత్ర పోషించారు. మరోసారి ఈ సీనియర్ ప్లేయర్లు తమ స్థాయికి తగ్గట్టు రాణిస్తే ఇంగ్లండ్‌ను ఓడించడం సులభమే.

ఆర్చర్‌కు చోటు...

ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌కు తిరిగి టెస్టుల్లో చోటు దక్కించుకున్నాడు. ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్ బోర్డు(ఇసిబి) మూడోటెస్ట్‌కు ప్రకటించిన తుది 11మంది ఆటగాళ్ల జాబితాలో ఆర్చర్‌కు చోటు దక్కింది. టంగ్ స్థానంలో ఆర్చర్ చోటు కల్పిస్తున్నట్లు ఇసిబి తెలిపింది. 2021 ఫిబ్రవరిలో ఆర్చర్ చివరిసారిగా టెస్టుల్లో ఆడాడు. ఆర్చర్ 13టెస్టుల్లో 31.04సగటుతో 42వికెట్లు తీసాడు. 2019, 2021 యాషెస్ సిరీస్‌లలో 20.27 సగటుతో 20వికెట్లు పడగొట్టాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో ఇంగ్లండ్ ఓటమితో ఈ మార్పు చేస్తున్నట్లు హెడ్‌కోచ్ బ్రెండన్ మెక్‌కల్లామ్ పేర్కొన్నాడు.


జట్లు(అంచనా)...

ఇండియా: జైస్వాల్, రాహుల్, కరుణ్ నాయర్, శుభ్‌మన్, పంత్(వికెట్ కీపర్), జడేజా, సుందర్, సిరాజ్, ఆకాశ్ దీప్, బుమ్రా, అర్షదీప్.

ఇంగ్లండ్ : స్టోక్స్ (కెప్టెన్), క్రాలే, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్మిత్ (వికెట్ కీపర్), వోక్స్, కార్సె, ఆర్చర్, బషీర్.

సెమీస్‌కు స్వైటెక్, బెన్సిక్

సినర్, జకోవిచ్ కూడా.. నేడు మహిళల సింగిల్స్ ఫైనల్



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి మాజీ నంబర్‌వన్ క్రీడాకారిణి ఇగా స్వైటెక్(పోలండ్), స్విట్జర్లాండ్ చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారిణి బెలిందా బెన్సిక్ ప్రవేశించారు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో స్వైటెక్ సునాయాసంగా 19వ సీడ్ సాంసునోవా(రష్యా)ను చిత్తుచేయగా.. బెన్సిక్ రెండు సెట్లను టై బ్రేక్‌లో రష్యాకు చెందిన ఆండ్రీవాను చిత్తుచేయడం విశేషం. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో బెన్సిక్ 7-6(7-3), 7-6(7-2)తో 7వ సీడెడ్ క్రీడాకారిణి ఆంద్రీవాను చిత్తుచేసింది. దీంతో కెరీర్‌లో 2019లో యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్‌కు చేరిన తర్వాత ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్‌కు చేరడం ఇదే తొలిసారి. ఇక పోలండ్‌కు చెందిన 8వ సీడ్ ఇగా స్వైటెక్ 6-2, 7-5తో 19వ సీడ్ సంసునోవాను ఓడించింది. దీంతో స్వైటెక్ తొలిసారి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్‌కు చేరింది. ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను నాలుగుసార్లు, యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ను 2022లో చేజిక్కించుకుంది.

టాప్‌సీడ్ సిన్నర్ కూడా..

పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి సినర్, జకోవిచ్ ప్రవేశించారు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సినర్ 7-6(7-2), 6-4, 6-4తో 10వ సీడ్, అమెరికాకు చెందిన షెల్టన్‌ను, జకోవిచ్ 6-7(6-8), 6-2, 7-5, 6-2తో కోబొల్లి(ఇటలీ)ని ఓడించాడు.

ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్‌లో
రిషబ్, జ్యోతి ప్రపంచ రికార్డు



మాడ్రిడ్: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4లో రిషబ్ యాదవ్-వెన్నం జ్యోతి సురేఖ ప్రపంచ రికార్డు స్కోర్‌ను నెలకొల్పారు. మంగళవారం జరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్ స్టేజ్-1 వ్యక్తిగత విభాగాల్లో వీరు 716, 715పాయింట్లు చొప్పున సాధించారు. ఓవరాల్‌గా 1431పాయింట్లతో ఈ జంట ప్రపంచ రికార్డును నెలకొల్పింది. అంతకుముందు ఈ రికార్డు డెన్మార్క్‌కు చెందిన టాంజా జెలెంథిన్-మథయాస్(1429పాయింట్లు) పేరిట ఉంది. వారు 2023లో ఈ రికార్డును నెలకొల్పగా.. తాజాగా రిషబ్-జ్యోతి ఆ రికార్డు స్కోర్‌ను అధిగమించారు. రిషబ్ తొలి మూడు బాణాలను 10కి 10పాయింట్లు చొప్పున సాధించి 30పాయింట్లతో తన జైత్రయాత్రను మొదలుపెట్టాడు. ఇక జ్యోతి ఈ టోర్నీలో చివరి 67బాణాల్లో 24బాణాలను 10కి 10 పాయింట్లు సాధించింది. తైపీ వేదికగా జరిగిన ఆర్చరీ మహిళల టీమ్ విభాగంలో జ్యోతి, ప్రణీత్ కౌర్, ప్రతిభా ప్రదీప్ కలిసి టైటిల్‌ను సాధించిన సంగతి తెలిసిందే. రిషబ్, ప్రథమేష్ ఫుంగే, అమన్ సైనీలతో కూడిన పురుషుల జట్టు క్వార్టర్‌ఫైనల్లో ఫ్రాన్స్ చేతిలో ఓటమిపాలైంది.

ఎక్స్ సిఇఒ లిండా యాకరినో రాజీనామా

- రెండేళ్ల సర్వీసు చేసిన లిండా

టెక్సాస్ : ప్రముఖ సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ సిఇఒ లిండా యాకరినో తన పదవికి రాజీనామా చేశారు. రెండేళ్ల సర్వీస్ అనంతరం వైదొలుగుతున్నట్లు బుధవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఎక్స్ ఎఐతో కృత్రిమమేథ కొత్త అధ్యాయంలోకి చేరుకుందని తన అనుభవాలను పంచుకున్నారు. ఎలాన్ మస్క్ మీ సహకారానికి ధన్యవాదాలంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

2022 చివరిలో ట్విట్టర్‌ను 44 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసి, సిబ్బందిని భారీగా తగ్గించిన తర్వాత, మస్క్ 2023 మేలో ప్రకటనల రంగంలో అనుభవజ్ఞురాలైన లిండాను సిఇఒ నియమించారు. ఆమె ప్రధానంగా కంపెనీ వ్యాపార కార్యకలాపాలను నిర్వహించడంపై కేంద్రీకృతమై పనిచేస్తారని, తన దృష్టి ఉత్పత్తి రూపకల్పన, కొత్త సాంకేతికతలపై ఉంటుందని మస్క్ అప్పట్లో తెలిపారు. ఇటీవల గ్రోక్ చాట్‌బాట్ నుంచి అడాల్ఫ్ హిట్లర్‌ను ప్రశంసిస్తూ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసింది. ఇది యూదులకు వ్యతిరేకంగా ఉందని దుమారం రేగింది. దీనిపై గ్రోక్ చేసిన ఇటీవలి పోస్ట్‌ల గురించి మాకు తెలిసింది, అనుచితమైన పోస్ట్‌లను తొలగిస్తామంటూ యాజమాన్యం వివరణ ఇచ్చింది.

ఈక్విటాస్ ఎస్ఎఫ్‌బి, ఎడెల్విస్ లైఫ్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ : ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఎడెల్విస్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలు సంయుక్త భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా తమ బ్యాంక్ కస్టమర్లు ఎడెల్విస్ లైఫ్‌కు చెందిన జీవిత బీమా ఉత్పత్తుల రక్షణ, సేవింగ్స్, ఎండోమెంట్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఈక్విటాస్ ఎస్ఎఫ్‌బి పేర్కొంది. తమ ఉనికిని బలోపేతం చేస్తూ వినియోగదారుల ఆకాంక్షలకు అనుగుణమైన బీమా సేవలను అందించనున్నట్లు ఎడెల్విస్ లైఫ్ పేర్కొంది.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

భారతీయ వాయు సేన లో ఎయిర్ మెన్ శాశ్వత పద్ధతిన, అగ్నిపథ్ పథకంలో 4ఏళ్ల కాల పరిమితికి అగ్నివీర్ (వాయు)గా చేరేందుకు అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోరారు. ఎంపిక పరీక్ష కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ 2025 జులై 11న 11 గంటలకు ప్రారంభమై, జులై 31న రాత్రి 11 గంటలకు ముగుస్తుందని తెలిపారు. ఈ వెబ్ పోర్టల్‌ల ద్వారా https://airmenselection.cdac.in,https://agnipathvayu.cdac.in తాత్కాలిక అడ్మిట్ కార్డులు జారీ చేసిన నమోదిత అభ్యర్థులు మాత్రమే ఎంపిక పరీక్షకు హాజరవుతారని కలెక్టర్ స్పష్టం చేశారు.



తప్పని డోలీ కష్టాలు

ప్రజాశక్తి- అనంతగిరి

గర్భిణీలకు డోలీ కష్టాలు మన్యంలో వెంటాడుతూనే ఉన్నాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గత 8 నెలల క్రితం మండలంలోని పిన్నకోట పంచాయతీ పరిధి బలగరువు గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో డోలీ రహిత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కానీ అది ఎక్కడా అమలు కాలేదు. మండలంలోని పిన్నకోట పంచాయతీ పరిధి పందిరివలస గ్రామానికి చెందిన డిప్పల రాములమ్మ పురిటి నొప్పులతో బుధవారం ఉదయం తెల్లవారున బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు అటవీ ఎగువ ప్రాంతం నుండి దిగువ బొర్రాపల్లేం మెయిన్ రోడ్డు ఆరు కిలోమీటర్లు చేర్చి అక్కడ నుంచి పిన్నకోట ప్రభుత్వ ఆసుపత్రికి తొమ్మిది కిలోమీటర్లు గర్భిణీని వైద్యం కోసం తరలించారు.

వడ్డీ వ్యాపారి అరాచకానికి చిరు వ్యాపారి బలి

ప్రజాశక్తి - సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో వడ్డీ వ్యాపారి అరాచకానికి ఓ చిరు వ్యాపారి బలయ్యారు. వడ్డీ వ్యాపారి ధనదాహం తట్టుకోలేక తనువు చాలించాడు. బుధవారం ఉదయం 4.30 సమయంలో తన షాపులోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. తాను నమ్మిన స్నేహితుడే తనని నట్టేట ముంచేశాడని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యకు ముందు చిరు వ్యాపారి ఇందుగొ నాగభూషణరావు రికార్డు చేసిన ఆడియోను విడుదల చేశాడు. ఆ ఆడియో చాలా మందికి పంపించడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది. సాలూరు పట్టణంలోని మామిడివలస జంక్షన్‌లో ఎలక్ట్రిక్ షాపు నడుపుతున్న వ్యాపారి ఇందుగొ నాగభూషణరావు డబ్బివీధికి చెందిన వడ్డీ వ్యాపారి డబ్బి కృష్ణారావు వద్ద సుమారు రూ.40 లక్షల వరకు వాడుకున్నారు. ఆ డబ్బు ఎప్పటికీ తిరిగి ఇవ్వడం లేదని నాగభూషణరావు షాపును వడ్డీ వ్యాపారి కృష్ణారావు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కోటి రూపాయల విలువైన షాపును రూ.75 లక్షలకే స్వాధీనం చేసుకున్నారు. నాగభూషణరావు వాడుకున్న రూ.40 లక్షల అప్పు మినహాయిస్తే మిగిలిన రూ.35 లక్షలు ఆయన చేతికి ఇవ్వాలి. కానీ వడ్డీ వ్యాపారి రూ.10 లక్షలే నాగభూషణరావుకు ఇచ్చి రూ.25 లక్షలు తన వద్దే ఉంచుకున్నారు. కృష్ణారావు కొనుగోలు చేసిన షాపును నాగభూషణరావుకు తనఖా ఇచ్చారు. షాపునకు అద్దె కింద నెలకు రూ.20 వేలు, రూ.పది లక్షలకు వడ్డీ రూ.10 వేలు చొప్పున నాగభూషణరావు ప్రతినెలా కృష్ణారావుకు చెల్లిస్తున్నారు. తన డబ్బు ఉంచుకొని తన వద్దనే వడ్డీ డబ్బులు వసూలు చేయడం, షాపు తనఖా రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పి సాధారణ తనఖా పత్రం రాయడం, దీనికి నెలనెలా అద్దె వసూలు చేయడంతో నాగభూషణరావు భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన విడుదల చేసిన ఆడియోలో వివరించారు. నాగభూషణరావుకు భార్య పద్మావతి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన నాగభూషణరావు జేబులో రాతపూర్వక లేఖ కూడా వున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఆ లేఖను స్వాధీనం చేసుకున్నారు.

కుటుంబానికి న్యాయం చేయండి

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి ఉద్దేశించి కూడా చిరు వ్యాపారి నాగభూషణరావు ఆడియో విడుదల చేశాడు. తన స్నేహితుడు కృష్ణారావు మోసాన్ని భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన వేడుకున్నాడు. తనకు కృష్ణారావు ఇవ్వాల్సిన డబ్బు రూ.15 లక్షలు, నెలనెలా చెల్లించిన డబ్బు రూ.12 లక్షలు తన కుటుంబానికి ఇప్పించాలని కోరాడు.

ఘాటెక్కిన పచ్చిమిర్చి

- మొన్న బస్తా రూ.800, నేడు రూ.3 వేలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ (వైఎస్ఆర్ జిల్లా)

నిన్న మొన్నటి వరకు పచ్చి మిరపకాయల బస్తా ధర రూ.500 నుండి రూ.800 వరకు ఉండేది. ఆ ధర బుధవారం అమాంతంగా పెరిగింది. మార్కెట్లో రూ.3000కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మిరప రైతుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

పులివెందుల నియోజకవర్గంలో లింగాల, పులివెందుల, వేముల, తొండూరు మండలాలలో సుమారు 500 ఎకరాల్లో రైతులు మిరప పంటను సాగు చేశారు. ఎకరాకు సుమారు రూ.50 వేలు వరకు పెట్టుబడులు పెట్టామని, పంట ఏప్రిల్ చివరిలో కోత కొచ్చిందని, అప్పటినుంచి జూన్ చివరి వరకు 53 కిలోల బస్తా ధర రూ.500 నుంచి రూ.800 మాత్రమే ఉండేది. ఈనేపథ్యంలో కొంతమంది రైతులు పంటను తొలగించారు. అయితే బుధవారం ఏకంగా బస్తాపై రూ.2,200 అమాంతంగా ధర పలికిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా మిరప రేటు పెరుగుతుందని భావించిన రైతులు పంటను తొలగించకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. వారికి లాభాలు వస్తున్నాయి.

ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

- జెఎన్‌టియు విసి హెచ్. సుదర్శన రావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, బ్లెకింగ్ వర్శిటీ(స్వీడన్) సంయుక్త ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్ ఆచార్య హెచ్.సుదర్శన రావు తెలియజేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో భాగంగా బీటెక్ మూడు సంవత్సరాలు అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో, ఒక సంవత్సరం విద్యను స్వీడన్ బ్లెకింగ్ యూనివర్సిటీలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. బీటెక్ డిగ్రీని అనంతపురం జెఎన్‌టియు, బిఎస్ పట్టాను బ్లెకింగ్ వర్శిటీ ప్రదానం చేస్తుందన్నారు. ఎంఎస్(మాస్టర్స్) ప్రోగ్రాంను బిటిహెచ్, స్వీడన్‌లో చేయొచ్చని తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు జెఈఈ, ఈఏపీసెట్ ఆంధ్ర ప్రదేశ్ లేదా తెలంగాణలో అర్హత సాధించి ఉండాలన్నారు. ఈ కోర్సు ద్వారా విదేశాల్లో ఉద్యోగం సంపాదించేందుకు ఇక్కడి విద్యార్థులకు ఇది గొప్ప అవకాశం అన్నారు. రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ కోర్సులో భాగంగా బీటెక్ (కంప్యూటర్ సైన్స్), బీటెక్ (ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్) కోర్సులను అందిస్తోందన్నారు. అభ్యర్థులు మాస్టర్ కోర్సును మరో రెండు సంవత్సరాల పాటు స్వీడన్‌లో చదువుకోవచ్చన్నారు. ఇంటర్మీడియట్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులన్నారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులు ఉండాలన్నారు. జెఈఈ మెయిన్స్ ర్యాంకు, ఎంసెట్ ఇతర స్టేట్ లెవల్ సెట్స్ ర్యాంకులు పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి స్పాట్ అడ్మిషన్స్ ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు పొడిగించామని చెప్పారు. 17వ తేదీ కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తామని ఫారిన్ ఎఫైర్స్ డైరెక్టర్ పి. సుజాత తెలియజేశారు.

దేశ చరిత్రలో నిలిచిపోయే ఆవిష్కరణలు చేపట్టాలి

- ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ ఎన్‌వి.రమణారావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా)

దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే కొత్త కొత్త ఆవిష్కరణల రూపకల్పనకు కృషి చేయాలని ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌వి.రమణరావు సూచించారు. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆర్థిక సహాయంతో విద్యా సంస్థలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఐసిటి అకాడమీ, ఎపి నిట్, వరంగల్ నిట్ హబ్ సంయుక్తం గా బయో ప్రాసెసింగ్‌లో కంప్యూటర్ ఆధారిత ప్రోటీన్ సైన్స్ ఇన్నోవేషన్స్ అనే అంశంపై రెండు వారాలుగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎన్‌వి.రమణరావు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం వంటి సాంకేతికతల సహాయంతో నాణ్యమైన పరిశోధనలు చేపట్టేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అచార్యులదేనని వివరించారు.



840 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-అనకాపల్లి

అక్రమంగా గంజాయిని తరలిస్తున్న 42 లక్షల రూపాయల విలువైన 840 కేజీల గంజాయిని అనకాపల్లి జిల్లా నక్కపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేశారు. తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి తుహిన్ సిన్హా ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నక్కపల్లి ఇన్‌స్పెక్టర్ కె.కుమారస్వామి, ఎస్ఐ కె.సన్నిబాబు వారికి వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు.

ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 840 కేజీల గంజాయి పట్టుబడింది. గంజాయిని, ఒక బొలెరో వాహనం, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. చింతపల్లి మండలం మామిడి పాలెం గ్రామానికి చెందిన సుక్రీ అర్జున్, డేగల పాలెం గ్రామానికి చెందిన వంతల సురేష్, రోలుగుంట మండలం పెద్దపేట గ్రామానికి చెందిన కొదమ నాగరాజు, గొలుగొండ మండలం ఏటి గైరంపేటకు చెందిన కైసర్ల దివాకర్, నక్కపల్లి మండలం ఉప్మాక పంచాయతీకి చెందిన ఎలమంచిలి రమణ ఒడిశాలోని జనబ ప్రాంతంలో గంజాయిని కొని అక్కడ ఉయ్యాల బ్రిడ్జ్ వద్ద బోలెరో వాహనంలో మొత్తం 840 కేజీల గంజాయిని, 20 బస్తాలతో లోడ్ చేశారు. అక్కడ నుంచి ధారకొండ, చింతపల్లి మీదగా డౌనూరు తీసుకువచ్చి, డౌనూరు చెక్ పోస్ట్‌కు ముందు పోలీస్ వారికి దొరకకుండా మనుషులతో తోటలలో ఉన్న కాలిబాట ద్వారా మోయించి మరలా డౌనూరు చెక్ పోస్ట్ దాటిన తరవాత మరలా బొలెరోలో లోడ్ చేయించారు. అక్కడ నుండి నర్సీపట్నం, తాళ్ళపాలెం మీదగా కర్ణాటకకు తీసుకువెళ్తుండగా నక్కపల్లి మండలం, వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద సదరు గంజాయిని, నలుగురు నిందితులను పట్టుకున్నట్లు ఎస్‌పి తెలిపారు.

ఈ కేసులో ప్రమేయం ఉన్న ఇతర నిందితులను కూడా పట్టుకోవడానికి ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు బందాన్ని అభినందించి ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను అందజేశారు. ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, నర్సీపట్నం డిఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, నక్కపల్లి సీఐ కె.కుమారస్వామి, ఎస్సై కె.సన్నిబాబు, నక్కపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మికలోకం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. లక్షలాదిమంది కార్మికులు ఎర్రజెండాలు చేబూని, పట్టణాల్లో, నగరాల్లో కదం తొక్కారు. కార్మిక చట్టాలకు పాతరేసి, కార్పొరేటు యాజమాన్యాలకు సేవ చేసే లేబర్ కోడ్లు తీసుకురావటాన్ని తీవ్రంగా విమర్శించారు. కార్మిక చైతన్య గీతాలు ఆలాపిస్తూ, నినాదాలు చేస్తూ, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు భారీ ప్రదర్శనలతో తమ సమైక్య శక్తిని చాటి చెప్పారు.



■ కేరళలో : కొచ్చి రిఫైనరీ వద్ద



■ భోపాల్‌లో : బ్యాంకు ఉద్యోగుల ప్రదర్శన


■ జాదవ్‌పూర్‌లో రైలురోకో దృశ్యం



■ విశాఖపట్నంలో వివిధ కార్మిక, ఉద్యోగ సంఘాల ప్రదర్శన



■ తాడేపల్లిగూడెంలో హోరెత్తిన కార్మికులు, ఉద్యోగులు



■ గుంటూరులో భారీ ర్యాలీ



■ చిత్తూరులో రోడ్డుపై బైఠాయించి నిరసన



■ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ...



■ చీమకుర్తిలో ప్రదర్శన


■ కర్నూలు జిల్లా ఆదోనిలో మహిళా కార్మికుల గర్జన



■ శ్రీకాకుళంలో



■ నెల్లూరులో సిబిఎం కాంపౌండు నుంచి కాయగూరల మార్కెట్ వరకూ ర్యాలీ

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68